ఫిబ్రవరి
2017

130

సంపుటి : 11 సంచిక : 10 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

నోట్ల ఉపసంహరణ ప్రజాధనంపై దాడి

నాయకులు కార్యకర్తలు

వ్యవసాయ రంగం : వర్గపొందికలో మార్పులు

డిజిటల్ భ్రమలు

పెట్టుబడిదారులకు సోషలిజం - కార్మికులకు కేపిటలిజం

చరిత్ర గతిని మార్చిన నవంబర్ 7

పెట్టుబడిదారి వ్యవస్థ, అణగారిన కులాలు

జమిలి ఎన్నికలు దేశ సమాఖ్య వ్యవస్థకు విరుద్ధం

వ్యక్తిగత లాభాపేక్ష పెరగటమే సోవియట్ పతనానికి కారణం

ఒక దళిత యోధుని సమరగాధ

# ఒక దళిత యోధుని సమరగాథ

సమాజం నిరంతరం మారుతుంది. సమాజమార్పుకు ఘర్షణే కారణం. ఘర్షణలు పలురకాలుగా ఉండవచ్చు. ఆర్థికరంగంలోనూ, సామాజిక రంగంలోనూ ఇలా అన్ని రంగాలలో ఘర్షణ కొనసాగుతుంది. ప్రతి ఘర్షణ కొంత ఫలితాన్ని ఇస్తుంది. సామాజిక రంగంలో కొద్దిపాటి మార్పును తీసుకువచ్చిన ఒక నిరక్షరాస్యుని కథ ఇది.

1881సం॥రం నాటిమాట. ఆరోజుల్లో ఒక చేరుమాన్ (బానిస) ధర 6 నుంచి 9 రూపాయలు మాత్రమే. చేరుమాన్ అంటే తక్కువ కులానికి చెందిన అస్పృశ్యుడు. అంటే ఎవరైనా చేరుమాన్‌ని కొనుక్కోవచ్చు లేదా అమ్ముకోవచ్చు, అద్దెకు తెచ్చుకోవచ్చు - కాదంటే దానం చేయవచ్చు. ఆరోజుల్లో ఆడపిల్ల అత్తారింటికి వెళ్తుంటే కట్నంగా ఇచ్చి పంపే జీవం లేని వస్తువుల మధ్య చేరుమాన్ కూడా ఉండేవాడు. గుళ్ళకు, గోపురాలకు చేరుమాన్‌ను బహుమతిగా ఇచ్చేసే దానకర్ణులు ఉండేవారు.



సమాజంలో ఇటువంటి దురన్యాయం రాజ్యమేలుతున్న రోజుల్లో పుట్టాడు - అయ్యంకాళి. నిరక్షరాస్యుడైన ఈ యోధుడు తన జాతి ప్రజల జీవితాలలో మార్పు తెచ్చేందుకు వారి పోరాటాలకు నాయకత్వం వహించాడు. అంటరాని వారు రోడ్డు మీద నడవటానికి నిషేధం ఉన్న రోజుల్లో ఒక అంటరాని కులంలో పుట్టి, తాను స్వయంగా అన్ని నిషేధాలు ఉల్లంఘించి రోడ్డు మీద నిటారుగా నడిచాడు. అంటరానివారికి రోడ్లన్ని తెరిపించి, వారందర్ని రోడ్ల మీద నడిపించి, ఆ నడిచే హక్కు కోసం వేలాదిమందితో పోరాటాలు చేయించి మానవ హక్కుల్ని మొదటి సారిగా ప్రతిష్టించిన యోధాన యోధుడు అయ్యంకాళి. సవర్ణులు (అగ్రవర్ణాలు) కొట్టిన దెబ్బలకు రక్తం కారుతున్నా రోడ్డు మీద నడిచే హక్కును నిలబెట్టుకున్న పోరాట చరిత్ర భారతదేశంలో బహుశా మరెక్కడా లేదేమో.

కేరళ రాష్ట్రంలో తిరువనంతపురానికి ఉత్తరాన 13 కిలోమీటర్ల దూరంలో వెంగనూరు అనే పల్లె ఒకటి ఉంది. ఆ ఊరిలో అయ్యన్, మాల దంపతులకు పుట్టాడు కాళి. 1863 ఆగష్టు 28 నాటి మాట. అప్పటి ట్రావెంకూర్‌లో వెంగళూరు ఉండేది. పులయా కులానికి చెందిన అయ్యన్ కుటుంబంలోని ఏడుగురు సంతానంలో కాళి ఒకడు, ఆ తరువాత అతనే అయ్యంకాళి అయ్యాడు (ఇప్పటి కేరళ దక్షిణ ట్రావెంకూర్, మధ్యకొచ్చి, ఉత్తర మలబార్లు కలగలిపిన రాష్ట్రం).

అయ్యంకాళి పొడుగుగా చేపాటి మనిషిలా, యువకుడుగా ఎదిగాడు. కండలు తిరిగిన శరీరం వల్ల మార్షల్ ఆర్ట్సులో ప్రావీణ్యం వల్ల ఆ ప్రాంతాలకు ఆయన సుపరిచితుడే. కోడెకారు వయసులో అయ్యంకాళి తన తోటివారితో ఫుట్‌బాల్ ఆడేవాడు. ఫుట్‌బాల్ ఆడుతుండగా ఆయన తన్నిన బంతి ఒక నాయర్ ఇంటి కప్పు మీద పడింది. అప్పుడే ఆ నాయర్ ఈ పులయ యువకుడ్ని అగ్రకుల పిల్లలతో నువ్వెప్పుడూ ఆడకూడదు అని హెచ్చరించాడు. అయ్యంకాళి తండ్రి ఒక భూస్వామి వద్ద పని చేసేవాడు. ఆ భూస్వామి అయ్యంకాళి తండ్రితో అడవులను నరికించి సేద్యపు భూములుగా మార్చాడు. దయగల భూస్వామి చదును చేసిన ఆ భూమిలో కొంత భాగాన్ని అయ్యంకాళి తండ్రికి ఇచ్చాడు. అప్పుడు అది ఒక పెద్ద సంచలనం. ఒక పులయకు కొద్దిపాటి భూమి ఉండటం కూడా భూస్వాములకు అశాంతిని కలిగించేది. వయసులో ఉన్న అయ్యంకాళి తన తోటివారితో కలసి హరిశ్చంద్ర లాంటి నాటకాలు ఆడేవారు. అప్పుడప్పుడు సొంతంగా నాటకాలు తయారు చేసి ఆడేవారు. సహజంగానే ఇవి అంటరానివారిని మేల్కొలిపేవిగా ఉండేవి. అంటరానివారిపై జరుగుతున్న దౌర్జన్యాన్ని వ్యతిరేకిసూ, ఒక సామాజిక నిరసనగా ఉండేవి. కొచ్చి, మలబార్ ప్రాంతాలలో అంటరాని వాళ్లలో ఇవి చైతన్యం నింపేవి.

అతడు రెండు తెల్లని ఎడ్లను కొన్నాడు. వాటి మెడలో రెండు పెద్ద పెద్ద గంటలు కట్టాడు. శుభ్రంగా ధోవతి ధరించేవాడు. భుజం మీద తువాలు ఉండేది. నెత్తిన రుమాలు, మార్కెట్లో గంటల సవ్వడి బండితో బోర విరుచుకొని వెళ్ళే ఈ పులయ యువకుడి వైపు అగ్రవర్ణాలు భయం భయంగా చూసేవారు. పని చూసుకొని తిరిగి ఇంటికి వెళ్ళేటప్పుడు అగ్రకుల యువకులు దర్పంతో మఖ్‌మల్ ధోతి కట్టావేంటి అని అడిగారు. దానికి ఆయన ఇచ్చిన సమాధానం పొడవాటి బాకు ఒకటి తీసి ఖంగున మోగే గొంతుతో నాకు ఎవడైనా అడ్డు వస్తే ఈ పిడిబాకు మజా రుచి చూపిస్తా అనేవాడు. అది అతని ధిక్కారం. అయ్యంకాళి ఎడ్లబండిపై తిరిగినా ఎవరూ అసలు ప్రశ్నించేవారు కాదు. అతనిలా ఇతరులు మాత్రం ఆ వీధుల్లో నడవటానికి వీలు లేదు. అప్పుడే అయ్యంకాళి స్వేచ్ఛ కోసం నడక అనే ఉద్యమం ప్రారంభించాడు. బలరాంపురంలోని చెళియార్ బజారుకు దళితుల బృందం చేరుకునే సరికి అగ్రవర్ణాల గుంపు వారిని నడవకుండా నిరోధించింది. ఇకనేం కొట్లాట. ఇరువర్గాల రక్తం చిమ్మింది. ఆ రకంగా అది మొదటి దళితుల సాయుధ తిరుగుబాటు ఉద్యమం అయ్యింది.

### చదువు కోసం పోరాటం

అయ్యంకాళి పిల్లాడిగా ఉన్నప్పుడు దళితులకు బడిలోకి ప్రవేశం లేదు. కనీసం తన తరువాత తరమైన చదువు నేర్చుకోవాలని అతనికి ఉండేది. 1904 ప్రాంతంలో దళితులను సర్కారీ బడిలోకి రానివ్వనందు వలన సొంత పాఠశాలలు నెలకొల్పే ప్రయత్నం చేశారు. ఈ స్కూళ్లలో కనీసం నల్లబల్లలు కూడా ఉండేవి కావు. ఇసుకే వారికి బ్లాక్ బోర్డు. వాళ్ళ వేళ్ళే వాళ్ళకు పెన్సిళ్లు. ఈ విధంగా దళితులు బహిరంగంగానే చదువుకుంటూ నియమాలను ధిక్కరించారు. అన్నింటికన్నా ముందు వెంగనూరులో బడి ఏర్పాటయ్యింది. కాని దాన్ని అగ్రకులాల వారు ధ్వంసం చేశారు.

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...


1. ఒక దళిత యోధుని సమరగాథ
గుండు నారాయణరావు ...... 2

2. నోట్ల ఉపసంహరణ ప్రజాధనంపై దాడి
బి.వి.రాఘవులు ............... 4

3. నాయకులు కార్యకర్తలు
ఎస్. వీరయ్య ................. 8

4. వ్యవసాయ రంగం : వర్గపొందికలో మార్పులు
ఎ.కోటిరెడ్డి ................... 11

5. డిజిటల్ భ్రమలు
జయతీఘోష్ ................. 17

6. పెట్టుబడిదారులకు సోషలిజం - కార్మికులకు కేపిటలిజం
నోమ్‌చోమ్‌స్కీ................. 20

7. చరిత్ర గతిని మార్చిన నవంబర్ 7
ఆల్బర్ట్ ఆర్ విలియమ్స్...... 23

8. పెట్టుబడిదారి వ్యవస్థ, అణగారిన కులాలు
ప్రభాత్‌పట్నాయక్............ 25

9. జమిలి ఎన్నికలు దేశ సమాఖ్య వ్యవస్థకు విరుద్ధం
సత్తారుభాస్కరరావు ........... 31

10. వ్యక్తిగత లాభాపేక్ష పెరగటమే .......... సోవియట్ పతనానికి కారణం
బి.వి.రాఘవులు .......... 33



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ముద్రణ : ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
ఫోన్: ఎడిటోరియల్ 0866-2577248
మేనేజర్: 040-27673787
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# కేంద్ర బడ్జెట్

దేశం ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతున్నప్పుడు విజ్ఞత గల ఏ ప్రభుత్వమైనా ప్రజల కొనుగోలు శక్తిని పెంచే చర్యలు తీసుకుంటుంది. ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరిగి, ఆదాయాలు పెరిగితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది. అప్పుడు దేశం ఆర్థిక మందగమనం నుండి బయట పడుతుంది. ప్రజలకు ఉపాధి, ఆధాయాలు పెరగాలంటే ప్రభుత్వం వ్యవసాయం, ప్రాధమిక సదుపాయాలు, విద్య, వైద్యం, సంక్షేమ రంగాలపై ఖర్చులు పెంచాలి. కానీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఈ విజ్ఞత కొరవడినట్లు పార్లమెంటులో అది ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ తెలియజేస్తోంది.

ఒకవైపు దేశంలో నోట్ల రద్దు వల్ల ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుకున్నదని ప్రభుత్వమే ఒప్పుకుంటున్నది. దేశ, విదేశీ సర్వే సంస్థలన్నీ మన ఆర్థికాభివృద్ధి మందగించినట్లు చెబుతున్నాయి. అన్ని రంగాలనుండీ వస్తున్న ఫలితాలు కూడా దీన్నే తెలియజేస్తున్నాయి. ఇంకోవైపు అంతర్జాతీయంగా కూడా పరిస్థితులు అనుకూలంగా లేవు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక విధానాలు, ప్రపంచ ఆర్థిక సంక్షోభం మన దేశంలోని ఐటి, ఫార్మా, టెక్స్‌టైల్స్ తదితర రంగాలను దెబ్బతీసే సూచనలు కనిపిస్తున్నాయి. ఇంటా బయట పరిస్థితుల దృష్ట్యా రానున్న కాలంలో దేశంలో ఆర్థిక కార్యకలాపాలు తగ్గి నిరుద్యోగం పెరుగుతుందనీ, వ్యవసాయాదాయం మరింత తగ్గిపోతుందని జనవరి 31న విడుదలైన ఆర్థిక సర్వే కూడా సూచించింది.

ఇలాంటి పరిస్థితుల్లో బడ్జెట్‌లో ఖర్చులు పెంచి దేశీయ గిరాకీని పెంచాల్సిందిపోయి మన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో ప్రజల ఆదాయాలను మరింతగా పిండేసి కొనుగోలు శక్తి మరింత తగ్గించే చర్యలు తీసుకోవడం విస్మయం కలిగిస్తుంది. మొదటిది, ఆయన మొత్తం బడ్జెట్‌నే కుదించేశారు. గతేడాది మన జిడిపిలో బడ్జెట్ శాతం 13.4 నుండి ఈ ఏడాది 12.7 శాతానికి తగ్గించారు. అంతర్జాతీయ ఫైనాన్స్ కాపిటల్ ఆదేశించిన స్థాయికి ద్రవ్యలోటును కుదించి ఉంచడానికే ఈ ఆర్థిక విన్యాసాలన్నీ. రెండవది, బడ్జెట్‌ను కుదించడానికి సామాన్యులపై భారాలు వేసే మార్గం ఎన్నుకున్నారు. వ్యవసాయం, గ్రామీణ ఉపాధిహామీ పథకం, ఎస్సీ, ఎస్టీ, మహిళా సంక్షేమం, ప్రాధమిక విద్య, వైద్యం, ప్రాధమిక సదుపాయాలు తదితర రంగాలకు నిధులను బిగపట్టేశారు. గృహనిర్మాణ రంగంలో బడా కంపెనీలకు రాయితీలు ప్రకటించడం ద్వారా మరోసారి రియల్ ఎస్టేట్ బుడగను సృష్టించి ఆర్థిక రంగాన్ని గట్టెక్కించవచ్చునని ప్రభుత్వం ఆశపడ్డట్టు కనిపిస్తోంది.

రైల్వే బడ్జెట్‌ను మొదటి సారి సాధారణ బడ్జెట్‌తో కలిపి ప్రవేశపెట్టారు. ఇతర రవాణా రంగాలన్నిటితో రైల్వేలను కూడా కలిపి ఛార్జీల మోత మోయించబోతున్నట్లు జైట్లీ బడ్జెట్‌లో స్పష్టంగానే చెప్పారు. రైల్వే భద్రతకోసం కేటాయించిన భారీ మొత్తం సుమారు రూ. లక్ష కోట్లు కూడా సామాన్యుని నుండే పిండుతారు. ఎఫ్‌డిఐలకు తలుపులు పూర్తిగా తెరవడం, రైల్వేకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థలను స్టాక్ మార్కెట్‌లో లిస్టు చేయడం విదేశీ, స్వదేశీ సంస్థలకు లాభం చేకూర్చడానికే.

మొత్తంగా చూసినప్పుడు మోడీ ప్రభుత్వం కార్పొరేట్ రంగ ప్రయోజనాలకోసమే ఈ బడ్జెట్ వండి వార్చి వడ్డించినట్లు స్పష్టమవుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థకూ, సామాన్య ప్రజానీకానికీ నష్టదాయకమైన బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి మాటలగారడీతో మసిపూసి మారేడుకాయ చేశారు. బడ్జెట్‌లోని ఈ మాటల వెనుక మర్మాన్ని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# నోట్ల ఉపసంహరణ ప్రజా ధనంపై దాడి



రచయిత సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

బి.వి.రాఘవులు

నవంబర్ 8వ తేదీన బిజెపి ప్రభుత్వం 500, 1,000 రూపాయల నోట్లను చలామణి నుండి ఉపసంహరించింది. ఈ నోట్ల ఉపసంహరణ నిర్ణయం వల్ల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. తమ డబ్బును తాము తీసుకోవటం కోసం బ్యాంకులు, ఎటియంల వద్ద గంటలు, రోజుల తరబడి క్యూలలో నిలబడటంతో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. సామాన్య ప్రజల దైనందిన జీవితం అస్తవ్యస్తంగా మారింది.

ఈ నిర్ణయం వల్ల స్వల్ప కాలంలో ఇబ్బందులు ఎదురైనప్పటికీ, భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుందని, మంచి పరిణామా లకు దారితీస్తుందని బిజెపి ప్రభుత్వం రకరకాల భ్రమలు కల్పించింది. నల్లధనం వెలికితీసే క్రమంలో ఇబ్బందులు ఉంటాయి. మన దేశానికి కలగబోయే లాభాల దృష్ట్యా దేశం కోసం, దేశభక్తులుగా ప్రజలు ఈ ఇబ్బందులను భరించాలని చెప్పింది. నోట్లరద్దు వలన నష్టం జరుగుతుందని చెప్పేదంతా అబద్ధం అని బిజెపి చెబుతున్నది. అక్కడక్కడ జరుగుతున్న చిన్న విషయాలను ప్రతిపక్షాలు పెద్దవి చేసి ప్రచారం చేస్తున్నాయని, ఇప్పుడిప్పుడే ఫలితాలు కనపడుతున్నాయని, భవిష్యత్‌లో నోట్లరద్దు లాభాలు అందరికీ అందుతాయని ప్రచారం చేస్తున్నది. నల్లడబ్బు పెద్ద మొత్తంలో ఉంది. మోడీ దాన్ని వెలికితీసి ప్రజలకే పంపిణీ చేస్తాడు అని ప్రజలను కొంత మేరకు నమ్మించగలిగింది.

దేశంపై పిడుగు పడ్డట్లుగా నవంబర్ 8వ తేదీన 500, 1,000 రూపాయల నోట్లను ఉపసంహరిస్తున్నట్టు మోడీ ప్రభుత్వం హఠాత్తుగా ప్రకటన చేసింది. ఈ రెండురకాల నోట్ల విలువ మొత్తం కరెన్సీలో 85 శాతం ఉంటుంది. నోట్లను ఉపసంహరించుకున్నప్పటికీ అంతే విలువగల 15 లక్షల కోట్ల రూపాయల కొత్తనోట్లను నవంబర్ 8వ తేదీనాడే ప్రవేశపెట్టినట్లయితే సమస్యలు వచ్చేవి కాదు. 15 లక్షల కోట్ల రూపాయల విలువగల నోట్లు ముద్రించటానికి ఎన్ని నెలలు పడుతుందనే అంచనా కూడా లేకుండా మూడురోజుల్లో సాధారణ పరిస్థితి ఏర్పడుతుందని, ప్రజలు బ్యాంకులు, ఎటియంలకు వెళ్ళి తమడబ్బు తీసుకోవచ్చని ప్రధాని చెప్పాడు. ఆ తరువాత 50 రోజుల్లో నోట్లను ముద్రించి మార్కెట్‌లోకి ప్రవేశపెడతామని, కాబట్టి ఈ 50 రోజులే కష్టాలు ఉంటా యని, ఆ తరువాత ఎటువంటి సమస్యలు ఉండవని ప్రధాని భరోసా ఇచ్చారు. కానీ అలా జరగలేదు. గతంలో చెప్పిన వాటిని పక్కన పెట్టి, నగదు రహిత లావాదేవీలకు వెళ్ళదలచుకున్నాము కాబట్టి తిరిగి 15లక్షల కోట్ల రూపాయల నోట్లు ముద్రణ చేయబోమని ఇప్పుడు చెబుతున్నారు.

తగిన సన్నాహాలు చేసుకొని నోట్లరద్దుకు ఏర్పాటు చేసుకున్నాం అని మోడీ చెప్పాడు. మరి ముందే సన్నాహాలు చేసుకొని ఉంటే ప్రజలు ఇన్ని కష్టాలు పడవలసిన అవసరం ఉండేది కాదుకదా! అంతే కాకుండా ఈ కాలంలో 72 సార్లు సవరణలు ప్రవేశపెట్టారు. ముందే సన్నాహాలు చేసి ఉంటే రోజుకొక మార్పు ఎందుకు చేయాల్సివచ్చింది?

చాలా సమర్థవంతమైన ప్రధాని అని ప్రచారం చేస్తున్న బిజెపి, నోట్లరద్దు విషయంలో అస్తవ్యస్తంగా చేశాడనే విమర్శలు తీవ్రంగా వస్తున్న నేపథ్యంలో దానిని సమర్ధించుకోవడం కోసం, యుద్ధం, వ్యూహం, ఎత్తుగడలు అని చెబుతున్నది. ఒకసారి నిర్ణయం తీసుకున్న తరువాత ఇన్ని సార్లు మార్పు చేశారు అంటే ప్రజలు, ఆర్థిక వ్యవస్థ ఎంత అనిశ్చితిని ఎదుర్కొన్నారో స్పష్టమౌతున్నది.

రఘురాం రాజన్ గవర్నర్‌గా ఉన్న కాలంలో ద్రవ్యవిధానానికి సంబంధించినంత వరకు ఆర్‌బిఐ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేది. బిజెపి వచ్చాక వడ్డీరేట్లు తగ్గించమని చెప్పినా తగ్గించకుండా నిర్ణయాలు తీసుకున్నారు. ద్రవ్యలోటును, ద్రవ్యోల్బణాన్ని నియంత్రణ చేయడం కోసం ఎటువంటి ద్రవ్యవిధానం అవసరమో నిర్ణయాలు తీసుకునే ఒక స్వతంత్ర ప్రతిపత్తిగల వ్యవస్థ ఆర్‌బిఐ అనే భావం కలిగించారు. ఆర్థికమంత్రి, వాణిజ్యమంత్రి చెప్పినా కొన్నిసార్లు వడ్డీ రేట్లు తగ్గించకపోవడంతో అది స్వతంత్ర ప్రతిపతి కల వ్యవస్థ అనే భావం కలిగింది. కాని ఈ నోట్లరద్దు ప్రకటన చేసిన తరువాత ఆర్‌బిఐకి తెలియకుండానే ప్రధాని నిర్ణయం తీసుకున్నాడని వార్తలు వచ్చాయి. కొందరు ఆర్‌టిఐ అప్లికేషన్ పెట్టి ఆర్‌బిఐ గవర్నర్ల బోర్డు మీటింగ్ మినిట్సు తీసుకొచ్చారు. అందులో మధ్యాహ్నం 3గంటలకు చర్చ జరిగినట్లుంది. అంటే నోట్ల ఉపసంహరణ ప్రకటన రాత్రి 8 గంటలకు జరగగా 5 గంటల ముందు మాత్రమే ఆర్‌బిఐకి తెలిసిందని చెప్పారు. వాస్తవానికి ఒక రూపాయి నోటు మాత్రమే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటుంది. మిగతా విలువ కలిగిన నోట్లన్నీ ఆర్‌బిఐ ఆధీనంలో ఉంటాయి. 500,1,000నోట్లు ఆర్‌బిఐ బాధ్యత అయినప్పుడు ఆర్‌బిఐ ప్రమేయం లేకుండా అకస్మాత్‌గా నిర్ణయం తీసుకోవటం ఆ సంస్థ స్వయం ప్రతిపత్తిని ధ్వంసం చేయటమే. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగ బద్ధంగా ఉన్న వ్యవస్థలను దిగజారుస్తున్న తీరులోనే ఆర్‌బిఐ స్వతంత్రతను కూడా దిగజార్చటానికి పూనుకున్నారు. ఆర్‌బిఐని ఈ రకంగా ధ్వంసం చేయడం నిరంకుధోరణి పెరుగుదలకు సూచిక.

50రోజుల్లో అన్నీ నోట్లు వచ్చేస్తాయి అని చెప్పి, ఇప్పుడు ఇవి రావటానికి ఇంకో సంవత్సరం పడుతుందని తెలియజేశారు. అన్నీ వైపుల నుండి వ్యతిరేకత వచ్చిన తరువాత మేము నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహిస్తున్నాం. ఎన్ని నోట్లు అవసరమో తరువాత నిర్ణయిస్తాం అని చెప్పారు.

నవబంర్ 8వ తేదీన ప్రకటించిన 500, 1000 రూపాయల నోట్ల ఉపసంహరణలో వచ్చిన సమస్యలను పరిష్కరించే క్రమంలో 72 సార్లు సవరణ చేశారంటేనే వారి అసమర్థత వెల్లడవుతుంది. మార్చి 31 వరకు నోట్లు జమ చేయటానికి కొందరికి అవకాశం ఇచ్చారు. ఎటియంల నుండి తీసుకునే మొత్తం మొదట 2,000 అన్నారు, తర్వాత 4,000 అన్నారు. ఆ తర్వాత వారానికి 24,000 అన్నారు. సహకార బ్యాంకులకయితే ఏమీ లేదు. నీకు ఆ బ్యాంకులో అకౌంటు ఉంటే డబ్బు జమచేసుకోవచ్చు, తీసుకోవచ్చు. ప్రాథమిక సహకార సంఘం మొత్తాన్ని ఒక వ్యక్తిగా పరిగణించి రెండు వేల రూపాయలు ఇస్తారన్నమాట. లేదా 4000, లేదా 24,000 ఇస్తారు. ఈ మొత్తాన్ని అందులో ఉన్న సభ్యులందరూ పంచుకోవాలి. ఇలాంటి పరిస్థితే కేరళలో అతిపెద్ద సమస్యగా మారింది. మొత్తం సహకార బ్యాంకులలో ఉన్న డిపాజిట్లలో 70 శాతం కేరళలో ఉన్నాయి. ప్రతివాళ్లు వారి డబ్బుల్ని సహకార బ్యాంకుల్లో పెట్టుకుంటారు. వామపక్ష ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు నోట్లరద్దు సందర్భాన్ని బిజెపి రాజకీయంగా వాడుకుంటున్నది.

ప్రధాని, మంత్రులు, ఆర్‌బిఐ అధికారులు చేస్తున్న ప్రకటనలు గందరగోళానికి దారి తీస్తున్నాయి. మోడీగారు చెప్పిన ప్రకారండబ్బు బ్యాంకులో జమ చేయటానికి డిసెంబరు 30వ తేది వరకు సమయం ఉంది. క్యూలలో నిలబడొద్దు. తీరుబడిగా వెళ్లి బ్యాంకులలో జమచేయండి అని జైట్లీగారు ఒక ప్రకటన చేశారు. ఆ తర్వాత 30వ తేదీ లోపల ఎందుకు జమచేయలేదు? ఆ తర్వాత ఎందుకు జమచేస్తున్నారో సమాధానం చెప్పమని అడుగుతున్నారు. ప్రధాని ఒకటి అంటాడు. ఆర్‌బిఐ ఒకటి అంటుంది. ఆర్థిక మంత్రి ఒకటి అంటాడు. ప్రభుత్వం ఎటు వంటి స్థితిలో ఉన్నదన్న విషయాన్ని ఇవన్నీ స్పష్టం చేస్తున్నాయి. ఒక తప్పు చేయడం, దాన్ని సరి దిద్దుకోవడానికి మరోతప్పు చేయటం చేస్తున్నారు.

నోట్లు ఉపసంహరణ పర్యవసానాలు ఏమిటి? నోట్లు పరిమితంగా ఉండటం, డబ్బు తీసుకోవటంపై ఆంక్షలు విధించటం అంటే నా

> "ప్రధాని ఒకటి అంటాడు. ఆర్‌బిఐ ఒకటి అంటుంది. ఆర్థికమంత్రి ఒకటి అంటాడు. ప్రభుత్వం ఎటువంటి స్థితిలో ఉన్నదన్న విషయాన్ని ఇవన్నీ స్పష్టం చేస్తున్నాయి. ఒక తప్పు చేయడం, దాన్ని సరిదిద్దుకోవడానికి మరోతప్పు చేయటం చేస్తున్నారు."



నోట్ల రద్దుతో బ్యాంకుల ముందు బారుల తీరిన ప్రజలపై లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

డబ్బును నేను తీసుకునే హక్కును కోల్పోవడం. నా డబ్బు మీద నీ పెత్తనం ఏమిటి? నేను బ్యాంకులో వేసుకుంటాను. తీసుకుంటాను. లేదంటే ఇంట్లోనే పెట్టుకుంటాను. దానిపై ఆంక్షలు విధించటం ప్రజల వ్యక్తిగత స్వాతంత్ర్యంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవటమే. 4 వేలు ఉపసంహరించు కోవాలి. 24వేలు ఉపసంహరించుకోవాలి అని ఆంక్షలు పెడుతున్నావు. 4 వేల రూపాయల కన్నా అదనపు లావాదేవీలు ఖచ్చితంగా డిజిటల్ గానే జరగాలంటున్నావు. నా డబ్బును నేను వ్యక్తిగతంగా వాడుకునే హక్కును హరించేస్తున్నావు.

బ్యాంకులు, పోస్టాఫీసులు లేదా ఏటీఎంల నుండి నోట్లు తెచ్చుకోవాలి. అందుకే నోట్లరద్దు తర్వాత బ్యాంకులు, పోస్టాఫీసులు, ఏటీఎంలు క్యూలతో నిండి ఉంటున్నాయి. సోషలిజం, కమ్యూనిజం అంటే క్యూయిజం అని, నీకు ఏం కావాలన్నా క్యూలలో రోజుల తరబడి నిలబడాల్సిందేనని పాతకాలంలో విమర్శలు చేసేవారు. ఇప్పటి క్యూలు మాత్రం బిజెపి వారికి దేశభక్తి క్యూలుగా కనిపిస్తున్నాయి. అవినీతి నిర్మూలన కోసం చేపడుతున్నామంటున్న ఈ విధానం నూతన తరహా అవినీతి పద్ధతులను ఉనికిలోకి తెచ్చింది. కమీషన్ తీసుకొని కొత్తనోట్లకు పాతనోట్లు మార్చే పద్ధతి వచ్చింది. ఇవి కాకుండా నోట్లరద్దు తీవ్రమైన పర్యవసానాలకు దారితీసింది. అసంఘటిత రంగం బాగా దెబ్బతిన్నది. అసంఘటిత రంగం ఎక్కువగా నగదు చలామణి మీద ఆధారపడి ఉంటుంది. రోడ్డు పక్కన ఉండే చిన్న చిన్న హోటళ్లు. షాపులు తదితరాలు నోట్ల రద్దు వలన బాగా దెబ్బ తిన్నాయి. చిన్న పరిశ్రమలు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. నోట్ల రద్దును ఆకాశానికెత్తిన పత్రికలు, ఛానల్స్ సైతం ప్రజల బాధలను కథలుగా రాయాల్సివచ్చింది. చిన్న పరిశ్రమలు ఎలా దెబ్బతిన్నాయనే సర్వేలు ఇచ్చారు. కేరళను తీసుకుందాం. జీడిపప్పు పరిశ్రమ నష్ట పోయింది. గుజరాత్‌లో బట్టల పరిశ్రమ, ఆభరణాల పరిశ్రమ దెబ్బతిన్నాయి. డబ్బు చలామణి తగ్గిపోవటంతో ఈ పరిశ్రమలన్నీ దెబ్బతిన్నాయి. ఎక్కువ డబ్బులతో కొనేవారు తక్కువగా ఖర్చుచేసే పరిస్థితి వచ్చింది. మళ్లీ ఏటీఎం దగ్గరికి వెళ్లి క్యూలో నిలబడి ఏ తెస్తాంలే అని ఉన్నవాటితో సర్దుకునే పరిస్థితి వచ్చింది. ఆర్థికవ్యవస్థలో

**“కొందరు ప్రముఖ ఆర్థికవేత్తలు జిడిపి 2 శాతం తగ్గిపోతుందని చెబుతున్నారు. అంటే 7.8 శాతం నుంచి 5.8 శాతం వరకు తగ్గినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మాంద్యం ప్రభావం భారతదేశం మీద కూడా ఉన్నా, అంత తీవ్రంగా లేదు. నోట్లరద్దు తర్వాత దేశంలో మాంద్యం ప్రపంచస్థాయికి పెరిగింది.”**



*నోట్ల రద్దుతో బేరాలు లేక వెలవెల పోతున్న కోల్‌కతా చేపల మార్కెట్*

కొనుగోలు, అమ్మకాల మీద కొనడానికి సంకోచిస్తున్న ప్రభావం పడింది. దాంతో డిమాండ్ తగ్గి పోయింది. డిమాండ్ తగ్గడంతో ఉత్పత్తి తగ్గింది. ఉత్పత్తి తగ్గటంతో ఉద్యోగాలు పోయాయి. నోట్లులేవు కాబట్టి జీతభత్యాలు ఇవ్వడానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. గిరాకీ లేనప్పుడు ఉత్పత్తి ఏం చేస్తామని ఉద్యోగాల నుండి తీసేస్తున్నారు. గిరాకీ ఉంది, ఉత్పత్తి చేద్దాం అనుకుంటే ముడిసరుకు కొనడానికి డబ్బులేదు. మొత్తం మీద ఇది అసంఘటిత రంగం మీద ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నది. పరోక్షంగా సంఘటితరంగం మీద కూడా వీటి ప్రభావం పడింది. అందుకనే తయారీ రంగంలో ఉత్పత్తి తగ్గింది. వ్యాపార కార్యకలాపాలు తగ్గాయి. ఈ పర్యవసానాలు జిడిపి పెరుగుదల మీద ప్రభావం చూపుతాయి. జిడిపి 7.6 శాతం పెరగబోతుందని బిజెపి చెప్పింది. నోట్లరద్దు తర్వాత ఆర్‌బిఐ, ప్రభుత్వ గణాంక విభాగం జిడిపి 7.1 శాతానికి పడిపోతుందని చెప్పారు. ఇప్పుడు ఆర్థిక శాస్త్రవేత్తలు 6.8 శాతం కంటే ఎక్కువ ఉండదని చెబుతున్నారు. అంటే 7.8 శాతం నుంచి 6.8 శాతానికి పడిపోయింది. కొందరు ప్రముఖ ఆర్థికవేత్తలు జిడిపి 2 శాతం తగ్గిపోతుందని చెబుతున్నారు. అంటే 7.8 శాతం నుంచి 5.8 శాతం వరకు తగ్గినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మాంద్యం ప్రభావం భారతదేశం మీద కూడా ఉన్నా, అంత తీవ్రంగా లేదు. నోట్లరద్దు తర్వాత దేశంలో మాంద్యం ప్రపంచస్థాయికి పెరిగింది.

జిడిపి పెరుగుదల తగ్గిపోయింది అంటే ఇప్పుడు తగ్గుతుంది, కానీ తరువాత పెరుగుతుందని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు పనగారియా చెబుతున్నాడు. రెండు మూడేళ్ళ పాటు జీడిపి 1, 2 శాతం పడిపోయినా దాని ప్రభావం దీర్ఘకాలం ఉంటుంది. జీడిపి పెరుగుదల రేటు పడిపోవడం రెండు పర్యవసా నాలకు దారి తీస్తుంది. జిడిపి పెరుగుదల రేటు పడిపోవడమంటే ఆర్థిక కార్యకలాపాలు తగ్గడమని అర్థం. ఆర్థిక కార్యకలాపాలు తగ్గితే ఉద్యోగాల మీద, లాభాల మీద, అన్నింటిమీద ప్రభావం ఉంటుంది. పెట్టుబడిదారులు తమ లాభాలను నిలబెట్టుకోవాలంటే జిడిపి పెరిగిన నాటికన్నా ఇంకా తీవ్రమైన దోపిడి చేయాలి. రెండో పర్యవసానం వినియోగం బాగా పడిపో తుంది. వాస్తవంగా అదేమి విడిగా వచ్చే పరిణామం కాదు. విషవలయం లాంటిది. డబ్బు లేదు కాబట్టి వినియోగం పడిపోతుంది. ఇందులో వస్తుగత, మానసిక అంశాలున్నాయి. ఎప్పుడైతే డబ్బు ఉండదో సహజంగానే మానసికంగా కొనుగోళ్ళకు దూరంగా ఉంటారు. అసంఘటిత, సంఘటిత రంగాలు డబ్బులేక ఉత్పత్తి తగ్గించేయడం మూలంగా, ఉద్యోగాలు లేకపోవడం మూలంగా వినియోగం తగ్గిపోతుంది. వినియోగం తగ్గిన ప్రభావం ఆర్థిక వ్యవస్థ మీదపడుతుంది. ధనవంతుల వినియోగం తగ్గిపోదు. పేదల వినియోగం పూర్తిగా తగ్గిపోతుంది. ఈ ప్రభావం ప్రజల ఆరోగ్యం మీద కూడా పడింది. డబ్బులేక చాలామంది వైద్యం వాయిదాలు వేసుకున్నారు. పేదవారి ఆరోగ్య పరిస్థితి మీద, పిల్లల పౌష్టికాహారం, వ్యవసాయం మీద చాలా తీవ్రమైన ప్రభావం పడుతుంది. రైతులకు చెక్కులు ఇస్తామంటున్నారు. చెక్కులిస్తే వాళ్లేమి చేసుకుంటారు? వ్యవసాయంలో కూడా కార్డులు వాడే పెద్దపెద్దవాళ్లు ఉండవచ్చు. చిన్న, సన్నకారు రైతులు కార్డులు వాడరు కదా! సహకార రంగం పూర్తిగా దెబ్బతింటుంది. సహకార సంఘాలను దెబ్బతీయాలనే ప్రయత్నం ముందునుంచే జరుగుతున్నది. రైతుల ఆత్మహత్యలు కూడా ఈ కాలంలో పెరిగాయి. అప్పు తీసుకునేవారే కానీ ఇచ్చే వారు కనబడటం లేదు. మైక్రో ఫైనాన్స్ చెల్లింపులు కూడా ఈ కాలంలో తగ్గిపోయాయి. మైక్రోఫైనాన్స్‌లోని వాళ్లంతా నగదు రూపంలోనే చెల్లించేవారు. ఎప్పుడైతే డబ్బులు చెల్లించే పరిస్థితి లేదో అప్పటి నుంచి రీఫైనాన్సింగ్ తరహా అయిపోయింది. ఏ రంగంలో చూసినా ఇలాంటి పరిస్థితి ఉంది.

రియల్‌ఎస్టేట్ రంగం కూడా దెబ్బ తింది. రియల్‌ఎస్టేట్ రంగం కూడా అధికంగా డబ్బు మీదే ఆధారపడుతుంది. కాబట్టి చాలా లావాదేవీలు ఆగిపోయాయి. కుదుర్చుకున్న ఒప్పందాలు ఆగిపోయాయి. కొత్తగా ఒప్పందాలు జరగటం లేదు. కొన్ని సంప్రదాయ రంగాలు, ఉపాధి చూపించే రంగాలు దెబ్బ తిన్నాయి. పాతనోట్లు పెట్టుకున్న ఎన్‌ఆర్‌ఐలు విదేశాల్లో మార్చుకోవడానికి అవకాశం లేదు. వాళ్లు కూడా చాలా తీవ్రమైన ఇబ్బందులు

ఎదుర్కొంటున్నారు. కాబట్టి స్థూలంగా చెప్పా లంటే ప్రజలందరూ తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రజలకు చాలా బ్రహ్మాండంగా ఉపయోగం జరిగిందని జైట్లీ అంటున్నారు. ఎలా జరిగింది అంటే పన్నుల వసూలు పెరిగిందంటున్నాడు. జిడిపి తగ్గిపోతుంటే పన్నులెలా పెరిగాయి? పన్ను వసూలు ప్రతి సంవత్సరం పెరుగుతుంటుంది. అది ఆర్థిక వ్యవస్థ బలపడి పెరిగిన పన్ను కాదు. నోట్లరద్దు వల్ల వచ్చిందీ కాదు. వాస్తవంగా పన్ను పెరిగిందనే అంకెలు మభ్యపెట్టడానికి చెప్పేవి తప్ప మరేమీ కావు.

నవంబర్ 8న కొన్ని లక్ష్యాలు సాధించడం కోసం నోట్లురద్దు చేస్తున్నామని చెప్పారు. నాలుగు లక్ష్యాలను ప్రధానంగా చెప్పారు. అందులో ఒకటి. నల్లడబ్బును అరికట్టడం. నల్లడబ్బు అంటే ఎక్కడో దాక్కొని ఎవరికీ కనపడకుండా ఉంటుందని ఒక సామాన్యమైన అపోహ ఉంది. డబ్బుకు సంబంధించినంత వరకు నలుపు, తెలుపు అంటూ ఏమీలేదు. అంతా డబ్బే. పన్నులు కట్టకుండా దాచుకున్న డబ్బుని నల్లడబ్బు అంటారు. వాళ్ల అంచనా ప్రకారం 4లక్షల కోట్లు రూపాయల బ్లాక్ మనీ ఉంది. అంటే 15 లక్షల కోట్ల రూపాయల 500, 1000 నోట్లు ఉన్నాయని, దానిలో 4లక్షల కోట్ల రూపాయలు ప్రభుత్వ లెక్కల్లోకి రాకుండా చలామణి అవుతుంది. కాబట్టి ఇప్పుడు నోట్లురద్దు చేస్తే నల్లడబ్బు బయటికి వస్తుందని చెబుతున్నారు. నల్లడబ్బున్నవారు ఆ నోట్లన్నీ ప్రభుత్వానికి దొరక్కుండా ఉండాలంటే అన్నీ వదులుకోవాలి. అలా అయితే 4 లక్షల కోట్ల రూపాయలు రిజర్వ్‌బ్యాంకుకు ఆదాయం వచ్చినట్లు. ఇది రిజర్వ్ బ్యాంకుకు అప్పనంగా వచ్చిన ఆదాయం కాబట్టి ప్రభుత్వం ఖర్చు పెట్టుకునే అవకాశాలు ఉన్నాయి. దానిని రెండురకాలుగా వినియోగించవచ్చు. 4 లక్షల కోట్లు వచ్చాయి గనుక ఉచితంగా కార్పొరేట్ సంస్థలకు రుణాలు ఇవ్వొచ్చు. లేదా 6, 7 లక్షల కోట్ల రూపాయలు పారుబకాయిలున్న బ్యాంకులకు ఇచ్చి, బెయిలవుట్ కింద వినియోగించవచ్చు. జన్‌ధన్ ఖాతాలలో తలా 10వేలరూపాయల చొప్పున జమచేయవచ్చు. లేదా రేపు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో రెండు మూడు లక్షల కోట్ల రూపాయలతో వివిధ పథకాలు ప్రవేశపెట్టవచ్చు. ధనవంతుల మీద పన్నులు తగ్గించొచ్చు. మధ్యతరగతికి ఆదాయపన్నులో రాయితీలు ఇవ్వవచ్చు. పన్ను శ్లాబ్ తగ్గించ డానికైనా ఉపయోగించొచ్చు. ఇవన్నీ మోడీ ప్రభుత్వం వచ్చే బడ్జెట్లో చేస్తుందని చాలా నమ్ముతున్నారు. ఇది జరుగుతుందా లేదా అన్నది ఒక అంశం అయితే, ప్రభుత్వం జెప్పిన లక్ష్యాలు నెరవేరినవా అనేది ముఖ్యమైన సమస్య. రద్దయిన మొత్తం కన్నా ఎక్కువ నోట్లు బ్యాంకులలో జమ అయినట్లు మీడియా చెబుతున్నది. ప్రభుత్వం మాత్రం ఎంత నల్లడబ్బు దొరికిందో చెప్పడం లేదు. మొత్తం నోట్లన్నీ బ్యాంకుల్లోకి వచ్చినప్పుడు ఇంక నల్లడబ్బు ఎక్కడుంది? మోడీ గారీ స్కీం నల్లడబ్బును తెల్లడబ్బుజేయడానికి ఉపయోగపడిందన్నమాట. నోట్ల రద్దు ద్వారా ఉగ్రవాదాన్ని అరికడతాం అన్నారు. నవంబరు 8 తర్వాత దేశంలో నాలుగు చోట్ల ఉగ్రవాద చర్యలు జరిగాయి. ప్రపంచంలో ఉగ్రవాదులే అత్యంత ఆధునిక పరకరాలతో వ్యవహరిస్తున్నారు. వారి ఆర్థిక కార్యకలాపాలను ఆన్‌లైన్‌లో నిర్వహించుకుంటున్నారు. ఇది ప్రభుత్వానికి తెలుసు. అయినా ఉగ్రవాదం సాకు చూపి తన తప్పుడు చర్యను సమర్థించుకున్నది. నకిలీ నోట్లను అరికట్టడం, అవినీతిని అరికట్టడం కూడా ఇటువంటి సాకులేనని గత రెండున్నర మాసాల అనుభవం తెల్పుతున్నది.

> ❝ పర్యవసానాలను సాకల్యంగా పరిశీలించ డానికి సిద్ధంకాని అసహనం, నలుగురితో సంప్ర దించడానికి నిరాకరించే నిరంకుశత్వం దేశాన్ని తన అంగుళీయం మీద గిర్రునతిప్పతున్నామన్న తెలివి తక్కువ భ్రమ నోట్ల రద్దు నిర్ణయంలో మనకు కన్పిస్తాయి. ❞



కష్టించి సంపాదించిన తమ డబ్బు కోసం బ్యాంకులు ముందు క్యూ కట్టిన ప్రజలు

చెప్పిన లక్ష్యాలు సాధించని, దేశ ఆర్థిక వ్యవస్థను వెనక్కు నెట్టిన నోట్ల రద్దును ఎందుకు అమలు చేసినట్లు? మోడీ ప్రభుత్వం తెలివి తక్కువ తనం అని చాలా మంది అంటున్నారు. అత్యంత సమర్థుడు, కార్యశీలి అని మెచ్చుకునే కొంతమంది వందిమాగధులు, బిజెపి వారు ఈ నిర్ధారణను అంగీకరించడం లేదు. తెలివి తక్కువ తనం కాకపోతే ప్రజలు, దేశాన్ని పణంగా పెట్టి అంతర్జాతీయ, దేశీయ కార్పొరేటు సంస్థలకు లాభం చేయడానికి, ప్రజలను డిజిటల్ లావాదేవీల లోనికి బలవంతంగా నెట్టడానికి బిజెపి ప్రభుత్వం చేసిందనుకోవాలి. సంపన్నులకు సేవ చేసే దురుద్దేశానికి తోడు, పర్యవసానాలను సాకల్యంగా పరిశీలించడానికి సిద్ధంకాని అసహనం, నలుగురితో సంప్రదించడానికి నిరాకరించే నిరంకుశత్వం దేశాన్ని తన అంగుళీయం మీద గిర్రునతిప్పుతున్నామన్న తెలివితక్కువ భ్రమ నోట్ల రద్దు నిర్ణయంలో మనకు కన్పిస్తాయి. ఈ దుర్లక్షణాలన్నింటి దుష్ఫలితాలను ప్రజలు అనుభవించాల్సి వస్తున్నది. ప్రజలపై బిజెపి చేసిన ఈ సర్జికల్ దాడికి తప్పక మూల్యం చెల్లించాల్సిన రోజు వస్తుంది. ❃

# నాయకులు కార్యకర్తలు



రచయిత సిపిఐ (ఎం) కేంద్ర కమిటీసభ్యుడు

**ఎస్.వీరయ్య**

సమాజ మార్పు కోసం ప్రజలు పోరాడతారు. ప్రజలను కదిలించేది, దిశా నిర్దేశం చేసేది కమ్యూనిస్టు పార్టీ. కమ్యూనిస్టు పార్టీలో సభ్యులు, నాయకులు మాత్రమే కాదు, కార్యకర్తలు ఉంటారు. కార్యకర్తలకు ఒక ప్రత్యేక స్థానం ఉన్నది. కార్యకర్తలంటే పార్టీలో పూర్తి కాలం పనిచేసే కామ్రేడ్స్, వివిధ స్థాయి ల్లోని పార్టీ కమిటీ సభ్యులు, ప్రజాసంఘాలలో వివిధ స్థాయిల్లో నాయకు లుగా పనిచేయడానికి పార్టీ పంపించిన కామ్రేడ్స్, కొన్ని రంగాలలో కొన్ని రకాల పనుల కోసం, పార్టీ జోక్యం కోసం పంపించిన కామ్రేడ్స్. వీరిలో కూడా పూర్తికాలం పనిచేసే కార్యకర్తలకు ప్రత్యేక స్థానం ఉన్నది. వీరు విప్లవమే వృత్తిగా స్వీకరించిన కార్యకర్తలు. అందుకే వీరిని వృత్తి విప్లవకారులు అన్నారు. కార్యకర్తలను, అందులో తగు సంఖ్యలో వృత్తి విప్లవకారులను తయారు చేసుకోకుండా పార్టీ కర్తవ్యాలను సమర్ధవంతంగా నిర్వహించడం సాధ్యం కాదు. స్థిరత్వం కూడిన, ప్రణాళికా బద్ధమైన కృషి జరగాలన్నా, వివిధ స్థాయిల్లో పనులు అప్పగిస్తూ పర్యవేక్షించాలన్నా కార్యకర్తలు అవసరం. పూర్తికాలం కార్యకర్తలు మరింత అవసరం.

### కార్యకర్తల లక్షణాలు

పార్టీ సభ్యులు నిర్వహించే కనీస బాధ్యతలతో పాటు వీరికి అదనంగా నాలుగు ముఖ్యమైన లక్షణాలు ఉండాలని 1967లో పార్టీ కేంద్రకమిటీ చేసిన "నిర్మాణ రంగంలో కర్తవ్యాలు" అనే తీర్మానం చెప్పింది.

**1) పార్టీ మీద అచంచల విశ్వాసం :** ఇది మార్క్సిస్టు, లెనినిస్టు సిద్ధాంతాన్ని, పార్టీ విధానాన్ని లోతుగా అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే పెరుగుతుంది. గుడ్డి విశ్వాసం, అవగాహనా లోపం క్లిష్ట సమయాల్లో ఊగిసలాటకు దారితీస్తాయి. పొరపాటు ధోరణులకు గురి చేస్తాయి. ఉదాహరణకు నేటి పరిస్థితులలో సామాజిక సమస్యలు క్లిష్టమైనవి. వీటిని అర్థం చేసుకోవడం, వీటి పరిష్కారం కోసం మార్క్సిస్టు లెనినిస్టు మార్గంలో పయనించటం అవసరం. మార్క్సిస్టు అవగాహన మీద పట్టు లేనప్పుడు మార్క్సిస్టు పరిష్కారాలు చూపించలేము. మార్క్సిస్టు అవగాహన లోపించినప్పుడు అస్తిత్వవాదంతో సులభంగా ప్రభావితు లవుతారు. ఈ ధోరణి సమాజంలో కుల నిర్మూలన కోసం, కులవివక్ష మీద పోరాటం చేసే క్రమంలో పార్టీ లోపల, పార్టీ శ్రేణులలో కులాలు వెతికేందుకు దారితీస్తుంది. కులం, మతం, ప్రాంతీయ విభేదాలను వదులుకొని కార్మికవర్గ లక్షణాలను పుణికిపుచ్చుకున్న అంతర్జాతీయవాదే కమ్యూనిస్టు అన్న మౌలిక అవగాహన నుండి దూరమవడమే కదా. ఉద్యమం ఎప్పుడూ ఒకే స్థాయిలో ఉండదు. జయాపజయాలు సహజం. పార్టీకి ఎదురు దెబ్బలు తగిలినప్పుడు నీరసపడటం, దారి తప్పటం, పార్టీ మీద విశ్వాసం సన్నగిల్లిన ఫలితమే. చిక్కు సమస్యలు ఎదురైనప్పుడు పరిష్కారం కనుగొనలేక గందరగోళపడటం కూడా జరుగుతుంది. పార్టీ మీద విశ్వాసం సన్నగిల్లుతుంది. అందుకే పార్టీమీద అచంచల విశ్వాసాన్ని పెంపొందించుకోవటం అవసరం.

**2) ప్రజలతో నిత్య సంబంధాలు :** ప్రజలే చరిత్ర నిర్మాతలు. ప్రజలతో సంబంధాలు బలహీనపడితే నీళ్ళలో నుంచి ఒడ్డునపడిన చేపలాగే ఉంటుంది కార్యకర్తల పరిస్థితి కూడా. ప్రజలతో మమేకం కాకుండా ప్రజల నాడిని గమనించటం కానీ, చైతన్య పరచటం కానీ, పోరాటాల్లోకి సమీకరిం చటం కానీ సాధ్యం కాదు. అందుకే పార్టీ శ్రేణులన్నీ ప్రజాపంథాను (మాస్‌లైన్) అమలుచేయాలని, ప్రజలతో ప్రత్యక్ష సంబంధం పెంచుకోవాలని, ప్రజలలో కలిసిపోవాలని కోల్‌కతాలో జరిగిన ప్లీనం పిలుపునిచ్చింది. ప్రజలలో పనిచేస్తూ, ప్రజల నుండి నేర్చుకుని, అనుభవాలను క్రోడీకరించి, గుణపాఠాలను ప్రజలకు చేర్చడానికి ప్రజల వద్దకు వెళ్ళాలి. ప్రజా ఉద్యమాల్లో, పోరాటాల్లో ప్రత్యక్షంగా భాగస్వాములు కావాలి. ప్రజలకు సేవ చేయటం, ప్రజలను ఒప్పించటం, చైతన్య పరచటం కార్యకర్తల పని. ప్రజల మీద పెత్తనం చేయటం కాదు. పెత్తనం చేసే ధోరణి కార్యకర్తలను శక్తిహీనులను చేస్తుంది. ప్రజలు తన వద్దకు రావాలనీ, తమ సమస్యలు తనకు చెప్పుకోవాలనీ భావించటం కార్యకర్త లక్షణం కాదు. ప్రజల వద్దకు తానే వెళ్ళాలి. అడిగితే సహాయపడటం కాదు. ఏ సహాయం కావాలో అడిగి తెలుసుకోవాలి. ప్రజల మీద పర్యవేక్షణ కాదు, ప్రజలతో క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష సంబంధాలు పెంచుకోవాలి. క్షేత్రస్థాయిలో కృషి చేయడానికి అవకాశాలు సృష్టించుకోవాలి. సర్వేలు, ప్రజలతో సంభాషణలు, ప్రజలను సమీకరించే ప్రయత్నాలు, ఇందుకోసం చేసే క్యాంపెయిన్స్ వంటివి ఇందుకు ఉపయోగపడతాయి. పోరాటాల్లో ప్రత్యక్ష భాగస్వామ్యం అన్నింటికన్నా ముఖ్యమైనది. ప్రజలతో తగు సంబంధాలు లేనప్పుడు, ప్రజల నాడిని పట్టుకోలేనప్పుడు అందుకనుగుణమైన ఎత్తుగడలు వేయటంలో విఫలమవుతాము. ఇది కార్యకర్తల బలహీనత. ఇది గుర్తించనప్పుడు ప్రజలను నిందిస్తాము.

**3) స్వతంత్రంగా పనిచేయగలగాలి :** స్వతంత్రంగా పనిచేయటం అంటే కమిటీ నిర్ణయాలను లేదా పై కమిటీ నిర్ణయాల ను ఖాతరు చేయకపోవటం కాదు. ప్రతి చిన్న విషయానికి నాయకత్వ సహాయం కోసం ఎదురు చూడకుండా తనకున్న మార్క్సిస్టు పరిజ్ఞానం మేరకు స్వతంత్రంగా నిర్ధారణలకు రావాలి. ప్రజాసమస్యలు గుర్తించడంలోనూ, వాటి పరిష్కారం కోసం ప్రజలను కదిలించడంలోనూ, నినాదాలు రూపొందించడంలోనూ, పోరాటాలకు నాయకత్వం వహించడంలోనూ చొరవ చూపాలి. ఈ క్రమంలో వచ్చే ఫలితాలకు బాధ్యత వహించాలి. జయాపజయాలకు సమానంగా బాధ్యత వహించాలి. ఇవి ఆ

కార్యకర్త శక్తిసామర్థ్యాలను సూచిస్తాయి. సత్ఫలితాలు వస్తే అందుకు బాధ్యత కార్యకర్తదే. నష్టం జరిగినా బాధ్యత కార్యకర్తదే. బాధ్యత వహించేందుకు ధైర్యం ఉండాలి. చెపితే చేసే వలంటీర్లుగా కాకుండా చొరవ ప్రదర్శించాలి.

**4) క్రమశిక్షణ :** కేంద్రీకృత ప్రజాస్వామ్యం కమ్యూనిస్టు పార్టీకి గుండెకాయ వంటిది. ఇందుకు లోబడి పనిచేయడమే కమ్యూనిస్టు క్రమశిక్షణ. పార్టీ నిబంధనావళికి బద్ధులై నిబద్ధతతో పనిచేయాలి. పార్టీ శ్రేణులందరికీ ఇది వర్తిస్తుంది. సాధారణ పార్టీ సభ్యుల స్థాయిలో అనేక బలహీనతలు వ్యక్తమవుతాయి. వాటిని సరిదిద్ది దారిలో పెట్టవలసిన బాధ్యత, క్రమశిక్షణను నేర్పవలసిన బాధ్యత కార్యకర్తలదే. అందుకే పార్టీ సభ్యులకన్నా ఉన్నతమైన క్రమశిక్షణను కార్యకర్తలు పాటించాలి. బాధ్యతగా వ్యవహరించాలి.

### నాయకులంటే ఎవరు?

వీరు కార్యకర్తల బృందానికి నాయకులు (టీమ్ లీడర్). సాధారణ సభ్యులకు ఉండే అయిదు కనీస బాధ్యతలు, కార్యకర్తలకు ఉండవలసిన నాలుగు లక్షణాలతో పాటు నాయకులకు అదనంగా మరో నాలుగు లక్షణాలుండాలి.

### నాయకుల లక్షణాలు

**1) నిర్ణయాలు చేయగలగాలి :** ఎలాంటి సంక్లిష్ట పరిస్థితులలో అయినప్పటికీ గందరగోళానికి గురికాకుండా స్థిమితంగా నిర్ణయం చేయగలగాలి. తన బృందం ముందు నిర్దిష్టమైన ప్రతిపాదన పెట్టగలగాలి. కొత్త మార్పులకు, క్లిష్టమైన సమస్యలకు గందరగోళ పడేవారు తన బృందాన్ని సమిష్టిగా, ఐక్యంగా సరైన అవగాహన తో నడిపించజాలరు.

**2) కార్యకర్తలను తయారుచేసుకోవాలి :** తమకు తగినంతమంది కార్యకర్తలు లేరనే సమాధానం తరచూ వింటూ ఉంటాము. ఇది నాయకుల బలహీనతే తప్ప బలం కాదు. కార్యకర్తలు తమంతట తాము రారు. తయారు చేసుకోవాలి. సాధారణ ప్రజల అవసరాలు తీర్చే పని సాధారణ పార్టీ సభ్యులు చేయగలరు. పార్టీ సభ్యుల రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ అవసరాలు తీర్చే పని కార్యకర్తలు చేయగలరు. ఉద్యమ అవసరాలు, కార్యకర్తల రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ అవసరాలు తీర్చే పని నాయకులే చేయగలరు. ఈ క్రమంలోనే ఒక ప్రణాళిక ప్రకారం కార్యకర్తలను తయారు చేసుకోవాలి. అనేక సందర్భాలలో ఉద్యమావసరాల కోసం పర్యటనలు చేస్తుంటాము. కార్యకర్తల కోసం కూడా పర్యటించాలి. మన

> **"కార్యకర్తలు తమం తట తాము రారు. తయారు చేసుకోవాలి. సాధారణ ప్రజల అవసరాలు తీర్చే పని సాధారణ పార్టీ సభ్యులు చేయగలరు. పార్టీ సభ్యుల రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ అవసరాలు తీర్చే పని కార్యకర్తలు చేయగలరు. ఉద్యమ అవసరాలు, కార్యకర్తల రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ అవసరాలు తీర్చే పని నాయకులే చేయగలరు."**

చుట్టూ అనేక బాధ్యతలు నిర్వహిస్తూ, చురుకుగా పనిచేస్తూ, రకరకాల పనులు సమర్థవంతంగా చేయగలవారు అనేకమంది కనిపిస్తారు. వారిని గుర్తించి అభివృద్ధి చేసుకోవడమే నాయకుల పని. కార్యకర్తల అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. వీరి అభివృద్ధి కోసం ఎంపిక చేసిన వారికి తరగతులు, స్టడీ సర్కిల్స్ నిర్వహిస్తూ ఉంటాము. ఈ సామూహిక కృషితో పాటు వ్యక్తిగత శ్రద్ధ కూడా పెట్టాలి. కార్యకర్తలను తయారు చేసుకోవడంలో వ్యక్తిగత శ్రద్ధ అత్యున్నతమైనది. సాధారణ ప్రజలలో కూడా అనేక విధాలుగా శక్తి సామర్థ్యాలు ప్రదర్శించేవారు కనిపిస్తారు. ఉదాహరణకు, యువతీ యువకులు సినీ నాయకుల అభిమాన సంఘాలు నడుపుతారు. వీరిలో ఉన్న సామర్థ్యాన్ని గమనించవచ్చు. తమకు నచ్చిన హీరో గొప్పతనం గురించి సమర్థవంతంగా మెప్పించగలరు. స్పష్టంగా వివరించగలరు. యువతను సమీకరించగలరు. వనరు లను సేకరించి రకరకాల కార్యక్రమాలను జయప్రదంగా నిర్వహిస్తుంటారు. ఇవన్నీ కార్యకర్తలకు ఉండవలసిన లక్షణాలే కదా. ఇలాంటి చురుకైనవారిని గుర్తించి సామాజిక బాధ్యతను వివరించగలిగితే ఇవే పనులు ప్రజల కోసం, పార్టీ కోసం కూడా చేయగలుగుతారు. ఓర్పుతో టీవీ సీరియల్ చూడటమే కాదు, అందుకు అవసరమైన సమయం సృష్టించుకునేందుకు ఇంటి పనులన్నీ ఒక ప్రణాళిక ప్రకారం చేసుకుంటారు కొందరు మహిళలు. టీవీ సీరియల్ చూడటమే కాదు అందులోని కీలకమైన అంశాలు, కథను మలుపు తిప్పే అంశాలు గుర్తించి తోటి మహిళలకు ఆసక్తికరంగా వివరించగలరు. వారు కూడా సీరియల్ చూస్తున్నంతగా సమ్మోహితులయ్యేటట్టు చెప్పగలరు. ఈ సామర్థ్యం మన కార్యకర్తలకూ అవసరమే కదా. ప్రజల పట్ల బాధ్యత గురించీ, సామాజిక ప్రయోజనం గురించీ వీరికి నచ్చచెప్పగలిగితే వీరి సామర్థ్యం సమాజానికి కూడా ఉపయోగమే కదా. సమాజ మార్పు ఆవశ్యకతను ముందుగా గుర్తించి, ఆ తర్వాతనే వివిధ నైపుణ్యాలను, సామర్థ్యాలను అభివృద్ధి చేసుకుంటారన్న పొరపాటు దృక్పథం మన ఆచరణలో వ్యక్తమవుతూ ఉంటుంది. అందుకే మన చుట్టూ రకరకాల విషయాల మీద దృష్టి సారించి, తమకు తోచిన పద్ధతిలో చురుకుగా పనిచేస్తూ రకరకాల వ్యాపకాలలో, రకరకాల నైపుణ్యాలు ప్రదర్శించేవారిని మనం విస్మరిస్తాము. బుద్ధిమంతులను గుర్తించి రకరకాల నైపుణ్యాలను, సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడం ఒక పద్ధతి. వివిధ రకాల సామర్థ్యాలు ఉండి రకరకాల వ్యాపకాలలో ఉండేవారిని ఆకర్షించి, సరైన దారిలో పెట్టి కార్యకర్తలుగా వినియోగించుకోవటం మరో పద్ధతి. ఈ రెండు పద్ధతులూ ఉపయోగకరమే. ఈ రెండింటిలో ఏ పనైనా చేయవలసింది నాయకులే, ఇంకెవరో కాదు. కార్యకర్తలుగా ఉపయోగపడే వారి కోసం వెతకటం నాయకుల పనిలో అంతర్భాగం. నిర్దిష్ట సమయంలో మాత్రమే చేయవలసిన పని కాదిది. అనుక్షణం ఉండవలసిన లక్షణం. కార్యకర్తలను తయారుచేసుకోవడమే కాదు, వారిని నిలబెట్టుకోవటం, మరింత అభివృద్ధి చేసుకోవడం కూడా నాయకుల బాధ్యత. కార్యకర్తలు చేసే ప్రతి పనీ తనను అడిగి చేయాలని కోరుకునే నాయకులు కార్యకర్తలను అభివృద్ధి చేసుకోజాలరు. తనను అడగకుండా చేస్తే తప్పు చేస్తారేమో అని భయపడే నాయకులు, కార్యకర్తలను స్వతంత్రంగా పనిచేయకుండా, తన మీద ఆధారపడేవారిగా తయారు చేసుకునే నాయకులు కార్యకర్తలను తయారు చేసుకోలేరు. తాము మాత్రమే చేయగలమన్న అతి విశ్వాసం ప్రదర్శించటమే అది. ఇతరులు అసమర్థులనీ, అనుభవం లేనివారనీ భావించే వారు కార్యకర్తలను తయారు చేసుకోవడం గానీ, అభివృద్ధి చేసుకోవడం గానీ సాధ్యం కాదు. ఇది నాయకుల బలహీనత.

కార్యకర్తలకు ఉండవలసిన లక్షణా లను

> **"ఎంత గొప్ప నిర్ణయాలైనా అమలు చేసేవారు లేనప్పుడు కాగితాలకే పరిమిత మవుతాయి. అందుకే నిర్ణయాల అమలు కార్యకర్తల మీదనే ఆధారపడి ఉంటుంది. అందుకే నిర్ణయాలు చేయడం, కార్యకర్తలను తయారు చేసుకోవడంతో పాటు, నిర్ణయాలు అమలు జరిగేటట్టు చూసే బాధ్యత కూడా నాయకులదే."**

అభివృద్ధి చేసుకునేందుకు అవకాశమున్న వారిని గుర్తించటం తొలి మెట్టు. వారిలో ఉన్న బలమైన అంశాలు, బలహీనతలు గమనించటం మలి మెట్టు. బలహీనతలను అధిగమించేందుకు, బలమైన అంశాలను మరింత బలోపేతం చేసేం దుకు తగు సహాయం చేయటం ద్వారా కార్య కర్తగా అభివృద్ధి చేసుకోవచ్చు. ఇందుకు కార్యకర్తల పట్ల వ్యక్తిగత శ్రద్ధ, నిరంతర పర్య వేక్షణ బాగా ఉపయోగపడుతుంది.

**3)నిర్ణయాలు అమలు జరిగేటట్టు చూడాలి :** ఎంత గొప్ప నిర్ణయాలైనా అమలు చేసేవారు లేనప్పుడు కాగితాలకే పరిమిత మవుతాయి. అందుకే నిర్ణయాల అమలు కార్యకర్తల మీదనే ఆధారపడి ఉంటుంది. అందుకే నిర్ణయాలు చేయడం, కార్యకర్తలను తయారు చేసుకోవడంతో పాటు, నిర్ణయాలు అమలు జరిగేటట్టు చూసే బాధ్యత కూడా నాయకులదే. అంటే కార్యకర్తలను గుర్తించటం, వారిని అభివృద్ధి చేసుకోవటం, బాధ్యతలు కేటాయించటం నాయకుల బాధ్యత. పనులు అప్పగించటం, పనిలో సహకరించటం, పని సక్రమంగా జరిగేటట్టు చూడటం నాయకుల బాధ్యత. కార్యకర్తలందరి సామర్థ్యం ఒకే స్థాయి లో ఉండదు. వారి సామర్థ్యాన్ని బట్టి పనులు అప్పగించాలి. అప్పగించిన బాధ్యతలు అమలు చేస్తున్న తీరును పర్యవేక్షించాలి. నిర్ణయాలను చైతన్యవంతంగా అమలు చేస్తున్నారా లేక మొక్కుబడిగా చేస్తున్నారా అనేది పరిశీలించాలి. అవసరమైన మేరకు జోక్యం చేసుకోవాలి. వారు పనిలో జయప్రదమ య్యేం దుకు తోడ్పడాలి. వారి అభివృద్ధికి సహకరిం చాలి. వారి పనిలో లోపాలను విశ్లేషించి సరిదిద్దవచ్చు. ఈ క్రమం లో నచ్చ జెప్పేందుకే ప్రయత్నించాలి. కార్యకర్తల అలవెన్సులు, ఆరోగ్యం తదితర సమస్యల పట్ల శ్రద్ధ పెట్టాలి. పనిని సాధ్యమైనంత చిన్న చిన్న ముక్కలుగా విడగొట్టాలి. అప్పుడు ఆ బాధ్యతను నిర్వర్తించే కార్యకర్తకు జయప్రదమవుతానన్న విశ్వాసం పెరుగుతుంది. అప్పగించిన పనిని సులభంగా పూర్తిచేయగలరు. ఒక్కరి మీదనే ఎక్కువ పనులు పెట్టటం కంటే ఎక్కువ మందిని వినియోగించుకునే ప్రయత్నం చేయటం ప్రయోజనకరం. ఇదే ఎక్కువ ఫలితాలనిస్తుంది. మన అవసరాలను బట్టి పనులు అప్పగించటం కాకుండా సాధ్యమైనంతవరకు వారి శక్తి సామర్థ్యాలను బట్టి అప్పగిస్తే పని సులభంగా అవుతుంది. అమలుకూ, ఫలితాలకూ గ్యారెంటీ ఏర్పడుతుంది.

**4) సమీక్ష చేయగలగాలి :** నిర్ణయాలు అమలు చేసిన తర్వాత సమీక్షించటం ముఖ్యమైనది. నిర్ణయం అమలు జరిగిన తీరు ముందు పరిశీలించాలి. నిర్ణయాన్నే సక్రమంగా అమలు జరపనప్పుడు, నిర్ణయం సరైనదైనా ఫలితం ఆశించలేము. అమలు క్రమంలో నిర్ణయం వక్రీకరించబడిందా లేక సక్రమంగా అర్థం చేసుకుని అమలు జరిపారా గమనించాలి. సక్రమంగా అమలు జరిపినట్టు నిర్ధారించుకున్న తర్వాత ఫలితాన్ని అంచనా వేయాలి. ఈ క్రమంలో కష్టాన్ని బట్టి కాకుండా సాధించిన ఫలితాన్ని బట్టి కార్యకర్తల సామర్థ్యాన్ని అంచనా వేయాలి. సూర్యోదయానికి ముందే నిద్ర లేచి అర్ధరాత్రి వరకూ నిర్విరామంగా పనిచేసినప్పటికీ ఫలితం రానప్పుడు చేసిన శ్రమ వృథా. నిద్రాహారాలు మాని పనిచేసినా ఫలితం రానప్పుడు ప్రయోజనం ఉండదు. అందుకే ఎంత సమయం కేటాయించాము, ఎంత కష్టపడ్డాము అనేదాని కంటే ఎంత ఫలితం వచ్చింది అనేదే కీలకం. ఫలితం రాకపోయినా కష్టాన్ని గుర్తించాలనటం అంటే విప్లవం రాకపోయినా ఫర్వాలేదనీ, కష్టపడ్డాం అదే చాలుననీ తృప్తిపడటమే. దీనివల్ల ఉపయోగం ఉంటుందా? నిర్దిష్ట కాలపరిమితుల్లో సాధించవలసిన ఫలితాలు సాధించకుండా అంతిమ ఫలితమైన విప్లవం సాధిస్తామను కోవడం భ్రమ. అందుకే చేసిన నిర్ణయాలు, వాటి అమలుకు చేసినటువంటి కృషి, సాధించిన ఫలితాలను బేరీజు వేయటానికి సమీక్షకు మించిన సాధనం లేదు. ఈ సమీక్ష అన్ని స్థాయిల్లోనూ జరగాలి. సమీక్షా సమావేశాలలో నాయకత్వం ప్రత్యక్షంగా పాల్గొనాలి.

**పని విభజన :** నాయకులు, కార్యకర్తలు నిర్వహించే బాధ్యతల్లో రెండు రకాలున్నాయి. ఫీల్డ్ వర్క్ (ప్రత్యక్ష బాధ్యత), గైడెన్స్ (పరోక్ష బాధ్యత)ల మధ్య గందరగోళపడవద్దు. ప్రత్యక్షంగా ఉద్యమాన్ని నిర్మించిన అనుభవం, పార్టీని నిర్మించిన అనుభవం ఉన్నప్పుడే నాయకత్వం కార్యకర్తల్లో విశ్వాసం నింపగలుగుతుంది. క్షేత్రస్థాయిలో అనుభవం లేకుండా గైడ్ చేయడం సాధ్యం కాదు. నాయకత్వం వహించలేరు. నాయకత్వ కొరత వలన తగిన అనుభవం లేకుండానే నాయకత్వ బాధ్యతలు అప్పగించాల్సిరావటం చూస్తూం టాము. ఉద్యమ అవసరం రీత్యా ఇది అని వార్యంగా జరుగు తుంది. నాయకత్వ బాధ్యతల్లో ఉన్నంత మాత్రాన నాయకత్వ లక్షణాలన్నీ ఉ న్నాయని భావించలేము. పైగా అవసరం రీత్యా నాయ కత్వ బాధ్యతలను చేపట్టవలసి వచ్చిందని గుర్తించి సాధ్యమైనంత త్వరలో తగిన అనుభవం గడించేందుకు ప్రయత్నించాలి. ఇందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష బాధ్యతలు స్వీకరించాలి. పార్టీని నిర్మించేందుకు కృషి చేయాలి. అనుభవం గడించాలి. నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకోవాలి. ఇదంతా ఎవరో చేసేది కాదు. నేర్పేదీ కాదు. స్వయంకృషి ద్వారా సాధించవలసిందే. స్వయం సాధనతోనే సాధించాలి. ఈ అంశాలను గమనించకుండా అశ్రద్ధ చేయటం వల్ల ఆచరణలో నాయకత్వ బాధ్యతలను నిర్వహించడంలో విఫలమవు తారు. ప్రత్యక్ష, పరోక్ష బాధ్యతల మధ్య గందరగోళంతో గైడెన్స్ బాధ్యతలను కూడా ఫీల్డ్ వర్క్‌తో సమానంగా పరిగణిస్తూ ఉంటారు. ఇది సరైంది కాదు. ప్రతి కార్యకర్తకు, నాయకులకు ప్రత్యక్ష బాధ్యతలు, పరోక్ష బాధ్యతలు ఉండాలి. వీటిలో ప్రత్యక్ష బాధ్యతలు కీలకం. అవసరం మేరకు పరోక్ష బాధ్యతలు కూడా తీసుకోవాలి. అనారోగ్యం, వయోభారం తదితర ప్రత్యేక సందర్భాలలో తగిన అనుభవం, సామర్థ్యం ఉ న్న నాయకుల నుండి ప్రత్యక్ష బాధ్యతలను ఆశించ లేము. అలాంటి సందర్భాలలో గైడెన్స్ బాధ్యతలను మాత్రమే అప్పగిస్తాము. వారి అనుభవ సారాన్ని, రాజకీయ, సైద్ధాంతిక స్థాయి ని ఉద్యమానికి వినియోగించుకుంటాము.

❋

## వ్యవసాయ రంగం

# వర్గపొందికలో మార్పులు



రచయిత
మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

**ఎ కోటిరెడ్డి**

**2014**లో జరిగిన సాధారణ ఎన్నికలలో వామపక్షాలకు, ముఖ్యంగా సిపిఐ (యం)కు పార్లమెంటులో స్థానాలు గణనీయంగా తగ్గాయి. జనతా ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించవలసిన, ఆ విప్లవంలో భాగస్వాములు కావలసిన వర్గాలు, తరగతులు పార్టీకి దూరం అవుతున్నట్లు పార్టీ గమనించింది. ఇటువంటి ఫలితాలకు దారితీస్తున్న పరిణామాలను అధ్యయనం చేసి, ఆయా రంగాలలో మారిన పరిస్థితులకు అనుగుణంగా పని పద్ధతులను మార్చుకోవాలని పార్టీ నిర్ణయించింది. “వ్యవసాయ రంగంలో వర్గపొందికలో వస్తున్న మార్పులు,” “పట్టణ సమస్యలు, మధ్యతరగతి,” “సరళీకరణ విధానాల కాలంలో కార్మికవర్గ సామాజిక, ఆర్థిక పరిస్థితులలో వచ్చిన మార్పులు” అంశాలను అధ్యయనం చేయటానికి పార్టీ మూడు అధ్యయన బృందాలను ఏర్పాటు చేసింది. సరళీకరణ విధానాల అనంతర కాలంలో ఆ రంగాలలో చోటు చేసుకున్న మార్పులను అధ్యయనం చేసిన అధ్యయన బృందాలు తాము రూపొందించిన నివేదికలను కేంద్రకమిటీకి అందజేశాయి. కేంద్రకమిటి ఆ నివేదికలను చర్చించి ఆమోదించింది. వ్యవసాయరంగంలో వర్గ సంబంధాలలో వచ్చిన మార్పులను అధ్యయనం చేసిన బృందం రూపొందించిన “వ్యవసాయ రంగంలో వర్గాలు” నివేదికలో ఆ మార్పులను వివరంగా పేర్కొన్నది. ఆ నివేదికను అధ్యయనం చేస్తే గ్రామీణ ప్రాంతంలో పార్టీ గమనించాల్సిన నూతన అంశాలు, వాటికనుగుణంగా ఆచరణను తీర్చిదిద్దుకోవలసిన అవసరం స్పష్టం అవుతాయి.

### గ్రామీణప్రాంతంలో మార్పులు

సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత వ్యవసాయ రంగంలోనూ, గ్రామీణ ప్రాంతంలోనూ అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. వ్యవసాయ సంస్కరణల పేరుతో గ్రామీణ ప్రాంతంలోని భూస్వాములు, పెట్టుబడిదారి రైతులు, ధనికరైతులకు అధికంగా ప్రయోజనం కలిగించే విధానాలను ప్రభుత్వం అనుసరించింది. ప్రభుత్వం అనుసరించిన విధానాల గురించి అధ్యయన బృందం ఈ విధంగా పేర్కొన్నది. ‘భూ సంస్కరణలను వెనక్కుకొట్టటం, చట్టాల ద్వారా, బలవంతంగానూ వ్యవసాయ భూమిని లాక్కోవటం, వ్యవసాయోపకరణాల, ఉత్పత్తుల ధరలను నిర్ణయించే నియంత్రిత ధరల విధానంలో మార్పులు, గ్రామీణ ప్రాంతంలో మౌలిక, సామాజిక సదుపాయాల కల్పనకు ఉద్దేశించిన ప్రభుత్వ పెట్టుబడులలో కోతపెట్టటం, వ్యవసాయోత్పత్తుల నిల్వ, మార్కెట్ చేసేందుకు ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను ప్రైవేటీకరించే దిశగా చర్యలు చేపట్టటం, సామాజిక, అభివృద్ధికర బ్యాంకింగ్ విధానం యొక్క సంస్థాగత నిర్మాణాన్ని తీవ్రంగా బలహీనపరచటం, వ్యవసాయోత్పత్తుల దిగుమతులపై పరిమాణాత్మక ఆంక్షలను తొలగించటం, వ్యవసాయోత్పత్తుల వాణిజ్యంపై ఉన్న ఆంక్షలను బలహీనపరచటం, ప్రజాపంపిణి వ్యవస్థను కుదించటం, వ్యవసాయ పరిశోధన, విస్తరణల జాతీయ వ్యవస్థలను, జాతీయ వృక్ష, జీవజాతుల సంపదకు ఉన్న రక్షణలను బలహీన పరచటం తదితర మార్పులను ప్రవేశపెట్టింది’ ప్రభుత్వాలు అమలు చేసిన ఈ విధానాలు వ్యవసాయ సంబంధాలలో తీవ్రమైన మార్పులకు దారితీశాయి. గ్రామీణప్రాంతంలోని అన్ని వర్గాలను, సామాజిక తరగతులను, ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులను కూడా ఈ మార్పులు ప్రభావితం చేశాయి.

### విస్తరిస్తున్న పెట్టుబడిదారీ సంబంధాలు

సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ సంబంధాల ప్రవేశాన్ని వేగిరం చేశాయి. దేశంలోని వివిధ ప్రాంతాలు, వివిధ పంటలలో పెట్టుబడిదారీ సంబంధాలు ప్రవేశించటం, బలపడటంలో వ్యత్యాసాలున్నా, దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ సాపేక్షంగా పెట్టుబడిదారీ సంబంధాలు బలపడుతున్నాయి. పెట్టుబడిదారీ సంబంధాలు చొరబడిన మేరకు రైతాంగంలో వర్గ విభజన పెరుగుతున్నది. గ్రామీణప్రాంతంలో వర్గ విభజన చేయటానికి మూడు అంశాలను ప్రధానంగా తీసుకుంటాం. మొదటిది. కుటుంబానికి స్వంతంగా ఉన్న, కుటుంబ ఆధీనంలో ఉన్న ఉత్పత్తి వనరులు, పరికరాలు( ప్రధానంగా భూమి). రెండవది. కుటుంబ ఆధీనంలో ఉన్న ఉత్పత్తి వనరులలో కుటుంబ శ్రమ, కూలి శ్రమలను వినియోగించే మోతాదు (ప్రధానంగా వ్యవసాయోత్పత్తిలో). మూడు. ఒక సంవత్సర కాలంలో కుటుంబం పొందుతున్న అదనపు ఆదాయం. ఈ కాలంలో ఈ అంశాలు పెద్దమార్పులకు గురైనాయి. గ్రామాలలోని స్థానిక పరిస్థితులు కూడా కొంత మేరకు ఈ మార్పులకు దోహదం చేశాయి.

### భూస్వాములు

స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా వ్యవసాయ రంగంలో చోటు చేసుకున్న మార్పులతో గ్రామాలలోని సాంప్రదాయక భూస్వాములు పెట్టుబడిదారీ భూస్వాములుగా మార్పుచెందారు. సాంప్రదాయక భూస్వామ్య కుటుంబాల నుండి వచ్చిన వీరుగాని, వీరి కుటుంబ సభ్యులు గాని ప్రధాన వ్యవసాయ పనులలో శారీరక శ్రమ చేయరు. వీరి భూములను వ్యవసాయ కార్మికు లతో సాగు చేయించుకుంటూ, వారి అదనపు శ్రమను దోపిడీ చేస్తారు. లేదా తమ భూములను కౌలుకు, పాలుకు ఇచ్చి, కౌలు లేదా పండిన పంటలో భాగం రూపంలో కౌలుదారుల, పాలుదారుల అదనపు శ్రమను దోపిడీ చేస్తారు. భూమిపై

"ఈ వర్గం గ్రామాలలోని ప్రజలను అనేక విధాలుగా దోపిడి చేస్తున్నది. వేతనాలు, కౌలు, రుణాలపై వడ్డీలు, వ్యవసాయోత్పత్తుల కొనుగోలు, నిల్వ, వాణిజ్యం తదితర రూపాలలో దోపిడీ చేస్తున్నారు. గ్రామీణప్రాంతలోని అన్ని ప్రభుత్వ సంస్థలపైనా వీరు ఆధిపత్యం చెలాయిస్తున్నారు."

గుత్తాధిపత్యం కలిగిన సాంప్రదాయిక భూస్వాముల కుటుంబాలు వ్యవసాయంలో అదనపు ఉత్పత్తిని స్వాధీనం చేసుకోవటం ద్వారా తమకు వస్తున్న ఆదాయంలో ప్రధానభాగాన్ని పొందుతున్నారు.

గ్రామీణ ప్రాంతంలోని పాలకవర్గాలలో భాగంగా, సరళీకరణ విధానాల ఫలితంగా నూతన తరగతి, పెట్టుబడిదారీ రైతులు ఆవిర్భవించారు. భూస్వాముల వలెనే పెట్టుబడిదారీ రైతులు కూడా ప్రధాన వ్యవసాయ పనులలో శారీరక శ్రమ చేయరు. వారికి భూస్వాములకు మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం ఏమిటంటే వీరు సాంప్రదాయిక భూస్వామ్య కుటుంబాల నుండి వచ్చినవారు కాదు. వీరిలో కొందరు శారీరక శ్రమ చేసే సాంప్రదాయం ఉన్న మధ్యతరగతి, ధనికరైతు కుటుంబాల నుండి వచ్చారు. వీరిలో కొందరి కుటుంబసభ్యులు ఇప్పటికీ ప్రధానమైన వ్యవసాయ పనులలో శారీరక శ్రమ చేస్తూనే ఉన్నారు. స్వాతంత్ర్యానంతరం వ్యవసాయ రంగంలో అమలు జరిగిన హరిత విప్లవ విధానాల నుండి వారు లబ్ధిపొందారు. వ్యవసాయంతో పాటు వడ్డీ వ్యాపారం, ఉద్యోగాలు, వ్యాపారాలు, వృత్తులు తదితరాల ద్వారా వారు పొందిన ఆదాయాలను తిరిగి వ్యవసాయ రంగంలో పెట్టుబడిగా పెట్టారు. వారి ఆర్థికశక్తి, కార్యకలాపాలకు వ్యవసాయ రంగం ప్రధాన కేంద్రంగా ఉన్నది. భూస్వాములకు సాంప్రదాయకంగా వచ్చిన భూమి, సామాజిక హోదా పునాదిగా ఉండగా, వ్యవసాయరంగంలో అభివృద్ధి చెందిన ఉత్పత్తిశక్తులు, ముఖ్యంగా హరిత విప్లవం తర్వాత పోగుపడిన అదనపు సంపద పెట్టుబడిదారీ రైతులకు పునాదిగా ఉన్నాయి. ఈ పరిణామాల వలన గ్రామీణ ప్రాంతంలో భూస్వామ్య వర్గం బలపడింది.

ఈ విధంగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ రైతులలో పై కులాల నుండి వచ్చిన వారు కూడా ఉన్నప్పటికీ మధ్యస్థాయి వ్యవసాయ కులాల నుండి వచ్చిన వారు ప్రధానంగా ఉన్నారు. సామాజిక హోదాలో వీరు పై కులాలలోని భూస్వాములతో సరితూగలేనప్పటికీ ఆర్థికంగా, సామాజికంగా కూడా వీరు ఆధిపత్య స్థానాలలోకి వచ్చారు. భూస్వాములకున్నంత విస్తీర్ణంలో వీరికీ భూములుంటాయి. ఇతర ఆస్తులు, ఉత్పత్తి వనరులపై యాజమాన్యం, ఆదాయం తదితరాలు భూస్వాముల స్థాయిలోనే ఉంటాయి. భూస్వాములతో కలిసి వీరు గ్రామీణప్రాంతంలో ఒకేవర్గంగా రూపొందుతున్నారు. సాంప్రదాయక భూస్వాములు, ఆధునికంగా అభివృద్ధి చెందినవారితో కూడిన భూస్వామ్య వర్గం గ్రామీణ ప్రాంతంలో పాలక వర్గాల ఆధిపత్యానికి పునాదిగా ఉన్నది. గ్రామాలలోని సాగుభూమిలో 40 నుండి 60 శాతం వరకు ఈ వర్గం చేతిలో ఉన్నది.

**ఉత్పాదక వనరులపై ఆధిపత్యం**

భూమి ఒక్కటి మాత్రమే కాక, అనేక ఇతర ఉత్పత్తి కార్యకలాపాలు ఈ వర్గం ఆధిపత్యానికి సాధనాలుగా ఉన్నాయి. భూమితో పాటు గ్రామీణ ప్రాంతంలోని ఉత్పాదక వనరులన్నీ దాదాపుగా ఈ వర్గం ఆధిపత్యంలోనే ఉన్నాయి. అనేకమంది భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులు వడ్డీ వ్యాపారం, ధాన్యం మిల్లులు, పాల ఉత్పత్తి, విక్రయకేంద్రాలు, ఆహారధాన్యాలు, పండ్లు, తదితర వ్యవసాయోత్పత్తుల వ్యాపారం, సరుకుల ఉత్పత్తి, రియల్ ఎస్టేట్, నిర్మాణం, సినిమా థియేటర్లు, పెట్రోలు పంపులు, లాడ్జీలు, రవాణారంగం, వ్యవసాయ యంత్రాల అమ్మకం, అద్దెకు ఇవ్వటం, విద్యాసంస్థల నిర్వహణ తదితరాలు చేస్తున్నారు. అంటే గ్రామీణ జీవితంలోని ప్రతిరంగంలోనూ వీరికి ఆధిపత్య పాత్ర ఉంటున్నది. ఇటువంటి కుటుంబాలు సహజంగానే ప్రభుత్వ పదవులలోకి ప్రవేశించి, గ్రామీణప్రాంతంలో ప్రభుత్వ యంత్రాంగంపై పట్టు సాధిస్తున్నారు. పంచాయితీ రాజ్ సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంటు సభ్యుల వరకు ఈ వర్గం చేతిలో ఉంటున్నాయి. ఆయా పదవులకు వీరు ఎన్నిక కావటమో, లేదా వీరితోసన్నిహిత సంబంధాలు ఉండేవారు ఎన్నికవటమో జరుగుతున్నది. ఫలితంగా గ్రామీణ జీవితంలోని అన్ని పార్శ్వాలపైనా వీరు ఆధిపత్యం చెలాయించగలుగుతున్నారు. గ్రామాలలో బూర్జువా, భూస్వామ్య వర్గాల రాజకీయ పార్టీలకు వీరే నాయకత్వం వహిస్తున్నారు. సాంప్రదాయక భూస్వాములు రాజకీయ పార్టీలు, గ్రామంలోని ముఠాలలో స్థిరంగా ఉండేవారు. ఆధునిక పెట్టుబడిదారీ రైతులు పార్టీలు, ముఠాలకు కట్టుబడరు. లాభం వారికి ప్రధానం. లాభం వస్తుందనుకుంటే పార్టీలు, ముఠాలు మార్చటానికి, తమకు వ్యతిరేకులుగా ఉన్న ఇతర పార్టీలు, ముఠాలతో కలిసి వ్యవహరించటానికి ఏ మాత్రం వెనుకాడరు. దీని వలన గ్రామాలలో కమ్యూనిస్టు ఉద్యమానికి, గ్రామీణ కార్మికవర్గం, అణచబడ్డ తరగతుల పోరాటాలకు గతంలో లభించిన వెసులుబాటు లేకుండాపోతున్నది.

ఈ వర్గం గ్రామాలలోని ప్రజలను అనేక విధాలుగా దోపిడి చేస్తున్నది. వేతనాలు, కౌలు, రుణాలపై వడ్డీలు, వ్యవసాయోత్పత్తుల కొనుగోలు, నిల్వ, వాణిజ్యం తదితర రూపాలలో దోపిడీ చేస్తున్నారు. గ్రామీణప్రాంతలోని అన్ని ప్రభుత్వ సంస్థలపైనా వీరు ఆధిపత్యం చెలాయిస్తున్నారు. రుణాలు, వ్యవసాయోపకరణాలు, ఉన్నత విద్య, సంఘటితరంగంలోని ఉద్యోగాలలో అధికభాగం ఈ వర్గమే పొందుతున్నది. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ భూమి ఒక్కటి మాత్రమే కాక ఆదాయం పొందటానికి అనేక నూతన రంగాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులలో గ్రామీణ కార్మికులు, రైతుల జీవితాలపై పాత పద్ధతిలో భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులు ఆధిపత్యం చెలాయించటానికి అవకాశాలు కుదించుకు పోతున్నప్పటికీ, నిత్యజీవితంలో రైతులు, కార్మికులు వీరిపై ఆధారపడటం కూడా తగ్గుతున్నప్పటికీ, పేదల కుద్దేశించిన వాటితో పాటు అన్ని ప్రభుత్వ పథకాలు వీరి ఆధిపత్యంలోనే అమలు జరుగుతున్నాయి. సాంప్రదాయక ఆధిపత్య పద్ధతులు, ఆధునికంగా వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని ఈ వర్గం గ్రామీణ జీవితంపై ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నది.

**గ్రామీణ కార్మికులు**

వ్యవసాయ రంగంలోని మరో ప్రధాన వర్గం శారీరక శ్రమచేసే గ్రామీణ కార్మికులు. వ్యవసాయ, వ్యవసాయేతర పనులు చేయటం

ద్వారా వీరికి ఆదాయం వస్తున్నది. గ్రామీణ ప్రాంతంలో శారీరక శ్రమతో కూడిన పనుల న్నింటినీ– వ్యవసాయ, వ్యవసాయేతర పనులు, ఉపాధి హామి పనులు, రోడ్లు వేయటం, ఇతర ప్రాంతాలలో వ్యవసాయ పనుల కోసం వలసలు పోవటం తదితరాలు– ఈ వర్గమే చేస్తున్నది. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కార్మికులను, వ్యవసాయేతర కార్మికులను వేరు చేయటం సాధ్యం కాకుండా ఉన్నది. వీరు రోజువారీ కూలి, లేదా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. కొద్దిమంది ముందుగా ఒప్పం దం చేసుకొని సంవత్సరం, నెలవారీ జీతానికి ఒకే యజమాని వద్ద పనిచేస్తున్నారు. గ్రామీణ కార్మికులలో కొందరు పశుపోషణ, కిరాణా షాపుల లాంటి చిరు వ్యాపారాలు, ఇళ్ళలో పని చేయటం, తక్కువ ఆదాయం వచ్చే ఇతర పనుల ద్వారా కూడా కొంత ఆదాయం పొందు తున్నారు. చారిత్రక కారణాల రీత్యా గ్రామీణ కార్మికులలో ప్రధాన భాగం దళితులు, అణచి వేతకు గురవుతున్న కులాల నుండి ఉన్నారు.

గ్రామీణ కార్మికులలో ఎక్కువ మందికి భూమిలేదు. చారిత్రకంగా ఈ వర్గం భూమికి దూరంగా ఉంచబడటంతో పాటు, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న క్రమంలో భూములు కోల్పోయిన రైతాంగం, వృత్తులు కోల్పోతున్న వృత్తిదారులు గ్రామీణ కార్మికులలో చేరటంతో ఈ వర్గంలో భూమిలేని వారిసంఖ్య పెరుగుతున్నది. వీరిలో కొందరు తమకున్న కొద్దిపాటి భూమిని సాగుచేసుకొంటున్నారు. మరి కొందరు ఇతరుల నుండి భూములను కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల ఆయకట్టు ప్రాంతాలలోని గ్రామీణ కార్మికులలో భూమిలేనివారి సంఖ్య ఎక్కువగా ఉన్నది. వారికి దొరికే పనిరోజులు, కూలిరేట్లపై వారి కుటుంబ ఆదాయం ఆధారపడి ఉంటున్నది. వ్యవసాయ రంగంలో పనిరోజులు తక్కువగా ఉంటున్నాయి. దేశంలో గ్రామీణ కార్మికులకు సంవత్సరంలో మూడు మాసాలకు మించి సగటున వ్యవసాయ పనులు దొరకటం లేదు. మహిళలకు పురుషుల కన్నా తక్కువ రోజులు పని దొరుకుతున్నది. పెట్టుబడిదారీ వ్యవసాయ పద్ధతులు బాగా అభివృద్ధి చెందిన ప్రాంతాలలో గ్రామీణ కార్మికులకు సంవత్సరానికి 65 రోజులకు మించి వ్యవసాయ పనులు దొరకటం లేదు. సాపేక్షం గా వ్యవసాయాభివృద్ధిలో బాగా వెనుకబడిన ప్రాంతాలలో అత్యధికంగా సంవత్సరంలో 185 రోజుల వరకు పనులు దొరుకుతున్నాయి. పంట లలో మార్పులు, కలుపు మందులు, ఆధునిక

> **“ గ్రామీణ కార్మికులలో ఎక్కువ మందికి భూమిలేదు. చారిత్రకంగా ఈ వర్గం భూమికి దూరంగా ఉంచబడటంతో పాటు, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న క్రమంలో భూములు కోల్పోయిన రైతాంగం, వృత్తులు కోల్పోతున్న వృత్తిదారులు గ్రామీణ కార్మికులలో చేరటంతో ఈ వర్గంలో భూమిలేని వారిసంఖ్య పెరుగుతున్నది. ”**



వ్యవసాయ కార్మికులు : పని పరిస్థితుల్లో మార్పులు చేసుకుంటున్నాయి

వ్యవసాయ పద్ధతులు, యంత్రాల వినియోగం తదితరాలు పనిరోజులు తగ్గటానికి కారణ మౌతున్నాయి.

### పేద, మధ్యతరగతి రైతులు

భూస్వాములు, పెట్టుబడిదారి రైతులు ఒకవైపున, భూమి లేకుండా వ్యవసాయంలోనూ, వ్యవసాయేతర పనులు చేసే గ్రామీణ కార్మికులు మరోవైపున ఉండగా, వీరికి మధ్యలో వ్యవసాయంలోని ప్రధాన పనులలో తమ కుటుంబసభ్యులతో కలిసి శారీరక శ్రమచేసే పేద, మధ్యతరగతి, ధనికరైతులు ఉన్నారు. పేద, మధ్యతరగతి రైతులు పని చేస్తున్న తీరును అధ్య యనం చేసినపుడు వీరిలో అనేకమంది తాము సాగుచేస్తున్న భూములలో కుటుంబసభ్యులతో కలిసి శ్రమ చేయటం ఎక్కువగా ఉంటున్నది. అవసరమైనపుడు తమ భూములలో కొద్దిమంది కూలీలతో పనులు చేయించుకుంటున్నారు. మరోవైపున పెద్దసంఖ్యలో పేద, మధ్య తరగతి రైతులు ఇతరుల భూముల్లో వ్యవసాయ, వ్యవసాయేతర పనులలోనూ కూలీలుగా శ్రమ చేస్తున్నారు. తమ శ్రమను ఇతరులకు అమ్ముకుం టున్నారా, లేదా అనే ప్రాతిపదికపైనే పేద, మధ్యతరగతి రైతులను వర్గీకరించటం ప్రస్తుతం సాధ్యం కాదు. అయినా తమ భూములలో పనులకు కూలీలను పెట్టుకున్న పనిరోజులు, తాము ఇతరులకు పనికి పోయిన పనిరోజులను లెక్కిస్తే, పేదరైతు తన కుటుంబ శ్రమతోనే బతక టం, మధ్యతరగతి రైతు కొద్దిమంది కూలీలను అదనంగా పెట్టుకుని, వారి శ్రమను దోపిడీ చేస్తున్నా తన కుటుంబ శ్రమతోనే బతుకుతు న్నాడనేది స్పష్టం అవుతున్నది. వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరగటంతో ఈ వర్గాల రైతులు కూలికి వెళ్ళకుండా జీవితావ సరాలను సంపాదించుకోవటం అసాధ్యం అవుతున్నది.

### ధనిక రైతులు

ధనికరైతులకు భూమి, ఇతర ఉత్పాదక ఆస్తులు ఉంటాయి. ముఖ్యమైన వ్యవసాయ పను లలో వీరి కుటుంబాలలోని పురుషులు వ్యవ సాయ పనులలో పాల్గొంటారు. ధనికరైతుల ఆర్థికస్థితిలో కూడా మార్పులు వచ్చాయి. సాంప్ర దాయకంగా కౌలు భారాన్ని మోస్తూ, భూస్వా ములకు పెద్దమొత్తంలో రుణపడి ఉండేస్థితి నేడు అరుదుగా ఉన్నది. వీరు తమ భూములు, వ్యాపారాలలో ఎక్కువ పెట్టుబడులు పెట్టటం

❝ రైతులలో కొందరికి పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రావటం లేదని వ్యవసాయ మంత్రిత్వశాఖ సర్వేలో కూడా స్పష్టమైంది. మార్కెట్ లావాదేవీలలోకి ప్రవేశించటం, వ్యవసాయోపకరణాల ధరలను ప్రభుత్వం పెంచటం, ఉత్పత్తిని మార్కెట్లో అమ్ముకునేటపుడు బహుళజాతి, కార్పొరేట్ సంస్థల దోపిడీ నుండి రక్షణ లేకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలవుతున్నారు. ❞



మార్కెట్లో మాయాజాలంలో బంధీ అయిపోయిన రైతులు

ద్వారా అధిక ఆదాయం పొందుతు న్నారు. ప్రభుత్వ బ్యాంకులు, సహకార సంఘాల నుండి ఎక్కువగా రుణాలు పొందుతున్నారు. తమ భూములు, ఇతర వ్యాపారాలలో కార్మికులను ఎక్కుగా ఉపయోగించుకుంటున్నారు. వడ్డీలు, ఇతర వ్యాపారాల ద్వారా పేద, మధ్యతరగతి రైతాంగాన్ని దోపిడీ చేస్తున్నారు. ఫలితంగా గ్రామీణ కార్మికులు, పేదరైతుల నాయకత్వంలో సాగుతున్న ఉద్యమాలకు ధనికరైతు మద్దత్తు తెలిపే అవకాశాలు క్రమంగా తగ్గిపోతున్నాయి. భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులు, ధనిక రైతుల మధ్య ఉండే వైరుధ్యాలు 70వ దశాబ్దం నాటికన్నా ఈనాడు మొద్దుబారి పోవటంతో వారి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. తన ఆర్థికస్థాయి పెరిగిన మేరకు ధనికరైతుపేద, మధ్యతరగతి రైతులకు దూరం అవుతున్నాడు.

కౌలుదారీ విధానం విస్తరిస్తున్నది. వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు అభివృద్ధి చెందినచోట, సాగునీటి సదుపాయం ఉన్నచోట్ల కౌలుకిస్తున్న భూమిశాతం చాలా ఎక్కువగా ఉన్నది. భూస్వాములు, పెట్టుబడి దారి, ధనికరైతులు భూములను కౌలుకు ఇస్తున్న చోట వారు కౌలుదారులకు రుణాలు ఇవ్వటం, ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయోప కరణాలను సరఫరా చేస్తున్నపుడు కౌలురేట్లు ఎక్కువగా ఉంటున్నాయి. దీర్ఘకాలికంగా సాగునీటి సదుపాయం ఉండి, వరిపంట పండిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని డెల్టా ప్రాంతాలలో 1974-2004 సంవత్సరాల మధ్య పెరిగిన ఉత్పాదకత నంతటిని పెరుగుతున్న కౌలురూపంలో భూయజమానులు కాజేస్తు న్నారు. దళితులు, భూమిలేనివారు, పేదరైతులు అధిక కౌలురేట్లు చెల్లించి, కఠినమైన షరతులకు అంగీకరించి భూమిని కౌలుకు తీసుకోవలసి వస్తున్నది.

రైతులలో కొందరికి పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రావటం లేదని వ్యవసాయ మంత్రిత్వశాఖ సర్వేలో కూడా స్పష్టమైంది. మార్కెట్ లావాదేవీలలోకి ప్రవేశించటం, వ్యవసాయోపకరణాల ధరలను ప్రభుత్వం పెంచటం, ఉత్పత్తిని మార్కెట్లో అమ్ముకునేటపుడు బహుళజాతి, కార్పొరేట్ సంస్థల దోపిడీ నుండి రక్షణ లేకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలవుతున్నారు. కొందరు భూములు కోల్పోవటం జరుగుతున్నది. ప్రభుత్వాలు అనుసరిస్తున్న భూసేకరణ విధానాలు, పేద, మధ్య తరగతి రైతుల భూములను కార్పొరేట్ సంస్థలు, ధనికులు కాజేస్తుండటంతో ఈ తరగతులు గ్రామీణ కార్మికులుగా మారుతున్న క్రమం పెరుగుతున్నది.

సాంప్రదాయకంగా వ్యవసాయోత్పత్తిలో పాల్గొనని చేనేత, వడ్రంగం, కుండలు చేసేవారు, ఇతర చేతివృత్తులు, సేవావృత్తులు చేసేవారు గ్రామాలలో ఉన్నారు. వీరిసంఖ్య, వీరు ఈ పనులపై వెచ్చించే సమయం క్రమంగా తగ్గిపోతున్నది. వీరిలో యువకులు చదువుకొని ఇతర వృత్తులు, ఉద్యోగాలు చూసుకోవటం, లేదా గ్రామీణ కార్మికులుగా మారుతున్నారు.

### సుందరయ్య అధ్యయనం చేసిన నాటికి నేటికి మార్పులు

వ్యవసాయ రంగంలో వర్గ సంబంధాలను అధ్యయనం చేయటం కోసం కామ్రేడ్ సుందరయ్య 1974 సంవత్సరంలో గుంటూరు జిల్లాలోని అనంతవరం, కాజ గ్రామాలను అధ్యయనం చేశారు. నాటి అధ్యయనం ప్రాతిపదికగా వివిధ వర్గాల పరిస్థితిని పరిశీలించినపుడు నాటికి, నేటికీ అనేక మార్పులు చోటుచేసుకున్నట్లు స్పష్టమౌతున్నది. సుందరయ్యగారు అధ్యయనం చేసినపుడు వ్యవసాయ కార్మికుల, కౌలురైతుల అదనపు శ్రమను దోపిడీ చేయటం ద్వారా పొందుతున్న అదనపు విలువయే భూస్వాముల ఆదాయానికి ప్రధాన వనరుగా ఉన్నది. వ్యవసాయేతర ఉత్పత్తిరంగాల అభివృద్ధి అతి తక్కువగా ఉన్నది. వ్యవసాయ భూములలో పనిచేయటం ద్వారా వ్యవసాయ కార్మికులకు వారి ఆదాయంలో ప్రధాన భాగం వస్తున్నది. వ్యవసాయ కార్మికులు కొద్దిరోజులు మాత్రమే వ్యవసాయేతర పనులు చేసేవారు. పేదరైతులు ఎక్కువ రోజులు తమ స్వంత, కౌలుకు తీసుకున్న భూములలో పనిచేసుకొంటూ మిగిలిన రోజులు ఇతరుల భూమిలో కూలిపనులకు వెళుతూ తన కుటుంబ శ్రమతోనే జీవించేవారు. మధ్యతరగతి రైతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి తమ వ్యవసాయ భూమిలో పనిచేసుకొంటూ, అవసరమైన మేరకు కూలీలను పెట్టుకొనేవారు. కుటుంబ ఆదాయంలో కుటుంబశ్రమ అధికంగా, కూలీల శ్రమ తక్కువగా ఉండేది. మధ్యతరగతి రైతుకుటుంబసభ్యులు ఇతరులకు కూలికి వెళ్ళటం ఉండేది కాదు. ధనికరైతు కొన్ని పను లలో కొద్ది మేరకు శారీరక శ్రమచేసినా, ఎక్కువ మంది కూలీలను పెట్టుకొని పనులు చేయించు కొనేవాడు. కుటుంబ ఆదాయంలో కుటుంబ సభ్యుల శ్రమకన్నా కూలీల శ్రమ అధికంగా ఉండేది. నాటికి నేటికీ పరిస్థితులలో వచ్చిన మార్పులను పరిగణనలోకి తీసుకొని మన వర్గా లను సమీకరించటానికి తగిన ఎత్తుగడలను రూపొం

దించుకోవాలి.

కుటుంబ ఆదాయంలో స్వంతశ్రమ, ఇతరుల శ్రమను దోపిడీ చేస్తున్న మోతాదు వారి వర్గ స్వభావాన్ని నిర్ణయించటంలో కీలకపాత్ర వహిస్తుంది. పేదరైతు తన కుటుంబ శ్రమతో బతుకుతున్నాడు కాబట్టి గ్రామీణ కార్మికవర్గంతో కలిసి జనతా ప్రజాస్వామిక విప్లవపోరాటంలో నాయకత్వ స్థానంలో నిలబడతాడు. మధ్యతరగతి రైతు ప్రధానంగా తన స్వంత శ్రమతోనే బతుకుతున్నా కొంతమేరకు ఇతరుల శ్రమను దోపిడీ చేస్తుంటాడు. కాలం కలిసివస్తే పై వర్గాలలో చేరాలని ఆశపడుతుంటాడు. తన ఆర్థిక, సామాజిక స్థితిని బట్టి భూస్వామ్య వ్యతిరేక, ప్రభుత్వ వ్యతిరేక పోరాటంలో ఊగిసలాడుతుంటాడు. ధనికరైతు ఆదాయంలో కుటుంబ శ్రమ తక్కువగా, గ్రామీణ కార్మికులను దోపిడీ చేయటం ద్వారా వచ్చిన ఆదాయం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి తమ ప్రయోజ నాల కోసం గ్రామీణ కార్మికులను వ్యతిరేకిస్తూ, భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులతో సన్నిహితంగా ఉంటాడు. ధనికరైతు గతం కన్నా గ్రామీణ కార్మికులు, పేద, మధ్య తరగతి రైతుల కు దూరం అవుతున్నాడనేది స్పష్ట మౌతున్నది.

> **“కుటుంబ ఆదాయంలో స్వంతశ్రమ, ఇతరుల శ్రమను దోపిడీ చేస్తున్న మోతాదు వారి వర్గ స్వభావాన్ని నిర్ణయించటంలో కీలకపాత్ర వహిస్తుంది. పేదరైతు తన కుటుంబ శ్రమతో బతుకుతున్నాడు కాబట్టి గ్రామీణ కార్మికవర్గంతో కలిసి జనతా ప్రజాస్వామిక విప్లవపోరాటంలో నాయకత్వ స్థానంలో నిలబడతాడు.”**



ఉపాధి పని : క్రమంగా తగ్గిపోతున్న నిధులు, పని దినాలు

### భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులకు వ్యతిరేకంగా పోరాటం సాగాలి

భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులకు ప్రయోజనం కలిగించేలా రూపొందించ బడుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటానికి వ్యవసాయ, వ్యవసాయేతర పనులలో పాల్గొనే కార్మికులను ఏ విధంగా సన్నద్ధం చేయాలనే ప్రశ్న ముందుకు వస్తున్నది. గతంలో వ్యవసాయ కార్మికులను దోపిడీ చేయటం ద్వారా భూస్వాములు ప్రధానంగా ఆదాయం పొందేకాలంలో వ్యవసాయ కార్మికులను సంఘటితం చేసి, సాధ్యమైన మేరకు పేదరైతులు, కౌలురైతులను కూడా తోడుచేసుకొని గ్రామాలలో భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా కూలిరేట్లు పెంచాలని, కౌలురేట్లు తగ్గించాలని, ఇతరదోపిడీ రూపాలకు వ్యతిరేకంగా పోరాటం చేయటం ప్రధాన పోరాట రూపాలుగా ఉన్నాయి. ఈనాడు భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులకు వారి ఆదాయంలో ప్రధానభాగం వ్యవసాయం నుండి రావటం లేదు. గ్రామీణ కార్మికులు కూడా వారి ఆదాయంలో ఎక్కువ భాగాన్ని వ్యవసాయ పనులు చేయటం ద్వారా పొందటం లేదు. ఇటువంటి పరిస్థితులలో గ్రామీణ కార్మికులను వ్యవసాయ పనుల ప్రాతిపదికగా సంఘటితం చేయటం, ఆ ప్రాతిపదికపై భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలలోకి సమీకరించటమే సరిపోదు. ఒకే కార్మికుడు వ్యవసాయ పనితో పాటు వివిధ రకాలైన వ్యవసాయేతర పనులు చేస్తున్నపుడు పని ప్రతిపదికగా సంఘటితం చేయటం కూడా కష్టసాధ్యం అవుతున్నది. వ్యవసాయంలో పంటలు, పనులలో వైవిధ్యం పెరిగింది. అందరు శ్రామికులు అన్ని రకాల పనులు చేస్తున్నా, కొందరు కొన్ని రకాల పనులకు ఎక్కువగా వెళ్ళటం, ఆ పనులలో నైపుణ్యం సంపాదించటం జరుగుతున్నది. కొందరు వారి మొత్తం ఆదాయంలో ఎక్కువ భాగాన్ని వ్యవసాయ పనుల ద్వారా పొందుతుంటే, మరికొందరు వ్యవసాయేతర పనుల ద్వారా పొందుతున్నారు. కొందరి ఆదాయంలో ఎక్కువ భాగం గ్రామంలో చేసే పనుల ద్వారా పొందుతున్నారు. మరి కొందరు గ్రామానికి బయట చేస్తున్న పనుల ద్వారా ఎక్కువ ఆదాయం పొందుతున్నారు. కొందరు వలసలు పోవటం ఎక్కువగా ఉండగా, మరికొందరు గ్రామంలోనే ఉండి పనులు చేసుకొంటున్నారు. ఇటువంటి పరిస్థితులలో గ్రామీణ శ్రామికులందరినీ ఐక్యం చేయటం గతంలో ఏనాటి కన్నా కష్టంగా మారింది. ఆయా గ్రామాలను నిర్దిష్టంగా అధ్య యనం చేసి, ఏదైనా పనికి ప్రత్యేకంగా సంఘాన్ని ఏర్పాటు చేయటం సాధ్యమైతే ఏర్పాటు చేయవచ్చు. కాని మొత్తం వ్యవసాయ, వ్యవసాయేతర పనులు చేసే కార్మికులను సంఘటితం చేయాలంటే వ్యవసాయ కార్మిక సంఘంతో పాటు గ్రామీణ శ్రామికుల సంఘాన్ని ఏర్పాటు చేయటమే మార్గం. వీటితో పాటు మహిళా కార్మికులు చేస్తున్న పనుల ప్రాతిపదికగా అవసరం అయితే ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేసి, వారిని సమీకరించటానికి పూనుకోవాలి. అలా ఏర్పడిన సంఘం ఆయా గ్రామాలలోని పనులు, నిర్దిష్ట పరిస్థితులను అధ్యయనం చేసి, తగిన డిమాండ్లను రూపొందించటం ద్వారా గ్రామీణ కార్మికులను పోరాటాలలోకి సమీకరించాలి.

భూస్వామ్య విధానాన్ని రద్దు చేయాలని, గ్రామీణ కార్మికులు, కౌలురైతులు, పేదరైతులకు భూములను పంచాలనే ప్రధాన నినాదం వెనుక గ్రామీణ కార్మికులను, పేద, మధ్య తరగతి రైతులను సమీకరించటం కోసం వారు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను తీసుకోవాలి. భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులకు వ్యతిరేకంగా పోరాటం

> **"గ్రామీణ కార్మికుల కోర్కెలకు మద్దత్తుగా రైతాంగాన్ని సమీకరించాలంటే పేద, మధ్యతరగతి రైతాం గం ఎదుర్కొం టున్న సమస్యలను కూడా తీసుకోవాలి. వ్యవసాయ సమస్యను పరిష్కరించటం కోసం జనతా ప్రజాస్వామిక విప్లవ దిశలో కార్మిక- కర్షక ఐక్యతను నిర్మించేందుకు కూడా ఈ పరిణామాలు దోహదం చేస్తాయి."**



పాడి పరిశ్రమను ఆక్రమిస్తున్న ప్రయివేటు రంగం

చేయటం ద్వారా ఈ వర్గాలు సాధించగలిగిన కోర్కెలపై ఆందోళన సాగించాలి. మన వర్గాలకు సంబంధించిన ప్రతి డిమాండ్‌కు విస్తృత ప్రజా మద్దత్తును సమీకరించటానికి ప్రయత్నం చేయాలి. భూస్వాములు, పెట్టుబడిదారీ రైతుల మధ్య వచ్చే వైరుధ్యాలను జాగ్రత్తగా గమనిస్తూ ఈ వర్గం అంతా ఒకటిగా వ్యవహరించకుండా జాగ్రత్త పడాలి. రాజకీయంగా, మతాల రీత్యా, సామాజికంగా, ఆర్థికంగా వీరి మధ్యవున్న వైరుధ్యాలను వినియోగించుకుంటూ మన వర్గాలను సమీకరించటానికి ప్రయత్నం చేయాలి.

**కార్మిక కర్షక ఐక్యతను నిర్మించాలి.**

రైతాంగం మధ్య వర్గ విభజన, రైతాంగం కూలీలుగా మారటం పెరుగుతున్న స్థితిలో పేద, మధ్య తరగతి రైతులు, గ్రామీణ కార్మికుల మధ్య ఐక్యతను నిర్మించటానికి అవకాశాలు పెరుగుతున్నాయి. గ్రామీణ కార్మికుల కోర్కెలకు మద్దత్తుగా రైతాంగాన్ని సమీకరించాలంటే పేద, మధ్య తరగతి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను కూడా తీసుకోవాలి. వ్యవసాయ సమస్యను పరిష్కరించటం కోసం జనతా ప్రజాస్వామిక విప్లవ దిశలో కార్మిక- కర్షక ఐక్యతను నిర్మించేందుకు కూడా ఈ పరిణామాలు దోహదం చేస్తాయి. ఉపాధి గ్యారంటి, ప్రజాపంపిణి వ్యవస్థను సార్వత్రికం చేయటం, పేదలకు ఇళ్ళు, మంచినీరు, పారిశుధ్యం, గృహాలకు విద్యుత్ సదుపాయం, పేదలకు మౌలిక సదుపాయాలను కల్పించటం, విద్యా, వైద్యాన్ని సార్వత్రికం చేయటం, రైతాంగానికి వ్యవసాయోపకరణాల ధరలను తగ్గించటం, పంటలకు గిట్టుబాటు ధరలు, భూమిని సాగుచేస్తున్న రైతులందరికీ బ్యాంకు రుణాలు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన సందర్భంలో తగిన పరిహారం ఇవ్వటం, పంటల బీమా తదితర సమస్యలపై ఆందోళన చేస్తూ రైతాంగాన్ని సమీకరించాలి. గ్రామాలలో భూస్వాములు, పెట్టుబడిదారీ రైతుల దోపిడీ, పీడనకు సంబంధించిన నిర్దిష్ట సమస్యలను తీసుకోవాలి.

పేద, మధ్య తరగతి రైతాంగం కోర్కెల సాధనలో కార్మికులు తోడుగా నిలబడాలి. ఏ మాత్రం అవకాశం ఉన్నా ధనికరైతులను కూడా కలుపుకురావటానికి ప్రయత్నం చేయాలి. భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులకు, ధనిక రైతులకు మధ్య వచ్చే వైరుధ్యాలను జాగ్రత్తగా గమనిస్తూ, వాటిని వినియోగించుకొని ఈ రెండువర్గాలు కలవకుండా జాగ్రత్తపడాలి. ధనికరైతులు, గ్రామీణ కార్మికుల కోర్కెలను బలపరచకపోయినా కనీసం తటస్థంగా ఉండటానికి ఉన్న అవకాశాలు ఏమిటనేది నిరంతరం అధ్యయనం చేస్తుండాలి. భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులకు, ధనికరైతులకు విభేదాలు వచ్చిన సందర్భాలలో ధనికరైతుల కోర్కెలను బలపరచాలి. ఈ కాలంలో మధ్యతరగతి రైతుల పునాది విస్తరించింది. పేద, మధ్యతరగతి రైతులను మద్దత్తుగా సమీకరించగలిగినపుడు స్థానికంగా కొన్ని కోర్కెలను సాధించుకోవటం సాధ్యం అవుతుంది. దానితో పాటు మనలక్ష్యం అయిన జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించాలంటే ఈ వర్గాల రైతాంగాన్ని సమీకరించటం తప్పని సరి. ఈ సానుకూల, ప్రతికూలాంశాలను గమనంలో ఉంచుకొని, గ్రామీణ కార్మికులు, పేద, మధ్య తరగతి రైతాంగాన్ని సమీకరించ టానికి కృషిచేయటం ద్వారా జనతా ప్రజా స్వామిక విప్లవమార్గంలో ముందుకు సాగాలి. ❈

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్థిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# డిజిటల్ భ్రమలు



రచయిత్రి
ప్రముఖ ఆర్థికవేత్త

**జయతీ ఘోష్**

నగదు రహిత ఆర్థిక వ్యవస్థ కొరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిబంధనలు, డిజిటల్ వ్యాపార లావాదేవీలు చేసిన వారికి ప్రకటించిన ప్రోత్సాహకాల నుండి ఎటువంటి లబ్ది పొందనటు వంటి, బ్యాంకులలో అకౌంట్లు లేని అత్యధిక జనాభాను విస్మరించాయి.

"ప్లాస్టిక్ అంటే కొత్త ఖాదీ" అనే మాట నేడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ప్రధాని నరేంద్ర మోడీ, ఆయన ప్రభుత్వం అసాధారణంగా దుర్మార్గంగా తీసుకోబడిన పెద్ద నోట్ల రద్దు నిర్ణయం అనంతరం అదే పనిగా మారుస్తున్న నిబంధనల వలన, పెద్ద సంఖ్యలో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ, నగదు రహిత ఆర్థిక వ్యవస్థ రూపంలో ఆ ఫలితం వస్తుందట. ఈ-చెల్లింపుల వైపు మరలండి అని ప్రోత్సహించే బోధనలు నేడు జాతీయవాదానికి కొత్త నిర్వచనంగా తయారయ్యాయి. ఒక కార్డు లేదా మొబైల్ ఫోన్ లేదా ఇంటర్నెట్ అకౌంట్ ద్వారా ఏదైనా చెల్లింపులు చేసే సామర్థ్యం, నీ దేశ ప్రగతి పట్ల నీకున్న కోరిక, నీ దేశం పట్ల నీకున్న ప్రేమకు ఇపుడు ఒక ఋజువుగా తయారు చేయబడుతుంది. కొంతమంది దృష్టిలో దేశభక్తికి గుర్తుగా జాతీయగీతం ఆలాపించడం ప్రథమస్థానం అయితే, ఫోన్ ద్వారా లేదా కార్డు (స్వైపింగ్) ద్వారా చెల్లింపులు చేయడం అనేది రెండవ స్థానంలో ఉంటుందట.

నిజానికి డిజిటైజేషన్ ద్వారా వ్యాపార లావాదేవీలు చేయడమే, అవినీతిపై పోరాటం, పేదరికాన్ని అంతం చేయడం, సమాజాన్ని ఆధునికీకరించడం, నిరంతర అభివృద్ధికి సంబంధించిన సమస్యలన్నింటికి పరిష్కార మార్గంగా తయారయ్యిందని అనిపిస్తుంది. గత కొన్ని వారాలుగా ప్రధానమంత్రి, ఈయన అనుచరులు ఇటువంటి ప్రమాణాలు చేస్తున్నారు.

కాబట్టి దేశాన్ని కాపాడే దేశభక్తి కలిగిన పౌరులందరూ నగదు ద్వారా చేసే వ్యాపార లావాదేవీలకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సి ఉంటుంది. యువకులు ఈ కార్యక్రమాన్ని అత్యుత్సాహంతో చేపట్టవలసి ఉంటుంది. వయస్సు మీరిన పెద్దలు వారి యొక్క అలవాట్లను మార్చుకోవడం నేర్చుకోవాలి. విద్యార్థులు బయటి ప్రాంతాలకు వెళ్ళి డిజిటల్ లావాదేవీలు ఎలా చెయ్యాలో ఇతరులకు బోధించాలి. ఇప్పటికే నగదు రహిత లావాదేవీలు నిర్వహించే ధనిక వర్గాలు వారికున్న సామర్థ్యంతో విర్రవీగుతున్నారు. అసలు ఏమాత్రం నగదు నిల్వలు లేని పేదలు మాత్రం డిజిటల్ ప్రపంచంలోకి ప్రవేశించాలని ఒత్తిడి చేయబడుతుంటారు. వారికి స్థిర ఆదాయాలు, బ్యాంక్ అకౌంట్లు ఉండవు. డిజిటల్ లావాదేవీలు నిర్వహించడానికి అవసరమైన ప్రాథమిక సంబంధాలు ఏవీ లేవు.

**నగదురహిత లావాదేవీలకు ప్రోత్సాహకాలు**

భౌతికంగా కరెన్సీ నోట్లను అందుబాటులో ఉంచకుండా, ప్రజలను బలవంతంగా ఎలక్ట్రానిక్ చెల్లింపులకు ప్రోత్సహించడం సరియైనది కాదు. ప్రజలకు కూడ ప్రోత్సాహకాలు ఇవ్వాలి. నగదు నుండి కొత్త ఎలక్ట్రానిక్ విధానం ద్వారా చెల్లింపులకు మరలాలంటే అందమైన భాషా శైలిలో మన స్వంత హాస్యగాడి చేత అవి చెప్పబడాలి. అందుకే ఆర్థిక మంత్రిత్వశాఖ అప్పటికే నగదు రహిత లావాదేవీలు ఉపయోగించుకుంటున్న దేశంలోని ఉన్నత వర్గాల వారికి లాభం కలిగే విధంగా కొన్ని ద్రవ్య సంబంధమైన బహుమానాలను సమకూర్చింది. డిశంబర్ 14 నుండి, కార్డుల ద్వారా పెట్రోలు, డీజిల్ కొనుగోలుదారులకు 0.75 శాతం రాయితీ ప్రకటించింది. రెండు వేల రూపాయల వరకు ఈ-కార్డు ద్వారా చెల్లించే వారికి సేవా పన్నును రద్దు చేసింది. జనవరి 1, 2017 నుండి నెలవారీ , సీజనల్ రైల్వే టికెట్లు డిజిటల్ విధానం ద్వారా కొనుగోలు చేసేవారికి 0.5 శాతం రాయితీ ప్రకటించింది. సాధారణ, జీవిత బీమా పాలసీలను కొత్తగా కొనుగోలు చేసే వారికి లేదా పి.ఎస్.యు. వెబ్‌సైట్ ద్వారా ప్రీమియం చెల్లింపులు చేసేవారికి 10 శాతం , 8 శాతం రాయితీ ప్రకటించింది. మన దేశంలో సాపేక్షంగా ధనికులుగా ఉన్న వారికి లాభం జరిగే విధంగా పై ప్రమాణాలు తీసుకొనబడినాయి.

కొన్ని ప్రోత్సాహకాలను గూర్చి అసలు ఆలోచనలు కూడ చేయలేదు. అవి కేవలం భయంకరమైన ఈ కొత్త తలక్రిందులుగా ఉన్న తెలివి తక్కువ రాజకీయ వాతావరణంలోనే బయటికి వస్తాయి. కాబట్టి 'నీతి ఆయోగ్' "లక్కీ డ్రాస్" విధానాన్ని తీసుకువచ్చింది. సౌకర్యవంతమైన లాభాలను అందించడమే కాకుండా, నగదు బహుమతులు కూడ అందించే 'ఈ-లావాదేవీ' లకు దేశ పౌరులు తేలికగా ప్రేరేపించబడతారు. ప్రతివారం ఈ వ్యాపార లావాదేవీలలో పాల్గొనే కొనుగోలుదారులు, అమ్మకందారుల కొరకు లక్కీ నంబర్లు డ్రా తీయబడతాయి. మొట్టమొదటి "మెగా డ్రా" (1 కోటి రూపాయలు) అంబేద్కర్ జయంతి రోజు ఏప్రిల్ 14న నిర్వహించబడుతుంది. తేదీ ఎంపికలో ఏ విధమైన వ్యంగ్యం లేదా హాస్యం, సిగ్గుగాని లేదు. అణగారిన, పేద వర్గాలను దృష్టిలో ఉంచుకొని, ఒక రాజకీయ సందేశాన్ని పంపించడం కొరకే ఆ తేదీని ఖరారు చేశారనేది స్పష్టం. ఈ కార్యక్రమంలో ఒక అధికారి పాల్గొనబోతున్నట్లు సమాచారం ఉన్నది. మనం దుస్తులు లేని చక్రవర్తి ఉన్న ప్రపంచంలో లేము. దానికి బదులుగా మనం తీవ్రమైన కోపావేశం గల వివిధ మార్గాలలో తన వెంట పెద్ద సంఖ్యలో ప్రజలను కూడగట్టగలిగిన, చక్రవర్తిని కలిగి ఉన్నాం. అతనివెంట ఉన్న కొంతమందిలో ఏ విధమైన ఉత్సాహం లేదు. ఎక్కువ మందిలో వాస్తవాన్ని గ్రహించలేని, ఇంకనూ

> **"ఈ డిజిటల్ విధానంలో దేశంలో ఉన్న వయోజనులలో బ్యాంకు ఖాతాలు లేని 3వ వంతు వయోజనులపై ఏ మాత్రం శ్రద్ధ లేదనేది స్పష్టం. నగదు మార్చుకొనే అవకాశం లేక వారికి ఉన్న కొద్దిపాటి నగదు నిల్వలు వారికి కాకుండా పోయాయి. వారికి బ్యాంకులలో ఖాతాలు లేకుండానే ఈ-చెల్లింపులు జరగాలని ఒత్తిడి చేయబడుతున్నారు."**



బ్యాంకుల మొహం చూడని గిరిజనులు

విశ్వసిస్తున్నవారున్నారు. కొద్దిమంది మాత్రమే తన మార్గాల, ఉద్దేశ్యాల గురించి సందేహిస్తూ ప్రశ్నించగలుగుతున్నారు.

భారతదేశాన్ని ముందుకు తీసుకొని పోవడానికి డిజిటైజేషన్ మాత్రమే ఒక సరియైన మార్గం అన్న భ్రమ ఎప్పుడు, ఎలా ఉత్పన్నమయినదో అస్పష్టమైన విషయం. సామాజిక మార్పు కొరకు టెక్నాలజీని సహాయపడే వస్తువుగా కంటే అన్ని సమస్యలకు తేలికైన మార్గం టెక్నాలజీ అనే నమ్మకం గత కొంతకాలంగా ఉనికిలో ఉంటూ వస్తున్నది.

ప్రస్తుత పరిస్థితిలో భారతీయ ఆర్థిక వ్యవస్థ, ప్రపంచంలో నగదు ప్రమేయం (లావాదేవీలలో) ఎక్కువగా ఉన్న దేశాలలో ఒకటి. పెద్ద నోట్ల రద్దుకు ముందు 98 శాతం వ్యాపార లావాదేవీలు నగదు రూపంలోనే పరిష్కరించబడినాయి (90 శాతం చైనాలో, 85 శాతం బ్రెజిల్, 55 శాతం అమెరికాతో పోల్చినపుడు) కానీ ఇప్పటికీ ఇది అసాధారణం కాదు. ప్రపంచ వ్యాప్తంగా 85 శాతం లావాదేవీలు నగదు రూపంలో నిర్వహించబడుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు చాలా వరకు నగదు పైనే విశ్వాసం ఉంచుతున్నాయి. చిన్న దేశాలైన బెల్జియం, స్వీడన్ నగదు రహిత ఆర్థిక వ్యవస్థకు ఉదాహరణలు ఐనప్పటికీ అభివృద్ధి దశతో నగదు రహిత దశకు ఏ విధమైన సంబంధం లేదు.

### బ్యాంకు ఖాతాలు లేని జనాభా

ఈ-బ్యాంకింగ్, ఎలక్ట్రానిక్ లావాదేవీలు భారతదేశంలో పెరుగుతూ ఉన్నాయి. పెద్దనోట్ల రద్దు అనంతరం చేసిన నిర్బంధకరమైన ఒత్తిడి తరువాత కూడ వాటాలు చాలా చిన్నవిగానే ఉన్నాయి. అది (నోట్లరద్దు) క్రమేపి నెమ్మదిగా తీసుకొని రావాల్సి ఉంది. బహుశా ఇప్పుడు ఇచ్చే ప్రోత్సాహకాలు లాంటివి ప్రకటించి ఉంటే ప్రజలలో అస్థిరత్వం కొంత నెమ్మదిగా ఉండేది.

ఈ డిజిటల్ విధానంలో దేశంలో ఉన్న వయోజనులలో బ్యాంకు ఖాతాలు లేని 3వ వంతు వయోజనులపై ఏ మాత్రం శ్రద్ధ లేదనేది స్పష్టం. నగదు మార్చుకొనే అవకాశం లేక వారికి ఉన్న కొద్దిపాటి నగదు నిల్వలు వారికి కాకుండా పోయాయి. వారికి బ్యాంకులలో ఖాతాలు లేకుండానే ఈ-చెల్లింపులు జరగాలని ఒత్తిడి చేయబడుతున్నారు. కాబట్టి వారు ఇప్పుడు ఏమి చేయాల్సి ఉంటుంది? వారు ఖచ్చితంగా బ్యాంకులలో ఖాతాలు తెరవాలని చెప్పడం దుర్మార్గం. భారతదేశంలో చట్ట ప్రకారం గుర్తింపు కార్డులు తప్పనిసరి కాకపోయినప్పటికీ, వివిధ రకాల గుర్తింపు కార్డులు లేవని ఇబ్బందులకు గురి చేయబడుతున్నారు. గుర్తింపు కార్డులు ఉన్నవారు అనేకమంది బ్యాంకులో ఖాతాలు తెరవాలని వెళ్ళి, బ్యాంకు అధికారులచే వెళ్ళగొట్టబడటానికి గల కారణం నగదు పంపిణీ విధులతో అధికారులు అదనపు పని భారాన్ని మోయవలసి రావడమే. దానితో పాటు వివిధ పత్రాలు పరిశీలించడం, దరఖాస్తులు నింపడం లాంటి పనుల వల్ల డిశంబర్ 30 తరువాత రావాలని అంటున్నారు. అప్పటికి వారికున్న నగదు నిల్వలకు విలువ లేకుండాపోతుంది.

ఈ-వ్యాపారం పరిమితంగానే వ్యాప్తి చెందడానికి ప్రధానమైన కారణం, ఆ విధమైన చెల్లింపులకు అవసరమైన మౌలిక సదుపాయాలు లోపించడమే. భారతదేశంలో ఒక 100 కోట్ల మొబైల్ ఫోన్ల వాడకం దారులున్నారనేది వాస్తవం. కానీ 3వ వంతు కన్నా తక్కువ మంది భారతీయులు మాత్రమే స్మార్ట్‌ఫోన్లు ఉపయోగిస్తున్నారు. తక్కువ ఆదాయాలున్న కుటుంబాలలో కేవలం 7 శాతం మాత్రమే స్మార్ట్ ఫోన్లు ఉపయోగించుకుంటున్నారు. జనాభాలో 3వ వంతు ప్రజలు ఇంటర్నెట్ సౌకర్యం కలిగి ఉన్నారు. కానీ కనెక్షన్లు అన్నీ నగరాలకు, పట్టణాలకు సంబంధించినవే. మొబైల్ ఇంటర్నెట్ సౌకర్యం గల వారిలో 70 శాతం నగరాలకు, పట్టణాలకు చెందినవారే. 27 శాతం భారతీయులు మాత్రమే ఇంటర్నెట్ ఉపయోగించుకుంటున్నారు. వీరిలో 87 శాతం ప్రజలు పట్టణ, మెట్రోపాలిటన్ నగరాలలో నివశిస్తున్నారు. భారతీయ మహిళలలో కేవలం 17 శాతం మంది మాత్రమే ఇంటర్నెట్‌ను ఉపయోగిస్తున్నారు.

కనెక్షన్లు అన్నీ సమానంగా లేకుండా వాటి మధ్య తేడాలున్నాయి. మొబైల్ ఫోన్‌లో ఒకపేజీ డౌన్‌లోడ్ కావడానికి భారతదేశంలో పట్టే సగటు సమయం 5.5 సెకన్లు, చైనా 2.6 సెకన్లు, శ్రీలంక 4.5 సెకన్లు, బంగ్లాదేశ్ 4.9 సెకన్లు, పాకిస్తాన్ 5.8 సెకన్లుగా నమోదైనట్లు అకామయి టెక్నాలజీస్ నివేదిక తెలిపింది.

### మౌలిక సదుపాయాల కల్పనలో లోపం

డిజిటల్ వ్యాపార లావాదేవీలు చేయడానికి అవసరమైన టెలికాం పరికరాలు, సేల్ మెషీన్లు అందుబాటులో లేకపోవడం ఒక పెద్ద నిరోధం. డిశంబర్ 6, 2016 నాటికి 70 కోట్ల డెబిట్ కార్డులు ఉంటే, వాటిలో కేవలం 7,00,000

కార్డులు మాత్రమే పనిచేస్తున్నాయి. ఇప్పటికీ అమెరికాలో సగానికి పైన వ్యాపార లావాదేవీలు నగదు ద్వారానే జరుగుతున్నాయి. పెద్దనోట్ల రద్దు అనంతరం లావాదేవీలకు ఉపయోగించే యంత్రాలకు డిమాండ్ పెరిగినప్పటికీ విక్రయదారులు సరఫరా చేయలేకపోతున్నారు. భౌతికంగా యంత్రాల సరఫరాలో ఉన్న ఇబ్బందుల తోపాటుగా, అవి పనిచేయడానికి అవసరమైన విధానాన్ని సరిచేయడంలో బ్యాంకులు మరికొంత ఆలస్యం చేశాయి.

మరొక చెప్పుకోదగిన, అభివృద్ధిని ఆలస్యం చేసే నిరోధం ఏమంటే ఈ–లావాదేవీల నిర్వహణ, దాని భద్రతను సంరక్షించే టెలికామ్ పరికరాల సరఫరాలో లోపం. ఇవి సరిపడా లేకుండానే వ్యాపార లావాదేవీల భారం పెరిగిపోతే, అధిక భారంతో 'విధానాలే' నాశనమవుతాయి. వాస్తవానికి ఈ–వ్యాపార లావాదేవీలు మెట్రో నగరాలలో విజయవంతం కావడానికి చాలా ఎక్కువ సమయం తీసుకుంది. అనేక పర్యాయాలు చేయవలసి వచ్చింది. నగదు రహిత ఆర్థిక విధానాన్ని ప్రచారం చేయడానికి గ్రామాలకు వెళ్ళిన మంత్రులు స్వంత మొబైల్ ఫోన్‌లో ఈ–వ్యాపార లావాదేవీలు చేయడంలో ప్రజల ముందు విఫలం చెందినట్లు నివేదికలు అనేకం ఉన్నాయి.

### ఆదాయాల బదిలీ

కానీ మౌలిక సదుపాయాల కల్పన, కనెక్షన్‌లో లోపాలు సమస్యలో ఒక భాగం మాత్రమే. నగదు రహిత లావాదేవీల విధానంలో మరుగునపడే రెండు అంశాలను చాలా జాగ్రత్తగా పరిశీలించవలసి ఉన్నది. 1) ఈ–నగదు విధానంలో అన్ని రకాల లావాదేవీలకు గాను భారతీయులందరూ (పేదవారితో సహా) సేవా పన్నును చెల్లించవలసి ఉంటుంది. కానీ నగదు రూపంలో జరిగే లావాదేవీలకు ఏ విధమైన చెల్లింపుల అవసరం లేదు.

ఇది ఒక మామూలు నగదు బదిలీ కన్నా, పెద్ద మొత్తంలో, పేదలతో సహా ప్రజలందరి నుండి బ్యాంకులకు, కంపెనీలకు చేసే పెద్ద నగదు బదిలీ, కొన్ని కంపెనీలు – పేటీఎమ్ (Paytm), రిలయెన్స్ జియో లాంటి కంపెనీలు ఈ మార్పు ఫలితంగా పెద్ద మొత్తంలో లాభాలు సాధించారన్న విషయం స్పష్టం అవడం వల్ల, ఆశ్రిత పెట్టుబడిదారి విధానపు (క్రోనీ క్యాపిటలిజం) లక్షణం, ఈ విధానంలో తప్పి పోకూడదు. మొబైల్ మార్కెట్‌లో అత్యంత ఎక్కువ లాభాలు గడించిన కంపెనీగా పేటీఎమ్, అనతి కాలంలోనే 16 కోట్ల మంది వాడకందారులను పెంచుకున్నది. తొందరపడిన కంపెనీకే అధికారిక ప్రయోజనాలతోపాటు, పెద్ద మొత్తంలో నోట్ల రద్దుకు సంబంధించి ప్రముఖ పత్రికలలో, రేడియో, టి.వి.ల ద్వారా ప్రచారోత్సవాలు జరుపుకున్నారు. ఈ దందా 40 శాతం భాగస్వామియైన చైనా ఆలీబాబా చేత నిర్వహించబడింది.

"నగదు రహిత లావాదేవీల విధానం లో మరుగునపడే రెండు అంశాలను చాలా జాగ్రత్తగా పరిశీలించవలసి ఉన్నది. 1) ఈ-నగదు విధానంలో అన్ని రకాల లావాదేవీ లకు గాను భారతీయులందరూ (పేదవారితో సహా) సేవా పన్నును చెల్లించవలసి ఉంటుంది. కానీ నగదు రూపంలో జరిగే లావాదేవీలకు ఏ విధమైన చెల్లింపుల అవసరం లేదు."



ఖాతాదారులతో కిక్కిరిసి పోయిన బ్యాంకులు

### సైబర్ భద్రత రహస్యం

అదే విధంగా సైబర్ భద్రత, రహస్యం పట్ల చాలా జాగ్రత్త వహించవలసి ఉంటుంది. అభివృద్ధి చెందిన దేశాలలో ఇది చాలా ప్రధానమైన అంశంగా ఉంటుంది. కానీ మన దేశంలో ప్రస్తుతం అలాంటి జాగ్రత్తలన్నీ మరిచి పోయినట్లుంది. అమెరికాకు చెందిన రెండు యూనివర్శిటీల అధ్యయనంలో తెలియజేసినట్లుగా, ప్రపంచంలో సైబర్ దాడులలో గాయపడిన ఐదు దేశాలలో భారతదేశం ఒకటి. అంటే అది కేవలం రహస్యాలకు సంబంధించిన విషయమే కాదు. సైబర్ నేరాలు, దొంగతనాలకు సంబంధించిన సాధ్యాసాధ్యాలు కూడ ముఖ్యమైనవే. భారతదేశంలో ఈ–వ్యాలెట్, మొబైల్ చెల్లింపులు, బ్యాంకింగ్ అప్లికేషన్ల ద్వారా నిర్వహించబడే చెల్లింపులకు చెందిన హార్డ్‌వేర్ భద్రతకు అవసరమైన విధానాలేవీ లేవని ఒక నివేదికలో పేర్కొనబడింది. రహస్యంగా సమాచారాన్ని దొంగిలించడం లేదా గణాంకాలను మార్చే ప్రమాదం భారతదేశంలో ఉన్నమాట వాస్తవం.

ఈ సందర్భంగా విదేశీ భాగస్వామ్య యాజమాన్యంతో నడిపించబడుతున్న పేటీఎమ్ విషయంలో కొన్ని భద్రతకు సంబంధించిన విషయాలు బయటకు వచ్చినట్లు వినపడింది. ఇది ప్రజలకు సంబంధించిన అన్ని రకాల గణాంకాలతో సంబంధం ఉన్న విదేశీ, ప్రైవేట్ బ్యాంకులకు కూడ సమానంగా వర్తిస్తాయి.

వాస్తవానికి మన దేశానికి, సమాజానికి ఏమి జరిగింది. పైన చెప్పిన విషయాలను నెమ్మదిగా, జాగ్రత్తగా, పద్ధతి ప్రకారం పరిశీలించిన తరువాతనే డిజిటైజేషన్ ద్వారా లావాదేవీలు జరగాలన్న విషయం మరచిపోవడం జరిగిందా? వినాశ కాలం దాపురించినపుడు నగదు రహిత వ్యవస్థవైపు వెళ్ళాలన్న పిచ్చి ఆలోచనలు చేస్తున్నట్టుంది.

**అనువాదం: బోడపట్ల రవీందర్**

**ఇంటర్వ్యూ**

# పెట్టుబడిదారులకు సోషలిజం కార్మికులకు కేపిటలిజం



రచయిత
ప్రముఖ భాషావేత్త, రాజకీయ
పరిశీలకుడు

**నోమ్‌చోమ్‌స్కీ**

*2016 వ సంవత్సరం సెప్టెంబర్ 17న జరిగిన ఓ కార్యక్రమం సందర్భంగా నోమ్ చోమ్ స్కీ ఇలా ఉద్ఘాటించారు. "ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలను ప్రజలు ప్రభావితం చేస్తారు. కానీ యునైటెడ్ స్టేట్ ప్రభుత్వం ప్రధానంగా శక్తివంతుల కోసం, ధనిక వర్గం కోసం పని చేస్తుంది. కొత్త డాక్యుమెంటరీ "అమెరికన్ కలలకు ఉరిశిక్ష" నోమ్‌చోమ్‌స్కీ యొక్క వ్యాఖ్యకు మరింత అర్థవంతమైన రూపాన్నిచ్చి అధికారం, సంపద కేవలం కొందరి చేతుల్లోనే ఎలా చిక్కుకుపోయిందో తెలియజేస్తుంది. యునైటెడ్ స్టేట్స్‌లో తీవ్రమైన అసమానతలు చారిత్రకంగా ఎలా చోటు చేసుకున్నాయో వివరిస్తుంది.*

*అమెరికాలో అనేకానేక ప్రాథమిక అంశాలు క్రమంగా వెనకపట్టు పడుతున్నాయి. మౌలిక వసతుల పతనం, అందాల్సిన వాటికి, అందిన వాటికీ మధ్య విశాలమైన అంతరం, పెరగని వేతనాలు, పసిబిడ్డల మరణాల శాతంలో పెరుగుదల, ప్రపంచంలోనే అత్యధికంగా కారాగారావాసులు, అభివృద్ధి చెందిన దేశాలలో అగ్రగణ్యంగా ఉన్నప్పటికీ, అంతర్జాతీయంగా సమీకృత ఆరోగ్య విధానం లేకపోవడం, తదితరాలను పరిశీలించి నట్లయితే, అమెరికా ఆర్థిక, రాజకీయ వ్యవస్థలపై ఎన్నెన్నో సంక్లిష్ట ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. అంతేగాక అమెరికా జీవితం పట్ల చిరకాలంగా కలలుగంటున్న, వలస వాదులకు, అమెరికా పౌరులకు కల్లలవుతున్న వ్యవస్థ కలవరాన్నే కలిగిస్తూ మరెన్నో నూతన ప్రశ్నలకు కారణమవుతున్నది. ఈ పరిస్థితిని సమీక్షిస్తూ తీసిన డాక్యుమెంటరీలో ప్రపంచ ప్రఖ్యాత మేధావి నోమ్‌చోమ్‌స్కీ 'ట్రూత్ అవుట్' పత్రిక కోసం ఉరివేయబడుతున్న అమెరికా కలలను గూర్చి చర్చించారు.*

*ట్రూత్ అవుట్ అనే పత్రిక కోసం ప్రపంచ ప్రఖ్యాత రాజకీయ, ఆర్థిక విశ్లేషకుడు, శాస్త్రవేత్త, అంతర్జాతీయ పత్రికలలో ఎన్నో వ్యాసాలను ప్రచురించిన రచయిత సిజె పాలిక్రోనిమో చోమ్‌స్కీతో ఇంటర్వ్యూ జరిపారు. ఆ ఇంటర్వ్యూ విశేషాలను పాఠకులకు అందిస్తున్నాం.*

---

**నోమ్‌చోమ్‌స్కీ, మీ రచనలలో, ఎక్కువగా "ఆదర్శవంతమైన పెట్టుబడి దారీ ఆర్థిక వ్యవస్థ" విధానాన్ని ప్రశ్నిస్తూ ఉంటారు.... ఎందుకో చెప్పగలరా?**

నేను చెప్పబోయేది మీరు ఈ కోణం నుండే పరిశీలించండి. ఎప్పుడు ఏ సమస్య ఉత్పన్నమ యినా బ్యాంకులు లేదా ప్రధాన ఆర్థికసంస్థలు ముందుగా పన్ను చెల్లింపుదారులపై వత్తిడి తెస్తాయి. నిజమైన పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ ఉన్నట్లయితే అలా జరగదు. క్లిష్టమైన పెట్టుబడులు పెట్టి, అపజయం పొందినవారిపై వత్తిడి తెచ్చి, వారిని తొలగించడం జరగు తుంది. కానీ, ధనవంతులు, శక్తివంతులు పెట్టు బడిదారీ వ్యవస్థను కోరుకోవడం లేదు. పెద్దమనుష్యులుగా దేశాన్ని నడిపినట్లయితే సమస్య ఉత్పన్న మయినపుడు పన్ను చెల్లింపు దారుడు వారిని రక్షిస్తాడు. ఒక్క మాటలో సాంప్రదాయ బద్ధంగా చెప్పాలంటే "అపజ యాన్ని అంగీకరించడం క్లిష్టం".

అమెరికాలోని బ్యాంకులపై, వాటి లాభాల పై ఐయంయఫ్ గతంలో ఓ ఆసక్తికరమైన అధ్యయనం చేసింది. గవర్నమెంట్ ఇన్యూరెన్స్ పాలసీల్లో అవ్యక్త లాభాల ప్రయోజనాలను ఆపాదించింది. కేవలం చిన్న చిన్న అప్పుల ఉ ద్దీపనలను గూర్చి చర్చించింది. ఐయంయఫ్ పరిశోధకులు పట్టించుకోని అనేక అంశాలను కూడా ప్రస్తావించింది. ఉదాహరణకు చిక్కులతో కూడిన లావాదేవీలు, తక్కువ కాలంలో వచ్చే లాభాలు, ఏదైనా ఊహించని తప్పు పరిణా మాలు జరిగితే పన్నుదారులున్నారన్న ధీమాతో ఈ లెక్కలు వేయబడ్డాయి. "బ్లూమ్ బర్గ్ బిజినెస్ వీక్" వారి లెక్క ప్రకారం సంవత్సరానికి 80 బిలియన్ డాలర్ల సబ్సిడీ అవ్యక్తంగా పన్ను దారులకు అందుతున్నది.

**ఆర్థిక అసమానత్వం గూర్చి అధికంగా చర్చించ బడింది. అమెరికన్ చరిత్ర లోని బానిస యుగం కన్నా ప్రస్తుతమున్న పెట్టు బడిదారీ యుగంలోని ఆర్థిక అసమానతలు ఏ మాత్రం భిన్నంగా ఉ న్నాయి?**

ప్రస్తుతం సమాజంలో ఉన్న ఆర్థిక అసమానతలు చాలా వరకు అదృశ్యంగా ఉ న్నాయి. అమెరికన్ చరిత్రలోనే హీనమైన దశలో ఉన్నాము. జనాభాలో అత్యల్పశాతంగా ఉన్న సంపన్న వర్గం నుండే ఈ అసమానత ఉ ద్భవిస్తుంది. అమెరికా చరిత్రను పరిశీలించి నట్లయితే తొలినాళ్లయిన 1920లలో, ఆర్థికాభి వృద్ధి ఉధృతంగా ఉన్న 1990లలో ఇలాంటి అసమానతలే ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితి చాలా తీవ్రంగా ఉంది. అపారమైన సంపద కొందరి వద్దే కేంద్రీకృతం కావటం ఈ స్థితికి మూలం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే కేవలం 10శాతం మంది వద్దే సంపద కేంద్రీకృతమైంది. ఇది కేవలం ఆర్థిక అసమానతలను సృష్టించడమే గాక, ప్రజాస్వామ్యంలో క్రమంగా తిరోగమ నాన్ని, సభ్యసమాజంపై వ్యతిరేక ప్రభావాన్ని కలిగిస్తుంది.

**'అమెరికన్ కల' పై వీటన్నింటి ప్రభావం ఎంత? కల మరణించిందా?**

'అమెరికన్ కల' అనేది పూర్తిగా వర్గగతి గమన శీలతపై ఆధారపడి ఉందా? పేద వాడిగా జన్మించినప్పటికీ, కష్టించి పని చేసి, పేదరికాన్ని జయించి పిల్లలకు మంచి భవిష్యత్తు నివ్వవచ్చు. కొంతమంది ఉద్యోగులకు, శ్రామికు లకు గౌరవప్రదమైన ఉద్యోగం, చక్కటి ఆదా యం వస్తే ఓ చక్కటి ఇల్లు, కారు, పిల్లలకు మంచి విద్యను అందిచవచ్చు. కానీ ప్రస్తుతం ఆ వ్యవస్థ కూలి పోయింది. పాక్షికంగా ఇది నిజమైనప్పుడు, అనవసర భ్రమలలో మనముండ కూడదు. ప్రపంచంలోని ధనిక సమాజాలన్నింటి

కన్నా నేటి అమెరికా సమాజం దిగువనఉంది.

**అమెరికాలో ప్రజాస్వామ్యం కేవలం పేరుకేనా?**

అమెరికా ప్రజాస్వామ్య దేశ మైనప్పటికీ, ఇది ధనవంతు చేతుల్లో ఉందన్నది సుస్పష్టం. అయితే ఇప్పటికీ ఇది స్వేచ్ఛా సమాజమే. 'ప్రజాస్వామ్యం' అంటే ఏమిటో మనకు స్పష్టత ఉండాలి. ప్రజాస్వామ్యంలో తమకు ఏమి కావాలో ప్రజలు నిర్ణయించుకుంటారు. విధాన నిర్ణయం ప్రభుత్వం చేయాలి. ప్రజలకేం కావాలో ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వానిది. కానీ అమెరికాలోని అనేక ప్రాంతాలలో, అనేక సందర్భాలలో కార్పొరేట్ సంస్థలకు, వారి ఆర్థిక అభివృద్ధి, ఆసక్తులకు అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ధనిక వర్గం, సమాజంలోని ఉన్నత వర్గం అనేకానేక కారణాల రీత్యా ప్రజాస్వామ్యాన్ని హర్షించదు, అంగీకరించదు. ప్రజాస్వామ్యం ప్రజల చేతికి అధికారాన్నిచ్చి, తిరిగి తానే తీసుకుంటుంది. ఉన్నత వర్గం వాస్తవంగా సామాన్య ప్రజల చేతుల్లో నున్న అధికారానికి అనేకానేక అవధులు ఏర్పరచడానికే తరచూ ప్రయత్నిస్తుంది. ప్రస్తుతం అమెరికాలో అంతకన్నా భిన్నంగా జరగడం లేదు.

**సంపద ఎక్కడ ప్రతిఫలిస్తుందో అక్కడే అధికారం ఉంటుందనేది కాదనలేని సత్యం. పెట్టుబడిదారీ వ్యవస్థ సంపదను పోగు చేస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థను అనుసరించడం, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం కాదా?**

సహజంగానే సంపద పోగు పడిన చోట అధికారం కూడా నిక్షిప్తమవుతుంది. తద్వారా చట్టాలు కూడా ధనికులకు, బలవంతు లకు అనుగుణంగా, వారి ప్రయోజనాలను పరిరక్షించడం పైనే దృష్టి సారిస్తాయి. అనేకానేక రాజకీయ పరిణామాలు, ఉదా:– కోశాగారానికి సంబంధించిన విధానాలు, ఉద్దేశ్యాలు, సడలింపులు చేసే నిర్ణయాలు సైతం కార్పొరేట్ల కనుగుణంగా వారి సంపదను, అధికారాన్ని పెంచేదిశగానే నిర్దేశింపబడతాయి. నయా ఉదారవాద యుగంలో మరోసారి మనం అవే చూస్తున్నాం. నిరంతర అభివృద్ధి చక్రంలో ఇదో విషవలయం. ధనవంతులకు, బలవంతులకు రాజ్యం రక్షణ కల్పిస్తూ, వారి ప్రయోజనాలను పరిరక్షిస్తుంటే పెట్టుబడిదారీ వ్యవస్థ క్రూర ఫలాలను మిగిలిన ప్రజానీకం అనుభవిస్తున్నది.

**ధనికుల కోసం సోషలిజం పేదల కోసం పెట్టుబడిదారీ విధానం.**

అవును. ఆ దిశలో పరిశీలిస్తే పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రజాస్వామ్య పునాదులను బలహీన పరుస్తుంది. ముందే వివరించినట్లుగా అధికారం, సంపదల చుట్టూ అల్లుకున్న విష వలయం ఇది. 1776లో ఆడమ్ స్మిత్ వర్ణించింది కూడా ఇదే! ఆయన ప్రఖ్యాత రచన “వెల్త్ ఆఫ్ నేషన్స్”లో ఇంగ్లాండ్‌లో ఆనాటి సమాజాన్ని ఆక్రమించిన వర్తకులు, ఉత్పత్తిదారు లను అసలైన “విధాన కర్త”లుగా వర్ణిస్తాడు. తమ ప్రయోజనాలను, ఆస్తులను పరిరక్షించుకోవడంలో అమిత శ్రద్ధ వహించి, మిగిలిన ప్రజల పట్ల ప్రభుత్వం ద్వారా నిర్దయగా వ్యవహరించేవారు. ఇప్పుడు వర్తకులు, ఉత్పత్తి దారులు ఇక్కడ విధానకర్తలుగా వ్యవహరించడం లేదు. బహుళజాతి, ఆర్థిక సంస్థలు విధానాలను నిర్ణయిస్తున్నాయి. నాడు ఆడమ్‌స్మిత్ మానవజాతి నాయకులుగా వర్ణించిన వ్యక్తుల స్థానంలో నేడు ఆర్థికసంస్థలు ఉన్నాయి. “అంతా మనకే తప్ప మరెవ్వరికీ స్థానం లేదు” అన్న నీచమైన విధానాన్ని అవి అనుసరిస్తున్నాయి. తమకు లాభాన్ని కలిగించే విధాన నిర్ణయాలను ప్రోత్సహిస్తూ మిగిలిన వారందరికీ హాని కలిగిస్తారు. అలా చేయడానికిపెట్టుబడిదారుల ప్రయోజనాలే కారణం. ఇది వ్యవస్థ యొక్క స్వభావంలోనే ఇమిడి ఉంది.

> **“అంతా మనకే తప్ప మరెవ్వరికీ స్థానం లేదు” అన్న నీచమైన విధానాన్ని అవి అనుసరిస్తున్నాయి. తమకు లాభాన్ని కలిగించే విధాన నిర్ణయాలను ప్రోత్సహిస్తూ మిగిలిన వారందరికీ హాని కలిగిస్తారు. అలా చేయడానికి పెట్టుబడి దారుల ప్రయోజనాలే కారణం. ఇది వ్యవస్థ యొక్క స్వభావంలోనే ఇమిడి ఉంది.”**



కోటీశ్వరులతో నిండిన యుఎస్ సెనెట్

అమెరికా కల గూర్చి చర్చలోకి వద్దాం! అమెరికన్ రాజకీయ వ్యవస్థ గురించి ముందుగా మనం మాట్లాడాలి. నా ఉద్దేశ్యంలో ఇది “ప్రజాస్వామ్యం”గా ఉండాలని ఏనాడూ భావించ లేదు. (అమెరికా రాజకీయ వ్యవస్థ గూర్చి రిపబ్లిక్ అన్న పదాన్నే ఉపయోగిస్తూవచ్చారు. ఇది ప్రజాస్వామ్యానికి భిన్నమైనపదంగా ప్రాచీన రోమన్‌లు భావించారు) నాటినుండి నేటి వరకు స్వేచ్ఛ కోసం, ప్రజాస్వామ్యం కోసం నిరంతర పోరాటం సాగుతూనే ఉంది. ఈ విధంగా చూసినట్లయితే, అమెరికా కల కనీసం ఓ కల్పిత కథ కాదుగదా!


అమెరికా చరిత్ర ఆద్యంతం ఓ విషయం స్పష్టంగా కన్పిస్తూ ఉంటుంది. ఉన్నత ప్రజాస్వామ్యం కోసం కింది స్థాయి నుంచి నిరంతరం వచ్చే వత్తిడిని ఆధిపత్యంలోని వర్గం అణచివేసే ప్రయత్నాలను గమనించవచ్చు. అమెరికా ప్రాచీన చరిత్రను పరిశీలిస్తే పితామహుడుగా, అమెరికా ప్రధానశిల్పిగా ఖ్యాతిగాంచిన “జేమ్స్ మాడిసన్” సైతం ప్రజాస్వామ్యం పట్ల విశ్వసనీయత కలిగినప్పటికీ, రాజకీయ అధికారం “ధనవంతుల చేతుల్లోనే” ఉండాలని భావించారు. దానికి వారు చూపిన కారణం “ధనవం

> **"కేంద్రీకృతమైన పెట్టుబడులు, రాజకీయాలు కలగలసి ఓ విషవలయంగా ఏర్పడి, సంపద మొత్తం కొందరి చేతుల్లోకి వెళ్లి ఆర్థికరంగం రూపుమారింది. విస్తరించిన ప్రచారం ద్వారా, రాజకీయ నాయకులు సంపన్న వర్గాల మద్దత్తుదారులుగా మారి పోయారు. తద్వారా రాజకీయ నాయకులు వాల్‌స్ట్రీట్ వంటి శక్తివంతమైన వ్యాపార సంస్థల ప్రయోజనాలకు అనుగుణమైన నిర్ణయాలను చేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి."**

తులే బాధ్యత కలవారని". అందువలనే ఆనాడు అధికారం "సెనేట్" ల చేతుల్లోకి వెళ్లింది. వారు ప్రజలచే ఎన్నుకోబలేదు. వ్యక్తిగత ఆస్థులు కలిగి, ధనవంతులుగా చెలామణి అవుతున్న వారికి అందజేయబడింది.

రాజ్యాంగ సాంప్రదాయాలను గురించిన చర్చలను అధ్యయనం చేసినట్లయితే "రాజకీయ నిర్ణయాలు అల్పశాతంగా ఉన్న ధనికుల ప్రయోజనాలను కాపాడతూ ఉండాలని", "ప్రతి వారికీ ఉచితంగా ఓటుహక్కు ఉన్నట్లయితే, పేదలందరూ కలిసి ధనికుల సంపదను కొల్ల గొడతారన్న" మరొక వాదన సైతం మాడిసన్ చేశాడు. రాజ్యాంగం ద్వారా ప్రజాస్వామ్య వ్యాప్తిని నిరోధించే ప్రయత్నం ఆనాడు ఆ విధంగా జరిగింది. అరిస్టాటిల్ రాజకీయాల గూర్చి చెప్పింది ఓ సారి జ్ఞప్తికి తెచ్చుకుంటే ప్రస్తుతం ఇంచుమించుగా ఇదే విధానం కనిపిస్తుంది, "అన్ని రాజకీయ వ్యవస్థలకన్నా, ప్రజాస్వామ్యమే ఉత్తమమైనది" గా భావించాడు. మాడిసన్ దృష్టికోణంలోనే అరిస్టాటిల్ సైతం ప్రజాస్వామ్యంకావాలని భావించాడు.... "పేద లందరూ కలిసి పెద్దలను కొల్లగొతారనే "నమ్మా డు. అయితే ఈ సమస్యకు ఓ పరిష్కారం పైతం ప్రతిపాదిం చాడు. ఆర్థిక అసమానతలను తగ్గిస్తూ శ్రేయో రాజ్యంగా కొనసాగాలని సూచిం చాడు. అమె రికా పితామహులు పాటించిన సూత్రాలకు కాస్త భిన్నంగా అరిస్టాటిల్ ప్రజా స్వామ్యాన్ని చూశాడు.

వాస్తవ పరిస్థితులలో "అమెరికా కల" కాస్త వాస్తవంలోనూ, కాస్త పురాణాల్లోనూ ఉ ంది. కష్టించిపనిచేసే తమ జీవన ప్రమాణాలు ఖచ్చితంగా అమెరికా సమాజంలో మెరుగుగా ఉంటాయని 19వ శతాబ్దం ఆరంభం నుండి ఈనాటి వరకూ శ్రామిక వర్గం, వలస ప్రజలు నమ్ముతున్నారు. ఇది కొంతవరకూ నిజమే. అయినప్పటికీ స్త్రీల విషయంలో, ఆఫ్రికన్ అమెరికన్ల విషయంలో సుదీర్ఘకాలం ఇది



బెర్నీ శాండర్స్

వర్తించలేదు. గుర్తించవలసిన విషయంగా సైతం చాలాకాలం భావించలేదు. పెరగని ఆదాయాలు, జీవన ప్రమాణాల పతనం, విద్యార్థుల అప్పులు పెరుగుదల, మంచి ఉపాధి అవకాశాలు దొరకక పోవడం ఇవన్నీ అనేక మంది అమెరికన్లకు నిరాశను కలిగించ డమే గాక గతాన్ని జ్ఞాపకం చేస్తున్నాయి. డోనాల్డ్ ట్రంప్ కు పెరుగుతున్న "లైక్" లు ఈ నేపధ్యంగా వస్తున్నవే! బెర్నీ శాండర్స్ సందేశం కన్నా యువతను ఆకర్షిస్తున్న అంశాలు ఇవే!

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత 1970వ దశకం మధ్యంతరం వరకూ సమాజంలో సమానత్వం, మరింత స్వేచ్ఛాపూరిత వాతావరణం వరకూ నిరంతర ఉద్యమం నడుస్తూనే ఉంది. సమాజంలోని ధనికులు, అధికార వర్గం దీనిని అణచివేయాలని ప్రయత్నించినా పోరాటం ఆగలేదు.

**యుద్ధానంతరం ఏం జరిగింది?**

ఆర్థికాభివృద్ధి వెనక పట్టుపట్టింది. నూతన ఆర్థిక, సామాజిక విధానాలు అమలులోకి వచ్చాయి. అదే నయా ఉదారవాదంగా రూపు దిద్దుకున్నది. 1970వ దశకం ఆరంభంలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం వలన వృద్ధిరేటు తగ్గింది. యుద్ధానంతర పరిణామాలు, ప్రజలలో ప్రజాస్వామ్య భావనలు బలపడటం సంపన్న వర్గాల ప్రయత్నాలను కాస్త వెనక్కి నెట్టాయి. అది ఆర్థిక వ్యవస్థను కార్పొరేటీకరణ వైపు నడిపాయి. ఆర్థికసంస్థలు విస్తృత మయ్యాయి. 2007వ సంవత్సరం నాటికి కార్పొరేట్ సంస్థల లాభం ఆశ్చర్యకరంగా 40 శాతానికి పెరిగింది. కేంద్రీకృతమైన పెట్టుబడులు, రాజకీయాలు కలగలసి ఓ విషవలయంగా ఏర్పడి, సంపద మొత్తం కొందరి చేతుల్లోకి వెళ్లి ఆర్థికరంగం రూపుమారింది. విస్తరించిన ప్రచారం ద్వారా, రాజకీయ నాయకులు సంపన్న వర్గాల మద్దత్తుదారులుగా మారి పోయారు. తద్వారా రాజకీయ నాయకులు వాల్‌స్ట్రీట్ వంటి శక్తివంతమైన వ్యాపార సంస్థల ప్రయోజనాలకు అనుగుణమైన నిర్ణయాలను చేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో వ్యాపారవర్గానికి, కార్మిక వర్గానికి, పేదలకు మధ్య సంఘర్షణ అనివార్యమైంది. గత దశాబ్దాల అనుభవం మరలా జ్ఞప్తికి వచ్చింది.

**ప్రస్తుతం అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికయ్యారు. అంటే బెర్నీశాండర్స్ రాజకీయ విప్లవం ముగిసినట్లేనా?**

ఇది నిర్ణయించాల్సింది మనందరం, మిగిలిన ప్రజానీకం కూడా ఆ దిశగా సంకల్పించాలి. శాండర్స్ రాజకీయ విప్లవం గుర్తించాల్సిన దృగ్విషయం. నేను ఆయన పంథా పట్ల ఆశ్చర్యపోయాను. ఆనంద పడ్డాను కూడా. కాని మనం గమనించాల్సిన విషయం ఏమిటంటే "విప్లవం" అనే పదం వక్రీకరించబడుతుంది... శాండర్స్ నిజాయితీ పరుడు నిష్కపటి. ఆయన సిద్ధాంతాలు, ఆశయాలు ఐసెన్‌హోవర్‌ని అంతగా ఆశ్చర్యపరిచి ఉండకపోవచ్చు. ఆయనను విప్లవ కారుడిగా భావించడమంటే రాజకీయ చిత్రాన్ని నయా ఉదారవాదం ఏ స్థాయిలో ప్రభావితం చేసిందో తెలియడమే అయినప్పటికీ, శాండర్స్ తీసుకువచ్చి కదలికలో భవిష్యత్తు కనిపిస్తున్నది. ఉదాహరణకు బ్రాండ్ న్యూ కాంగ్రెస్ ఉద్యమం మొదలగునవి.

కేవలం నాలుగు సంవత్సరాల కొకసారి వచ్చే ఎన్నికలలో పాల్గొనే రీతిగా కాకుండా స్కూల్ బోర్డులనుండి, టౌన్ మీటింగ్‌ల నుండీ రాష్ట్రస్థాయి వరకూ నిరంతరం కార్యక్రమాలు జరిగే క్షేత్రస్థాయి నుండీ "స్వతంత్రంగా లెఫ్ట్ పార్టీ" ఎదిగే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉండాలి. ఇది జరగడానికి చాలా అవకాశాలు కూడా ఉన్నాయి. కారణం ప్రస్తుతం "అణు యుద్ధం", "పర్యావరణ విపత్తు" ఎల్లెడలా ఆవరించి, ప్రజలకు అరిష్టాన్ని కలిగిస్తూ, అత్యవసరంగా ఏదో ఓ చర్యలను చేపట్టాల్సిన తరుణం. దీనిని ఉపయోగించుకోవడం మంచిది.

**అనువాదం : డాక్టర్ శమంతకమణి**

**అక్టోబర్ సోషలిస్టు విప్లవ శతవార్షిక ప్రత్యేకం**

# చరిత్ర గతిని మార్చిన నవంబర్ 7

**ఆల్బర్ట్ ఆర్ విలియమ్స్**



సోవియట్ మీటింగ్‌లో లెనిన్

సువిశాలమైన పెట్రోగ్రాడ్ వీధుల్లో అప్పటికే కదలిక ప్రారంభమైంది. రష్యాలోని వివిధ ప్రాంతాల నుండి అక్కడికి చేరుకున్న వారు గస్తీ సిబ్బందితో చేస్తున్న సంభాషణలు, వాదనలతో సందడి వాతావరణం నెలకొంది. వారంతా అఖిల రష్యా సోవియట్ల రెండవ కాంగ్రెస్‌కు వచ్చిన ప్రతినిధులు. స్మోల్నీలో జరగనున్న ఆ సమావేశంపైనే అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.

ఒకప్పుడు రష్యన్ పాలకవర్గ ప్రభువుల కుమార్తెలకు పాఠశాలగా గుర్తింపు పొందిన స్మోల్నీ ప్రస్తుతం సోవియట్‌లకు కేంద్ర స్థానంగామారింది. నేవా నదిపక్కనే అత్యంత వైభవంగా జరిగిన ఆ భవన నిర్మాణం, చల్లని పగటి వేళల్లో బూడిద రంగులో కనిపిస్తుంది. రాత్రి వేళల్లో వందలాది దీపాల కాంతిలో గొప్ప ఆలయాన్ని తలపిస్తుంది. అదే ఇప్పుడు విప్లవానికి ఆలయంగా, నిలయంగా మారింది. ఆ భవన వరండాలోనే కాపలాదారులు వెలుతురుకోసం వెలిగించిన రెండు అగ్నిగుండాలు కనిపిస్తాయి. వాటి సమీపంలోనే పొడవాటి కోట్లు ధరించిన సైనికులు కనిపిస్తారు. అగ్నిగుండాల నుండి వెలువడుతున్న మంటలు బలిపీఠం నుండి దూసుకొస్తున్నట్లు కనిపిస్తున్నా యి. ఇక్కడే కోట్లాది మంది బాధాసర్పదష్టుల, నిరుపేదల ఆశలు కేంద్రీకృతమైఉన్నాయి. శతాబ్దాల తరబడి అనుభవించిన కష్టాలు, కడగళ్ల నుండి విముక్తికోసం వారు ఇటువైపే చూస్తున్నారు. జీవితకాలంపాటు వారు అనుభవించిన సమస్యలకు చరమగీతం ఇక్కడి నుండే వినిపించనుంది.

ఆ రాత్రి.. చీకటి నిండిన వీధిలో చిరిగిన దుస్తులతో, వేలాడిపోయిన ముఖంతో బిక్కపలుచని ఒక కార్మికుడిని నేను చూశాను. పీకల్లోతు నిరాశలో, దు:ఖంలో మునిగిపోయిన అతను తలతిప్పి ఒక్కసారిగా స్మోల్నీ నగరంలోకి ప్రవేశిస్తున్న మానవ మహా సమూహాన్ని చూడటం కనినించింది. మంచుపడుతున్న వేళలో దూసుకు వస్తున్న ఆ సమూహం బంగారుకాంతులీను తున్నట్లు ప్రకాశిస్తోంది. ఆ దృశ్యాన్ని చూడగానే అతను ఒక్కసారిగా లేచినిలబడ్డాడు. తలపై ఉన్న టోపిని సర్దుకుంటూ 'కమ్యూన్ .. ప్రజలు ... విప్లవం' అని పెద్దగా నినాదాలు చేస్తూ వారి వైపు పరిగెత్తాడు. వారితో కలిసిపోయాడు. పొగలు చిమ్ముకుంటూ ఆ గేట్ల నుండి లోపలికి వెళ్లిపోయాడు.

యుద్ధ సమయంలో రష్యన్ కమ్యూనిస్టులు చెల్లాచెదురయ్యారు. కొందరు దేశ బహిష్కరణకు గురయ్యారు. మరి కొందరు నెలల తరబడి నేలమాళిగల్లో తల దాచుకున్నారు. ఇంకొందరు సైబీరియాలో ప్రవాసంలో ఉండిపోయారు. ఆ కాలమంతా ఒకరిగురించి మరొకరికి నామ మాత్రపు సమాచారం కూడా తెలియదు. తమ ఆప్తులు, విప్లవ సహచరులు ఉన్నారో, శాశ్వతంగా కనుమరుగయ్యారో ఏ మాత్రం తెలియని స్థితి. అటువంటి వారంతా ఇప్పుడు స్మోల్నీలో కలుసుకోవడంతో ఒకరకమైన ఉద్విగ్న వాతావరణం నెలకొంది. సుదీర్ఘకాలం ఒకరినొకరు కలుసుకుని మిత్రులు ఒక్కసారిగా ఎదురుపడటంతో ఒక్క క్షణకాలంపాటు విస్మయానందంలో మునిగిపోతున్నారు. కౌగిలింతలు, కరచాలనాలు, ఎన్నాళ్లకు కామ్రేడ్ అన్న ఆత్మీయ పలకరింపుల్లో కాసేపు మునిగిపోయి, ఆ తరువాత సమావేశ మందిరంలో నిరంతరంగా సాగే సమావేశాల చర్చల్లో నిమగ్నమవుతున్నారు.


స్మోల్నీ ఇప్పుడు ఇక ఎంతమాత్రం గతకాలపు రాచరికపు హొయలొలికించే నగరం కాదు. ఇప్పుడది విప్లవాన్ని రూపొందించే అతి పెద్ద కర్మాగారం. అక్కడి వక్తలు ఆయుధాలను పట్టాలని పిలుపునిస్తున్నారు. వారు అటువంటి పిలుపునిచ్చినప్పుడల్లా ఆ సమావేశ మందిరం చప్పట్లోతోనూ, ఈలలతోనూ మార్మోగుతోంది. ఈ తరహా హర్షధ్వానాలు మిన్నంటినప్పుడల్లా నిర్వాహకులు నిశబ్దంగా ఉండాలని పదేపదే కోరడం కనిపిస్తోంది. మరోవైపు సిమెంటు వీధుల్లో ఆయుధాలతోనూ, మెషీన్‌గన్లతోనూ కాపలా కాస్తున్న సైనికులు చేస్తున్న నినాదాలు అజ్ఞాతం నుండి వెలుపలకు రానున్న లెనిన్, జినోవివ్‌లకు స్వాగతం పలుకుతూ ఆలాపించే విప్లవ బృందగానంలా ఉన్నాయి.

అక్కడ ప్రతి ఒక్కటి శరవేగంతో జరిగిపోతోంది. చకచకా మారుతున్న పరిణామాలు ప్రతి నిమిషానికి ఉత్కంఠను రేపుతున్నాయి. విరామమూ, అలసట లేకుండా ప్రతినిధులు మానవయంత్రాల మాదిరి తమకు కేటాయించిన పనులను చేసుకుపోతూ విప్లవంవైపు అడుగులేస్తున్నారు.

నవంబరు ఏడు.. రాత్రి పది గంటలు ! రష్యా భవిష్యత్తును, ప్రపంచ చరిత్రను నిర్దేశించే చారిత్రక సమావేశానికి సమయం ఆసన్నమైంది. వివిధ శాఖల నుండి ఎంపికై, అప్పటిదాకా గ్రూపు సమావేశాల్లో నిమగ్నమైన ప్రతినిధులు ఆ చారిత్రాత్మక సమావేశానికి వేదికైన అసెంబ్లీ హాలులోకి ప్రవేశిస్తున్నారు. బోల్షివిక్కులకు వ్యతిరేకంగా వ్యవహరించే డాన్ ఛైర్మన్ సీటులో ఉన్నారు. నిశ్శబ్దంగా ఉండటానికి సూచికగా గంటను మోగించిన అతను ఆ వెంటనే సోవియట్ల రెండవ కాంగ్రెస్ మొదటి సమావేశం ప్రారంభమైంది' అని ప్రకటించారు.

మొట్టమొదట గవర్నింగ్ బాడీ ఎంపిక విషయం అజెండాగా వచ్చింది. బోల్షివిక్కులు

> **"చరిత్రలో కొత్త పుటలను రాస్తోంది. మంత్రుల అరెస్ట్, స్టేట్‌బ్యాంక్ సీజ్, టెలిగ్రాఫ్ స్టేషన్, టెలిఫోన్ల కార్యాలయం, స్టాఫ్ హెడ్ క్వార్టర్లు ఒక దాని తరువాత ఒకటిగా ప్రజల ఆధీనంలోకి వస్తున్నాయి. అధికార కేంద్రాలు పట్టుతప్పి పోతుండటంతో బూర్జువా పాలకవర్గం విలవిల లాడిపోతోంది."**



అరోరా యుద్ధ నౌక

14 మంది, ఇతరులు 11 మంది ఎంపిక య్యారు. దీంతో పాత గవర్నింగ్ బాడీ సభ్యులు వేదిక దిగారు. రష్యా ప్రజల్లో మమేకమై, వారి ఆశాజ్యోతులుగా నిలిచిన బోల్షివిక్కులు వేదిక పైకి ఎక్కారు. ఆ వెంటనే మితవాదులు ఎదురు దాడికి దిగారు. వీరిలో ఎక్కువ మంది నిఘా వర్గాల ద్వారా అక్కడికి పంపినవారే!. విప్లవా నికి సంబంధించిన అంశాలకు భిన్నమైన వాటిని ప్రధానంగా సాంకేతిక అంశాలను, గవర్నింగ్ బాడీకి ఎంపికైన వారి అర్హతలను వారు ప్రశ్నిం చడం ప్రారంభించారు. సూత్రాలు, వాటి ఆచర ణకు సంబంధించిన విషయాలను లేవనెత్తుతూ సమావేశాన్ని గందరగోళంలో పడేయడానికి వారు ప్రయత్నించారు, ఈ గందరగోళం కొనసాగుతుండగానే ఆ రాత్రి ఒక అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. మితవాదుల ప్రశ్నలతో అయోమయానికి గురైన ప్రతినిధులను తమ కాళ్లమీద తాము నిలబడేటట్టు, అవాస్త వాలు. అభూత కల్పనలతో నిండిన వాదనలపై తిరుగుబాటు బావుటాను ఎగరేసేటట్టూ చేసిన ఆ సంఘటనే వింటర్ హౌస్‌పై కాల్పులు. అరోరా నౌక నుండి నౌకదళ సభ్యులు పేల్చిన ఫిరంగి గత కాలపు భావజాలాలపై, నిరంకుశ శాసనాలపై నిప్పులు చిమ్ముకుంటూ వింటర్ హౌస్‌పై ఒక్కసారిగా పడింది. కష్టజీవులు నిర్మించే నూతన చరిత్రకు, సమ సమాజానికి సెల్యూట్ చేసింది. ఆ వెంటనే సోవియట్లకే అన్ని అధికారాలు అన్న నినాదం అక్కడ మార్మోగింది. సమావేశానికి హాజరైన ప్రతినిధుల్లోనే కాదు.. నిర్ణయాల కోసం హాలు బయట ఎదురు చూస్తు న్న వేలాదిమంది నోటా అదే మాట! 'సర్వాధి కారాలు సోవియట్లకే..' ఈ నినాదం సముద్ర ఘోషలా ప్రతిధ్వనించడం ప్రారంభించింది. ఇప్పుడు సమావేశంలో ఒకటే ప్రశ్న! 'సోవియట్లను రష్యా ప్రభుత్వంగా ప్రకటిస్తారా...చట్టబద్ధమైన హక్కులిచ్చి గుర్తిస్తారా లేదా..?' అనే!

**సోవియట్ల చేతుల్లోకి ప్రభుత్వం ..!**

గడిచిపోతున్న ప్రతి నిమిషమూ విప్లవ చరిత్రలో కొత్త పుటలను రాస్తోంది. మంత్రుల అరెస్ట్, స్టేట్‌బ్యాంక్ సీజ్, టెలిగ్రాఫ్ స్టేషన్, టెలిఫోన్ల కార్యాలయం, స్టాఫ్ హెడ్ క్వార్టర్లు ఒక దాని తరువాత ఒకటిగా ప్రజల ఆధీనం లోకి వస్తున్నాయి. అధికార కేంద్రాలు పట్టుతప్పి పోతుండటంతో బూర్జువా పాలకవర్గం విలవిల లాడిపోతోంది.

అదే సమయంలో బురద కొట్టుకుని, ఊపిరి పీల్చడానికి కూడా ఇబ్బంది పడుతున్న ఒక కమిస్సార్ శరవేగంతో సమావేశ మందిరం లోని వేదికపైకి ఎక్కి 'సార్కోసోలో సోవియట్ల వశమైంది... ఈ బృందం పెట్రోగ్రాడ్ గేట్ల వద్దకు చేరుకుంది' అని ప్రకటించాడు. మరో మూల నుండి ఒక సోవియట్ బెటాలియన్ల సైక్లిస్టు 'మా సోదరుల రక్తం చిందించడానికి ఒక్కరు కూడా సిద్ధంగా లేరు.' అని అన్నారు. మరోవైపు క్రిలెంకో లేచి నిలబడి '12వ సోవియట్ ఆర్మీ నుండి అభినందనలు అందాయి. వారు నార్తర్న్ ఫ్రంట్‌ను స్వాధీనం చేసుకున్నారు' అని ప్రకటించారు.


ఈ మహోద్రిక్త, ఉత్కంఠ పూరిత మైన ఘటనల అనంతరం ఆ రాత్రి సోవియట్ల రెండవ కాంగ్రెస్ సంక్షిప్తంగా ఒక డిక్లరేషన్‌ను విడుదల చేసింది. 'ప్రొవిజనల్ ప్రభుత్వాన్ని రద్దు చేశాం. మెజార్టీ కార్మికుల, రైతుల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని సోవియట్ల కాంగ్రెస్ అధికారాన్ని చేబడుతోంది. అన్ని దేశాలు, జాతుల మధ్య శాంతి, ప్రజాస్వామ్యం వర్ధి ల్లాలని సోవియట్ కోరుకుంటోంది. దేశంలోని అన్ని భాగాల్లోనూ భూముల సత్వర పంపిణీకి హామీ ఇస్తోంది'అని ఆ డిక్లరేషన్‌లో పేర్కొన్నారు.

యుద్ధరంగంలోని తొలి ఫ్రంటు సైనికుల తోపాటు దేశ వ్యాప్తంగా ఈ సమాచారం చేరవేయడానికి కొరియర్లు బయలు దేరారు. టెలిగ్రాఫ్‌లు, టెలిఫోన్లతోపాటు విమానాల ద్వారా నాలుగు వైపులకు ఈ విషయం తెలి సింది. కష్టజీవులతో కూడుకున్న ప్రజాసమూ హపు లక్ష్యమే అంతిమంగా గెలిచింది. సోవి యట్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.

ఆ చారిత్రాత్మక సమావేశం ఉదయం ఆరుగంటలకు ముగిసింది. సుదీర్ఘ చర్చలతో, కార్యాచరణతో అలసిపోయిన ప్రతినిధుల కళ్ల నిద్ర లేమితో ఎర్రబడ్డాయి. కాని లక్ష్యాన్ని సాధించామన్న ఆనందంతో వారు ఆ భవన రాతిమెట్లను దిగారు. స్మోల్నీ వీధుల గుండా తమ ప్రాంతాలకు చేరుకోవడానికి ప్రయాణ మయ్యారు. అప్పటికి ఇంకా పూర్తిగా తెల్లవార లేదు. చల్లగానూ, చీకటిగానూ ఉంది. తూర్పు దిక్కున ఎర్రటి సూర్యుడు ఉదయించ డానికి సిద్ధంగా ఉన్నాడు.

**అనువాదం : శర్మ**

# పెట్టుబడిదారి వ్యవస్థ అణగారిన కులాలు



రచయిత
ప్రముఖ ఆర్థికవేత్త

ప్రభాత్ పట్నాయక్

సాధారణంగా పెట్టుబడిదారి వ్యవస్థ అంతకు ముందున్న తరగతుల నన్నింటినీ ధ్వంసం చేస్తుందన్న ఒక అవగాహన ఉంది. వాస్తవానికి ఈ 'తరగతి' ప్రజలు స్వచ్ఛందంగా చేరిన ఒక సమూహం కాదు. పుట్టుకతోనే వచ్చిన ఈ విభజనే కులం. అంటే మనిషి పుట్టక ముందే అతని కులం (తరగతి) నిర్ణయించబడుతుంది. అందులో మనిషి పుట్టిన నాటి నుండి కుల కట్టుబాట్లకు లోబడే ఉంటాడు. అంత మాత్రం చేత అక్కడ ఆధిపత్యం గాని, అణచివేతగాని లేనట్టుకాదు. పెట్టుబడిదారి వ్యవస్థకు ముందున్న యూరప్‌లోని భూస్వామ్య వ్యవస్థలోనూ భూస్వాములు రైతులను దోపిడీ చేసేవారు. భూస్వాములు కానివారి స్థితిగతులలోనూ ఎన్నో తేడాలు ఉండేవి.

ఇప్పుడు ప్రశ్నేమిటంటే పెట్టుబడిదారీ వ్యవస్థ అంతకు ముందున్న తరగతులను ఎలా ధ్వంసం చేస్తుంది? సర్వసాధారణంగా ఈ ప్రశ్నకు ఇచ్చే సమాధానం నన్ను సంతృప్తి పరచలేదు. ఈ ప్రశ్నకు ఇచ్చే సమాధానాలను ముందు చర్చించి, ఆ తరువాత నా సమాధానాన్ని మీ ముందుంచుతాను.

ఫ్రెంచి విప్లవ అనుభవం దృష్ట్యా ఇచ్చినది ఈ సమాధానాలలో ఒకటి. విప్లవం ద్వారా ఎక్కడయితే భూస్వాముల అధికారాన్ని రద్దు చేసి రైతులకు వారి భూములను పంచలేదో, వారిని చట్టం ముందు సమానులని ప్రకటించలేదో, వ్యక్తుల స్వేచ్ఛను హరించి, వారిని కట్టడి చేసిన అంతకు ముందున్న చట్టాల నుండి విముక్తులను చేయలేదో అది పాత వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు ఎక్కడయితే తీసుకొని రాలేదో, అక్కడ పాత వ్యవస్థ కొనసాగుతున్నట్లుగా భావించబడుతున్నది.

ఈ భావన ప్రశ్నార్థకం అనడానికి రెండు కారణాలున్నాయి. మొదటిగా ఫ్రాన్స్‌లో విప్లవం ద్వారా భూస్వాముల అధికారాన్ని కూల్చినట్టుగా మిగిలిన ఏ యూరప్ దేశాలలోనూ పునరావృతం కాలేదు. కాని ఆయా దేశాలలోని పాలక వ్యవస్థలు ధ్వంసం కాలేదని అనలేం. బ్రిటన్‌లో జరిగిన విప్లవంలోనూ రాజు ఉరితీయబడ్డాడు. పార్లమెంటుకు రాజుకన్నా ఎక్కువ అధికారాలు సంక్రమించాయి. కాని ఫ్రెంచి విప్లవంలో లాగా భూస్వాముల ఎస్టేట్‌లు విచ్ఛిన్నం కాలేదు. రెండవది ఫ్రాన్స్‌లో కూడా ఫ్రెంచి విప్లవం సాధించిన 'సమానత్వం' ఏ అడ్డంకులు లేకుండా బూర్జువాల కాలంలో లాగా కొనసాగుతున్నదని చెప్పలేం. అయితే రైతులు విప్లవకాలంలో పొందిన భూములను కాపాడుకోగలిగారు. ఫ్రెంచి విప్లవం తరువాత వచ్చిన ప్రతీఘాతుక విప్లవకాలంలో విప్లవంతో సాధించిన విజయాలు, అన్ని కాకపోయినా కొన్ని అయినా వదులుకోవలసి వచ్చింది. అందువలన పాతవ్యవస్థ పూర్తిగా విప్లవంతో రద్దయిందని అనలేము. 1945లో మాత్రమే ఫ్రాన్సులో సార్వజనీన ఓటు హక్కు వచ్చిందన్నది గమనించవలసిన అంశం. బ్రిటన్‌లో 1928 లోనే వచ్చింది. అందువలన బూర్జువా వర్గం రాజకీయ విప్లవాలకు చెప్పుకోదగిన చారిత్రక ప్రాముఖ్యత ఉన్నప్పటికీ, అది పాత వ్యవస్థ స్థానంలో నూతన వ్యవస్థను ఆవిష్కరించిందని చెప్పలేము.

పెట్టుబడి అంతకు ముందున్న రాజకీయ వ్యవస్థలో మార్పులకన్నా ఆర్థిక వ్యవస్థలో మార్పులను ధ్వంసం చేసి, కొత్తవ్యవస్థను ఎలా రూపొందిస్తుందన్నది ఈ ప్రశ్నకు రెండో సమాధానంగా చూద్దాం. పెట్టుబడిదారీ విధానం పాత సమాజంలో స్థానికంగా పనిచేసే శ్రామికులను కూకటి వేళ్ళతో తొలగించి, 'క్రియాశీలంగా పనిచేసే తన కార్మికసేనను పెంచుకుంటుంది. కొత్త పని ప్రదేశాలలో, కొత్త సామాజిక బాంధవ్యాల మధ్య వారిని వినియోగించుకుంటుంది. అందుకు మద్దత్తునిచ్చే వ్యవస్థ ఈ రకమయిన మార్పుకు తప్పనిసరిగా అవసరమే. కాని అసలు విషయం ఏమిటంటే, రాజకీయ విప్లవంతో భూస్వామ్య వ్యవస్థను కూల్చకుండా ఈ పాత వ్యవస్థలో మార్పు సాధ్యమేనా? ఇది సాధ్యమేగాని ఎక్కువ అడ్డంకులతో, ఎక్కువ బాధాకరంగా చాలా నెమ్మదిగా జరుగుతుందని మార్క్సిస్టు విశ్లేషణ చెబుతుంది. అది పెట్టుబడిదారీ అభివృద్ధిని రెండు మార్గాలుగా విభజిస్తుంది 1.ఫ్రెంచి విప్లవం లాంటి విప్లవ మార్గం. 2.ప్రష్యన్ పద్ధతి లాంటి జంకర్ మార్గం. పెట్టుబడిదారీ అభివృద్ధి స్వభావం రెండింటిలోనూ వేరుగా ఉంటుంది. విప్లవం ద్వారా భూస్వాములను పారద్రోలి, రైతులకు భూములను పంచి ఇచ్చిన పెట్టుబడిదారీ విధానం సామాజికంగా, రాజకీయంగా,విశాలంగా ఉంటుంది. విదేశీ మార్కెట్ల అవసరం అంతగా ఉండదు. ఎందుకంటే భూ పంపకం వలన దేశీయ మార్కెట్ విస్తృతంగా ఉంటుంది. విప్లవం లేకుండా పాత భూస్వామ్య వ్యవస్థ యొక్క భారంపైనే పెట్టుబడిదారి దోపిడీ భారం కూడా రుద్దినప్పుడు పాతవ్యవస్థ రద్దు చాలా నెమ్మదిగా ఉంటుంది. చాలాకాలం క్రితమే బారింగ్‌టన్ మూర్ ఈ రకమయిన విప్లవం లేని పెట్టుబడిదారి విధానానికి దారి తీయడంలో నిరంకుశ ధోరణి మూలాలు ఉంటాయి అన్నారు.

భారతదేశంలో కులవివక్ష, కుల అణిచివేత ఇంకా కొనసాగడానికి కారణాలు విశ్లేషించటానికి పై వైవిధ్యాన్ని ఉపయోగించుకోవచ్చు. భారతదేశంలో వలస పాలన అంతమయినా చెప్పుకోదగ్గ స్థాయిలో భూ పంపకం జరగలేదు. కొంతమంది పెద్ద భూస్వాములను తొలగించిన

**"పెట్టుబడిదారుల సంపద దాడికి గురవుతుండటం వలన, భూస్వాములపై తిరగబడితే కార్మికులు తమ సంపదపై దాడులు చేస్తారేమో అని పెట్టుబడిదారులు భయపడి, భూస్వాములతో రాజీ పడ్డారు. చారిత్రకంగా పెట్టుబడిదారీ వ్యవస్థ ఆలస్యంగా ఏర్పడిన చోట అది పాత్యవ్యవస్థను మార్చేంత క్రియాశీలంగా ఉండదు"**



గుజరాత్‌లో దళితులపై దాడి

మాట నిజమే. పెట్టుబడిదారి వ్యవసాయానికి అనుకూలంగా లేనివారి భూమిని ధనిక, మధ్యతరగతి రైతులకు పంచడం జరిగింది. కాని అసలు భూమిలేని పేద రైతులు అలాగే మిగిలిపోయారు. అంటే భూకేంద్రీకరణ బద్దలవలేదు. మునుపటిలాగే మొత్తం భూమిలో ఎక్కువ భాగం పై 15 శాతం భూమిగల కుటుంబాల మధ్యే మిగిలిపోయింది. పంపకాలన్నీ ఆ 15 శాతం కుటుంబాల మధ్యే జరిగాయి.

అందువలన అణగారిన ప్రజలపై పాత ఆధిపత్యం అలాగే కొనసాగింది. పాత భూస్వామ్య వ్యవస్థలోని కుల అణచివేత కొత్త వ్యవస్థలోనూ కొనసాగింది. కాకపోతే పాతతరం భూస్వాములకు బదులుగా కొత్త పెట్టుబడిదారీ భూస్వాములు వచ్చారు. భూ పంపకం జరగక పోవడం వలన దేశీయ మార్కెట్ కుంచించుకు పోతూనే ఉంది. అందువలన పెట్టుబడిదారీ అభివృద్ధి కూడా చాలా నెమ్మదిగా జరుగుతున్నది. పారిశ్రామిక రంగంలో ఉద్యోగావకాశాలు కూడా పరిమితంగానే వృద్ధి చెందుతున్నాయి. అందువలననే భూమిలేని అణగారిన తరగతులు ఇంకా వారి బస్తీలలోనే నివశిస్తున్నారు. వారి స్థానం కూడా పాత దొంతరలలో ఉన్నట్టుగానే ఉండిపోయింది.

అందువలన భారతదేశంలో పెట్టుబడిదారీ విధానం విప్లవాత్మకంగా రాకపోవడమే కులవ్యవస్థ కొనసాగడానికి కారణమనే వాదన ఉంది. చారిత్రకంగా భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఆలస్యంగా రావడం ఇందుకు కారణం. అందువలన తన మనుగడను కాపాడుకునేందుకు అది పాత భూస్వామ్య వ్యవస్థతో సర్దుబాటు చేసుకోవలసి వచ్చింది. సోషలిస్టు విప్లవ ప్రభావాలతో అప్పటికే పెట్టుబడిదారుల సంపద దాడికి గురవుతుండటం వలన, భూస్వాములపై తిరగబడితే కార్మికులు తమ సంపదపై దాడులు చేస్తారేమో అని పెట్టుబడిదారులు భయపడి, భూస్వాములతో రాజీ పడ్డారు. చారిత్రకంగా పెట్టుబడిదారీ వ్యవస్థ ఆలస్యంగా ఏర్పడిన చోట అది పాత్య వ్యవస్థను మార్చేంత క్రియాశీలంగా ఉండదు. దానిని అనుసరించే పోతుంటుంది. అందువలనే భారతదేశంలో కుల అణచివేత ఈనాటికీ కొనసాగుతున్నది.

పెట్టుబడిదారీ విధానం భారతదేశంలో భయంకరమైన కుల అణచివేతను ఆపలేక పోయిందన్నది స్పష్టం. అయితే అందుకు కారణం పైన మనం చెప్పుకున్నవేనా, లేక మరేవైనా ఉన్నాయా అన్నది చర్చించుకుందాం. ఇది మనలను మళ్ళీ మొదటికి తీసుకుని వస్తుంది. పట్టణాలలో పాత కుల వ్యవస్థను పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా ఛేదించగలిగింది?

పెట్టుబడిదారి వ్యవస్థ అంతకుముందున్న వ్యవస్థ నుండి కార్మికులలో పెద్దభాగాన్ని పెట్టుబడిదారి విధానం వైపు మరల్చడం పాత 'కులవ్యవస్థ' రద్దుకు దోహదం చేసిందని చెప్పేందుకు అభ్యంతరం ఉండవలసిన అవసరం లేదు. అయితే పాత కులవ్యవస్థ రద్దయి, ఆ స్థానంలో కొత్త సమూహం ఏర్పడింది. ఇది పుట్టుకతో కాక, స్వచ్ఛందంగా సంఘ సభ్యత్వం తీసుకుని ఏర్పాటు చేసుకున్నది. వ్యక్తులుగా కన్నా అందరూ సంఘంగా ఏర్పడం వలన అందరికీ లాభం చేకూరుతుందన్న ముఖ్య ఉద్దేశ్యంతో ఏర్పడ్డది. (అందరూ కూడడానికి, కలవడానికి తేడాను గమనించాలి) కార్మికుల కలయిక వలన నూతన సమూహాన్ని నిర్మించిందనే విషయాన్ని తరచుగా చెప్పటాన్ని మరచిపోతుంటాం. వ్యక్తులుగా వారొక సమూహాన్ని ఏర్పాటు చేయాలని, ఆ సమూహం నడవటమే ప్రధాన లక్ష్యంగా అందులోని వ్యక్తులు భావించారు. వ్యక్తులుగా దాని నుండి ఎటువంటి ప్రయోజనం పొందాలని వారు భావించలేదు.

అయితే ఒక సమూహం నుండి ఇంకో సమూహానికి మార్పు ఎలా సాధ్యం? సాధారణంగా పెట్టుబడిదారీ వ్యవస్థ ఆదిమ సంచయానికి పాల్పడుతుందని, చిన్న ఉత్పత్తిదారులు, రైతుల నుండి బలవంతంగా ఉత్పత్తి సాధనాలను వేరు చేస్తుందని (దురదృష్టవశాత్తు భూస్వాముల నుండి భూమిని తీసుకొని పంచడమే వెనకడుగుకావచ్చు) ఆ తరువాత చిన్న ఉత్పత్తిదారులను వారి స్వస్థలాల నుండి దూరంచేసి, వారిని కార్మికశక్తిగా మారుస్తుందని అంటుంటాం. పాత ఆర్థిక వ్యవస్థ నుండి కొత్త ఆర్థిక వ్యవస్థకు ఉపాధి మార్పు ఇలాగే జరుగుతుంది.

ఈ బలవంతం 'ఇంగ్లాండులో' ఎన్‌క్లోజర్ ఉద్యమం' లోలాగా ప్రత్యక్షంగా బలవంతం చేయడమే కానక్కరలేదు. రోజాలగ్జంబర్గ్ తన ప్రముఖ గ్రంథం ఎక్యూములేషన్ ఆఫ్ కాపిటల్' లో వ్రాసినట్టు చిన్న ఉత్పత్తి దారులను సరకుల ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములనే చేసి పెట్టుబడిదారుల ఉత్పత్తులతో పోటీ పడేట్టుచేసి తద్వారా దివాళా తీయించడం ద్వారా కావచ్చు. వలసవాదులు వలస దేశాలలో విపారిశ్రామీ

కరణ చేసిన విధంగా కావచ్చు.

కాని పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించిన సాహిత్యమంతటిలో వ్రాసినట్టు, పెట్టుబడిదారి వ్యవస్థ, అంతకు ముందున్న వ్యవస్థలో నిరాశ్రయులను చేసిన వారందరికీ, కార్మిక నిలవసైన్యంగా ఉంచుకున్న వారికి తప్ప, ఉపాధి కల్పిస్తున్నదనడానికి ఆధారాలు లేవు. డేవిడ్ రికార్డో కూడా పెట్టుబడిదారి వ్యవస్థలో స్థానభ్రంశం చెందిన కార్మికులను పెట్టుబడిదారీ రంగం ఇముడ్చు కుంటుంది గాని చిన్న ఉత్పత్తిదారులను కాదని, యంత్రాల వలన తొలగించబడిన వారు ఇముడ్చుకోబడతారని అన్నారు. అదే ఇక్కడా ఉంటుంది. రికార్డో అసలు ప్రచారంలో రెండు లోపాలున్నాయి. 1. ఏ ఒక్క ఆవిష్కరణ వలనో స్థాన భ్రంశం పొందిన కార్మికులను గురించి కాక అనేక ఆవిష్కరణల ద్వారా స్థానభ్రంశం పొందిన మొత్తం కార్మికులపై ప్రభావాన్ని పరిశీలించాలి. 2. ఆయన ప్రతిపాదించినట్టు డిమాండుతో సంబంధం లేకుండా లాభాలు ఎక్కువ ఉంటే పెట్టుబడులు పెరుగుతాయన్న వాదన 'సే' సూత్రం కొనసాగింపే. ఇది చెల్లదు. అందువలననే పెట్టుబడిదారి విధానం వలన ఉపాధి కోల్పోయిన వారందరూ క్రియాశీల కార్మికసైన్యంగా ఈవ్యవస్థలో మలచబడతారన్న వాదనను అంగీకరించలేము.

❝భారతదేశానికి దీనిని అన్వయించుకుంటే క్రియాశీల కార్మికసైన్యం కన్నా, నిల్వ కార్మికులు పెరగడం చూడవచ్చు. వీరు 'అసంఘటిత ఉపాధి', అడపాదడపా ఉపాధి, భిన్న వ్యాపారాలు మొదలైన రూపాలలో ఉన్నారు. ఇటువంటి విభజనల వలన కార్మికులను సంఘటితం చేయడం కష్టమవుతుంది. అంతేకాదు సంఘటిత కార్మికోద్యమాన్ని కూడా బలహీనపరుస్తుంది.❞

క్లుప్తంగా చెప్పుకోవాలంటే పెట్టుబడిదారీ వ్యవస్థ తన పూర్తి శక్తిమేరకు ఉత్పత్తి చేసి లాభాలు పొందుతున్నప్పుడు ఎలాగయితే పెట్టుబడులను పెంచదో అలాగే తను స్థానభ్రంశం చేసిన కార్మికులందరినీ ఇముడ్చుకోదు. అందువలన పాత సంఘ వ్యవస్థ నిర్మూలన, కొత్త సంఘ వ్యవస్థ నిర్మాణానికి సమాధానం మరోచోట వెతుక్కోవాలి. గుత్త పెట్టుబడిదారీ చరిత్రలో తెల్లవారున్న సమ శీతోష్ణస్థితిగల ప్రాంతాలకు వలసలు రావడంలో మనం సమాధానం చూడవచ్చు. వీరు కొత్త ప్రపంచంలో పెట్టుబడులను పెంచుకునేందుకు ప్రోత్సాహానికి కారకులయ్యారు. అంటే మొత్తం వ్యవస్థకు చాలాకాలం ప్రోత్సాహాన్నిచ్చారు. ఈ వలసల ఉధృతిని ఒక్క సమాచారం ద్వారా అర్థం చేసుకోవచ్చు. 1815–1910 మధ్య బ్రిటన్‌లోని సగం జనాభా సమశీతోష్ణ ప్రాంతాలకు వలసలు పోయారు. మొత్తం కాలంలో చూసుకుంటే ఇది వారి దేశ వాస్తవ జనాభాకి ఒకటిం పాతిక రెట్లు. ఈ ఆదాయం తిరిగి వచ్చిన కార్మికులకు 'నిల్వ' జీతంగా కూడా ఉపయోగపడింది. దేశీయ నిజ వేతనాలు పెరిగాయి. వలసలు కట్టడి చేయడం ద్వారా 'నిల్వ కార్మిక సైన్యాన్ని' అదుపులో ఉంచటం వలన కార్మికోద్యమం బలపడింది. కొత్త సంఘ వ్యవస్థ ఏర్పడేందుకు దోహదం చేసింది.

ఇది పాత వ్యవస్థను నాశనం చేసేందుకు సహకరించింది. పడిపోతున్న నిజ వేతనాలతో, ప్రత్యామ్నాయ ఉపాధిలేని పరిస్థితిలో పాత నివాస ప్రాంతాలలోనే ఎల్లకాలం ఉండిపోలేదు. ఉదాహరణకి వలస పాలనలో భారత దేశంలోని నేతగాళ్ళు 'విపారిశ్రామికీకరణ' జరిగినప్పుడు ఏం చేశారో మనం చూశాం. అందువలన నా ఉద్దేశ్యంలో పాత కులవ్యవస్థ నిర్మూలలో గుత్త పెట్టుబడి విప్లవాత్మక పాత్ర వహించిందిగానీ బూర్జువా రాజకీయ విప్లవం కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థ అంతకు ముందున్న శ్రామిక ప్రజల కార్యకలాపాలను తనకనువయిన కార్యకలాపాలలోకి మార్చి ఇముడ్చుకోవడం కాదు.

కానీ ఈ రోజు తమ సర్వస్వాన్ని, వదులు కొని వలస పోవలసిన స్థితిలోని నైతికాంశాన్ని ప్రక్కన పెట్టి ప్రపంచంలో అటువంటి వలసలకు తావులేదు. బ్రిటన్‌లో జరిగిన వలసల లాంటివి భారతదేశంలో జరగవలసి వస్తే 40 కోట్ల మంది భారతీయులు వలసపోవాలి. ఇది అసాధ్యమైన విషయం. అందువలన మనదేశం లాంటి దేశాలలో పెట్టుబడిదారీ వ్యవస్థకు పాత సమాజంలోని కులవ్యవస్థను రద్దుచేసే సామర్థ్యం లేదు. పాత గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థలోనే భిన్నంగా కుల అణచివేత ఇంకా కొనసాగుతున్నది. వామపక్షవాదులు వాదిస్తున్నట్టుగా బూర్జువాజీ, పోరాటంలోకి ఆలస్యంగా వచ్చినందు వలన భూస్వాములలో రాజీ పడవలసి వచ్చిందని నేను అనుకోవడం లేదు. (జర్మనీలో కూడా ఈ బూర్జువా భూస్వామ్య కూటములు ఏర్పడ్డా అది జర్మనీ ఫ్రాన్స్‌తో సమానంగా ఆధునీకరణ చెందడానికి అడ్డంకి కాలేదు) పెద్దఎత్తున వలసలను అనుమతించక పోవడం వలననే గుత్త పెట్టుబడికి ఇప్పుడు అవకాశాలు తగ్గిపోయాయి. (అంటే అన్ని యూరప్ దేశాల్లోనూ ఒకే రకంగా వలసలను అనుమతించారని దీనర్థం కాదు. కాని కొన్ని దేశాలలో వలసలను అనుమతించడం వలన, వలస కార్మికులను ఇముడ్చుకోవడం వలన, నిల్వ శ్రామిక సైన్యం నుంచి కొంతమందిని చురుకైన సైన్యంగా కొన్ని పెట్టుబడిదారీ వ్యవస్థలు మార్చుకున్నాయి.

భారతదేశానికి దీనిని అన్వయించుకుంటే క్రియాశీల కార్మికసైన్యం కన్నా, నిల్వ కార్మికులు పెరగడం చూడవచ్చు. వీరు 'అసంఘటిత ఉపాధి', అడపాదడపా ఉపాధి, భిన్న వ్యాపారాలు మొదలైన రూపాలలో ఉన్నారు. ఇటువంటి విభజనల వలన కార్మికులను సంఘటితం చేయడం కష్టమవుతుంది. అంతేకాదు సంఘటిత కార్మికోద్యమాన్ని కూడా బలహీనపరుస్తుంది. అసంఖ్యాక కార్మిక నిల్వలు ఉండడమే కాదు. దిన దినానికి క్షీణిస్తున్న సంఘటిత రంగం కూడా ఇందుకు కారణం.

ఈ క్షీణతకు రెండు కారణాలు. 1) ప్రభుత్వరంగం క్షీణించడం. ప్రభుత్వరంగం భారీ పరిశ్రమల ఆధారంగా నిర్మించబడటం. ఇది సంఘాలు ఏర్పడడానికి, సమర్థవంతంగా పని చేయించడానికి దోహదం చేసింది. 2) కార్మిక నిల్వలు విస్తరించడంతో క్రియాశీల కార్మికులకు, నిల్వ కార్మికసైన్యానికి మధ్య తేడా తగ్గించబడే విధంగా తయారైంది. సాధారణంగా 90 శాతం క్రియాశీల కార్మికులు 10 శాతం నిల్వ కార్మిక సైన్యం ఉండడం సహజం. కానీ ఇప్పుడు ప్రతి కార్మికుడు 90 శాతం సమయం పనిచేస్తున్నందువలన క్రియాశీల కార్మికుడికి, నిల్వ కార్మికుడికి మధ్య తేడా చెరిగిపోతున్నది. దీనికి తోడు కార్మికులు సంఘటితమయ్యే అవకాశాలు తగ్గిపోతున్నాయి.

అందువలన రకరకాల కార్మికులతో కొత్త సమూహాలు (కమ్యూనిటీ) తయారవడం కష్టం. మరోవైపు కొత్త ఉపాధి అవకాశాలు లేక ప్రజలు

**"పెద్దమొత్తాలలో జీతాలు చెల్లించే ఉద్యోగాలకు కొంత చదువు, ఆంగ్లంపై కొంత పట్టు, ఆర్థిక, యాజమాన్య పద్ధతులపై కొంత శిక్షణ అవసరమవుతాయి. చారిత్రకంగా ఇవి పై తరగతుల పిల్లలకు, ఆర్థికంగా వెలుసుబాటున్న కుటుంబాల నుండి వచ్చిన వారికే అందుబాటులో ఉంటాయి."**

తక్కువ వేతనాలతో పనులు చేసుకుంటూ తాము నివసించే ప్రాంతాలనే పట్టుకొని వేళాడుతుంటారు. అందువలననే పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందినా పాత వ్యవస్థ యొక్క ప్రధానాంశమైన కుల అణచివేత కొనసాగుతుంటుంది.

నూతన ఆర్థిక విధానాల వలన ఉద్యోగావకాశాలు పెరగలేదు. (మనం మరుగుపరచిన నిరుద్యోగాన్ని ఉద్యోగంగా చూడడం మానుకుంటే) ఐటి రంగంలాంటి రంగాలలో మాత్రమే పెరిగాయి. కింద చెప్పబోయే కారణాల వలన కొన్ని పెద్ద మొత్తాలలో జీతాలిచ్చే సేవలు పెరిగాయి.

శ్రామికసైన్యం పెరగడం వలన నిజ వేతనాలు జీవనాధారానికి సరిపడా మాత్రమే ఉంటున్నాయి. దీనివలన ఉత్పత్తిలో అదనపు విలువ పెరుగుతుంది. ఫలితంగా సమాజంలో అసమానతలు పెరుగుతాయి. పెరిగిన అదనపు విలువలో కొంతభాగాన్ని సేవారంగంలోని 'అమ్మకాల ప్రయత్నం'లో పనిచేసే వారికి అధిక మొత్తాలలో చేరుతున్నది. వినిమయం వైపునుండి చూస్తే వీటిని అన్నింటినీ 'లగ్జరీ సేవలు'గా విభజించవచ్చు. పెద్ద మొత్తాలలో వేతనాలు గల సేవారంగం (హై ఎన్డ్ సర్వీస్ సెక్టార్) అదనపు విలువ పెరుగుతున్నదనటానికి చిహ్నం. ఈ రంగంలో పెరిగిన ఉద్యోగాలు కూడా నిజమైన ఉద్యోగాలు. కానీ తక్కువ వేతనాలు గల సేవారంగంలో ఉపాధి మరుగుపరచబడిన నిరుద్యోగమే. (డిస్గైస్డ్ అన్ ఎంప్లాయిమెంట్)

పెద్దమొత్తాలలో జీతాలు చెల్లించే ఉద్యోగాలకు కొంత చదువు, ఆంగ్లంపై కొంత పట్టు, ఆర్థిక, యాజమాన్య పద్ధతులపై కొంత శిక్షణ అవసరమవుతాయి. చారిత్రకంగా ఇవి పై తరగతుల పిల్లలకు, ఆర్థికంగా వెలుసుబాటున్న కుటుంబాల నుండి వచ్చిన వారికే అందుబాటులో ఉంటాయి. అందువలన నూతన ఆర్థిక విధానాల వలన క్రింది తరగతుల పిల్లలు నిల్వ కార్మికసేనలో చేరి తక్కువ జీతాలు వచ్చే ఉద్యోగాలు చేయవలసి వస్తుంది. పై తరగతి పిల్లలో కొంతమందయినా (ఐటి రంగం లాంటి చోట మంచి జీతాలు ఇచ్చే) సేవారంగంలో పని చేస్తుంటారు.

ఇదివరకు రిజర్వేషన్ల కారణంగా క్రింది తరగతుల పిల్లలు ప్రభుత్వరంగంలో చేరి, కొంతవరకైనా పైకి వెళ్ళే అవకాశం ఉండేది. ప్రభుత్వరంగం ప్రైవేటీకరించబడటంతో సాపేక్షంగా గాని, వాస్తవంగా గాని, ప్రభుత్వరంగం కుంచించుకుపోయింది. మరోవిధంగా చెప్పుకోవాలంటే సేవలలో తరుగుదల లేకపోవడం, అదనపు విలువ పెరుగుదల, పేద, పై కులాల పిల్లలకు ఉండే అవకాశాలలో తేడాల పెరుగుదల, నూతన ఆర్థిక విధానాల అమలు క్రమంలో కొన్ని చిక్కుముడి పరిస్థితులకు దారితీశాయి. ఇవి పెట్టుబడిదారీ వ్యవస్థలో నూతన ఆర్థిక విధానాల అమలు కాలంలో కులాల అంతరాలను ఉధృతం చేశాయి.

కులాల మధ్య దురభిమానం పెరుగుతున్నది. పై కులాల వారి పిల్లలు వారు ఉన్నత ఉద్యోగాలు సంపాదించేందుకు, విజయాలకు నిమ్న కులాల వారికన్నా సాపేక్షంగా అధికంగా ఉన్నవారి సంపద, సమాజంలో మెరుగైన స్థానంలో ఉండడం కారణమని భావించడం లేదు. అందుకు భిన్నంగా పెట్టుబడిదారీ వ్యవస్థ చెప్తున్నట్లే నిమ్న కులాల పిల్లల కంటే వారు సమర్థులవడమే కారణం అని భావిస్తున్నారు. ఈ కుల వ్యవస్థను వ్యతిరేకించే బదులు ఈ భావనకు మరింత ఎక్కువ ఆదరణ పెరుగుతున్నది. ఇంకోరకంగా చెప్పాలంటే దురభిమానాలను సైద్ధాంతీకరించడం తప్పనిసరిగా జరుగుతున్నది. ఇది అగ్రకులాలు, నిమ్న కులాల పిల్లల మధ్య అంతరాన్ని పెంచడాన్ని సమర్థిస్తున్నది. ప్రపంచ ఆర్థిక సంక్షోభంలో భాగంగా రిజర్వేషన్లను పూర్తిగా తొలగించాలనే డిమాండును మనం సమర్థించే స్థాయికి చేరుతున్నది.

ఆర్థిక సంక్షోభం తీవ్రమవుతున్నకొద్దీ ఈ డిమాండ్ మరింతగా పెరుగుతుంది. పై కులాల పిల్లలు కూడా, ముఖ్యంగా బాగా చదువుతున్న కుటుంబాలలోని వారు కూడా నిరుద్యోగులుగా మారటం వలన రిజర్వేషన్లను ఎత్తివేయాలనే డిమాండు ఉధృతమౌతుంది. ఫలితంగా మనం సామాజికంగా, సైద్ధాంతికపరంగా కూడా వెనుకడుగు వేస్తాం. కొత్త సమూహాన్ని నిర్మించే బదులు కుల విభజనను పెంచుకుంటాం. కుల దురభిమానాలు ఉధృతమౌతాయి.

నేను చెప్పినదాన్ని ఇలా సైద్ధాంతీకరించవచ్చు. విషవలయానికి సద్వలయానికి మధ్య తేడాను చూడగలగాలి. పెట్టుబడిదారీ అభివృద్ధిని 'విషవలయంగా గాని, సద్వలయంగా గాని గుర్తించలేము. చారిత్రకంగా పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందిన కాలంలో వలసలు అనుమతించినప్పుడు అదొక సద్వలయంగా ఉన్నది. భూస్వామ్య యుగంలో సమూహాల మధ్య అంతకుముందున్న సామాజిక అంతరాలను సరిచేసిన విప్లవాత్మక ప్రభావం గలదిగా ఇది ఎంచబడింది. కాని వలస విధానం నుండి విముక్తి పొందిన తృతీయ ప్రపంచ దేశాలలో, పెట్టుబడిదారీ విధానం తనంత తానుగా ఏర్పడిన నేపథ్యంలో, పెట్టుబడిదారీ విధాన విశేషత అయిన యాధృచ్ఛికతను తిరిగి పొందిన సమాజంలో ఇది సాధ్యపడదు. నయా ఉదారవాద విధానాలతో ఇందుకు పూర్తిగా విరుద్ధంగా జరుగుతుంది. ఒక విషవలయం ఏర్పడుతుంది. ఈ సమాజాలలో సంస్థానీకరించబడిన అసమానత్వం తగ్గే బదులు పాతుకొని పోతుంది. పెరుగుతుంది. పెట్టుబడిదారీ సిద్ధాంతం కూడా మనుస్మృతి ఆధారంగా రూపొందించబడిన కుల విచక్షణను పెంచేందుకు అలవాటు పడిపోతుంది.

దీనికి మరికొన్ని పర్యవసానాలున్నాయి. ఈ విషవలయం వలన అణగారిన కులాల ఆర్థిక ఔన్నత్యమేకాదు. సామాజికంగా ముందడుగు వేసే డిమాండ్‌ను బలపరిచేందుకు నిర్ణయాత్మక కార్యకలాపాలు తీసుకుంటారు. ప్రయివేటురంగం విస్తరించడం, ప్రభుత్వ రంగంలోని రిజర్వేషన్ల అమలు ఉన్నందువలన, వాటి పరిధి కుంచించుకొని పోవడం వలన వారి అవకాశాలు మరింత తగ్గాయి. అందువలన ఉన్న కొద్దిపాటి అవకాశాలు నిలుపుకునేందుకు తీసుకొనే వారి కార్యాచరణలు ఖచ్చితంగా న్యాయబద్ధమైనవి. కాని ఉన్నత కులాల వారు పైన ఉటంకించిన కారణాల వలన వాటిని వ్యతిరేకిస్తున్నారు. వెనక్కి తిప్పాలని ప్రయత్నిస్తు

న్నారు. ఈ పోరాటం తీవ్రమైనది. ఎందుకంటే ఇది ఒక విషవలయంలో జరుగుతున్నది. ఈ పరిస్థితులలో అణగారిన కులాల డిమాండ్లు సాధించుకొనే అవకాశాలు తగ్గుతాయి. ఒకవేళ ఆ డిమాండ్లు సాధించుకున్నా 'కుల నిర్మూలన' తెరమరుగవుతుంది.

దీనర్థం కార్యక్రమాల ఆచరణలను బలపరచకూడదని కాదు. వాటిని బలపరచడమే తక్షణ కర్తవ్యం. ఎందుకంటే ప్రయివేటు పరం కావడంతో ఇప్పుడున్న కొద్దిపాటి అవకాశాలు మూసుకుపోతున్నాయి. ప్రయివేటు రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించడం తప్పనిసరి. నేను చెప్పదలచుకున్నదేమిటంటే ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ చొప్పించిన ఈ విషవలయం 'కుల నిర్మూలన' అనే ఎజెండానే పూర్తిగా తెరమరుగున పడేస్తుంది. కుల వ్యవస్థను నిర్మూలించడానికి కాకుండా పోరాటాలన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి క్రమంలో సామాజిక విముక్తి కోసం జరిగే ఆర్థిక పోరాటాలకు పరిమితం అవుతాయి. లేదా కుంచించుకుపోతున్న ఉద్యోగావకాశాలు పొందేందుకు ఉధృతంగా పోరాటాలు చేయవలసి ఉంటుంది. కానీ కులవ్యవస్థ నిర్మూలనకు కాదు. మనలాంటి అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ సమాజాలలో అణగారిన తరగతులకు అస్థిత్వ రాజకీయాలు ఎంతో అవసరం. కానీ ఇవి కులవ్యవస్థని అధిగమించే దృక్పధాన్ని కలిగిలేవు.

అందువలన పెట్టుబడిదారీ వ్యవస్థ ఆలస్యంగా వచ్చిన మనలాంటి సమాజాలు రెండు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటాయి. ఒకటి పెట్టుబడిదారీ వ్యవస్థ వలన వచ్చిన ఇబ్బంది. రెండవది ఆలస్యంగా వచ్చినందువలన ఏర్పడ్డ ఇబ్బంది. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రజలను చీలుస్తుంది. వస్తువు సొంతదారులు, సొంతదారులలో శ్రామికశక్తి సొంతదారులు ఉంటారు. వీరు మార్కెట్‌లో ఒకరితో ఒకరు పోటీపడి విభజించబడతారు. అయితే ఈ విభజనను 'కలవడం' ద్వారా శ్రమశక్తి సొంతదారుల మధ్య పోటీని కొంతవరకు తగ్గించవచ్చు, ఆపవచ్చు. ఇది గుత్త పెట్టుబడిదారీ విధానం వలన సాధ్యం. పెట్టుబడిదారీ వ్యవస్థలోనే కాదు అది లేకపోయినప్పటికీ ఇది సాధ్యం. వలసలు సాధ్యం కాకపోవడం వలన కొత్త ప్రదేశాలకు వెళ్ళలేకపోవడం వలన 'శ్రమ మార్కెట్‌లో ఇబ్బందులుండవు. అందువలన ఇక్కడ పెట్టుబడిదారీ వ్యవస్థ చేసే చీలికలు కొనసాగుతుంటాయి. అణచివేయబడ్డ కులాలలోనూ ఇది కనిపిస్తుంది. కులాల విభజన ఏమాత్రం తగ్గనీయదు.

**"విచ్ఛిన్నమౌతున్న ఈ సమాజంలో కుల నిర్మూలన జరగాలంటే పెట్టుబడిదారీ అభివృద్ధి ఆగాలి. దానికి ప్రత్యామ్నాయ సమాజం నిర్మించబడాలి. ఆ ప్రత్యామ్నాయం సోషలిస్టు సమాజమని నేను అనుకుంటున్నాను. ఆ సమాజంలో సమానహక్కులు, రాజకీయంగా ప్రజాస్వామ్యంతో పాటు పనిచేయగలిగిన వారందరికీ ఉపాధి, అందరికి కనీస జీవన వసతులు ఉంటాయి."**



సాఫ్ట్‌వేర్ ఎంప్లాయీస్

ఆధునిక సమాజంవైపు కదలనీయదు.

అంతేకాదు 'పాత సమూహం'లోని తేడాలు తొలగించబడి ఆధునిక సమాజంవైపు నడవకపోవడం అంటే సాంప్రదాయ మూసలో స్తంభించిందని కాదు. కులవ్యవస్థ కొనసాగడాన్ని వ్యతిరేకిస్తూ ఈ రోజు శక్తివంతమైన పోరాటాలు జరుగుతున్నాయి. ఇప్పుడున్న పరిస్థితులలో ఆధునిక సమాజంవైపు మార్పు అంటే సమాజం విచ్ఛిన్నం అవడం, అంతులేని పోరాటాలు, లక్ష్యానికి ఏమాత్రం చేరువలో లేని పోరాటాలు, ఛిద్రమైన సమాజం, తనకు తానే అంతం చేసుకొనే సమాజం.

విచ్ఛిన్నమౌతున్న ఈ సమాజంలో కుల నిర్మూలన జరగాలంటే పెట్టుబడిదారీ అభివృద్ధి ఆగాలి. దానికి ప్రత్యామ్నాయ సమాజం నిర్మించబడాలి. ఆ ప్రత్యామ్నాయం సోషలిస్టు సమాజమని నేను అనుకుంటున్నాను. ఆ సమాజంలో సమానహక్కులు, రాజకీయంగా ప్రజాస్వామ్యంతో పాటు పనిచేయగలిగిన వారందరికీ ఉపాధి, అందరికి కనీస జీవన వసతులు ఉంటాయి. (పెట్టుబడిదారీ విధానంలోలాగా బలవంతంగా పనిచేయించడం కాక ఎక్కువ పనిచేసిన వారికి అదనపు ప్రోత్సాహకాలు ఉంటాయి) దీనికి ప్రపంచీకరణతో సంబంధం లేని, అంతర్జాతీయ విత్త పెట్టుబడి నుండి విముక్తి కావాలి. అలాగే భూపంపకం జరిగి దేశీయ మార్కెట్ అభివృద్ధి చెందాలి. రాజ్యం చిన్న పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. (ముందు ముందు ఇవి సామూహిక ఉత్పత్తి కేంద్రాలుగా అభివృద్ధి చెందవచ్చు) రాజ్యం విద్యపై తగినంత ఖర్చుచేసి నాణ్యమైన విద్య, అందరికీ వైద్యం అందించగలగాలి.

ముందు చెప్పుకున్నట్లు కార్మికులు వలస వెళ్ళే సదుపాయాలు, కలిసి ఉండే అవకాశాలు లేకపోవడం వలన సోషలిజానికి మారేందుకు అవసరమైన మిలిటెంట్ వర్గ చర్యలు నిరోధించబడుతున్నాయి. సమాజం విచ్ఛిన్నం కాకుండా ఉండేందుకు సోషలిజం పరిష్కారంగా చూడడం అసహజంగా అనిపించవచ్చు. ఈ మార్పు కష్టమవుతున్నంత మాత్రాన అసాధ్యమని కాదు. తద్విరుద్ధంగా ఎన్నో మూడవ ప్రపంచ దేశాలలో (గ్రీస్‌లాంటి అభివృద్ధిచెందిన దేశాలతో కూడా) నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయ వ్యవస్థలు, ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో ఉన్న కాలంలో వస్తూనే ఉన్నాయి. దానిని పట్టుకోవ డమే కీలకం.

**"1930 నాటి ఆర్థిక సంక్షోభాన్ని ఎవరూ కోరు కోలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రవృత్తి అది.)దానినుండి బయటపడేందుకు ఎంత ప్రయత్నిస్తున్నా ఇప్పటి సంక్షోభం కొనసాగుతూనే ఉంది) ఈ ప్రవృత్తులలో చొచ్చుకుపోయే మానవ నైజం కూడా మనుషులు దారి తప్పడం వలన కాదు."**



బ్రతుకుతెరువు వెతుక్కుంటు వలస వెళుతున్న ప్రజలు

పైన నేను చెప్పినదంతా సమాజ విశ్లేషణ లోని కులం, వర్గం, విశ్లేషణలతో చర్చించబడి నవే. కులం కన్నా వర్గ పోరాటానికి ప్రాధాన్యత నిచ్చి కుల అణచివేతకు వ్యతిరేకంగా జరగవల సిన పోరాటాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా మలచేస్తున్నట్లు నన్ను నిందించే అవకాశం ఉంది. అందువలన నేను నా పద్ధతికి వివరణను ఇస్తాను.

భారతదేశంలో సామాజిక వర్గీకరణ ఖర్చంతా ఒక ఘనీభవించిన సమాజ చట్రంలో జరిగింది. అంటే ఒక బొమ్మను చూసి అందులో ఒకటి లేదా రెండు భాగాలు ప్రధానంగా గుర్తించబడ్డాయి. (ఆ రెండూ కూడా ఒకదాని కొకటి పోలి ఉంటాయి) ఇది నా ఉద్దేశ్యంలో సరైన విధానం కాదు. మన సమాజంలో ఒకా నొక సమయంలో కుల వర్గ సమూహాలు, ఎన్నో రకాలుగా కలగలిసిన కుల, వర్గ సంబంధాలు కలిగిన సమాజం ఉండేది. ఈ మొత్తంలో ఏ బంధం ముఖ్యమైనది అన్నది ముఖ్యం కాదిక్కడ. ఈ మొత్తం ఎటువైపు పయనిస్తున్నది, దాన్ని కదిలించే దిశా నిర్దేశం చేసే శక్తులేమిటన్నది ముఖ్యం. పెట్టుబడిదారీ వ్యవస్థే ముఖ్యమైన దిశా నిర్దేశం చేసే చోదక శక్తి అని నేను భావిస్తున్నాను.

నా వాదన సామాజిక విశ్లేషణతో వర్గం, కులం కన్నా ప్రధానమైనదా, లేదా కులమే వర్గం కన్నా ప్రధానమైనదా అన్నది కాదు; పెట్టుబడిదారీ వ్యవస్థే ఈనాడు కుల, వర్గ కలయికల చోదక శక్తి అని నొక్కి చెప్తున్నాయి. అందుకు కారణం పెట్టుబడిదారీ వ్యవస్థ యాదృచ్ఛిక విధానమని నేను నొక్కి చెప్పడమే. అంటే అది స్వతంత్ర, స్వయం చోదక వ్యవస్థ, కొన్ని ప్రవృత్తులు గలది. అంతేకాని రాజ్యాన్ని తనకిష్టమైనట్లు మలచగల సత్తా ఉన్నది కాదు, బాహ్య జోక్యంతో మార్చగలిగింది కాదు.

మానవ ఇచ్ఛకు, చైతన్యానికి భిన్నమైన 1930 నాటి ఆర్థిక సంక్షోభాన్ని ఎవరూ కోరుకోలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రవృత్తి అది) దానినుండి బయటపడేందుకు ఎంత ప్రయత్నిస్తున్నా ఇప్పటి సంక్షోభం కొనసాగుతూనే ఉంది) ఈ ప్రవృత్తులలో చొచ్చుకుపోయే మానవ నైజం కూడా మనుషులు దారి తప్పడం వలన కాదు. వారు అలా చేయడానికి కారణం ఆ విధంగా చేయనట్లయితే ఈ ఆర్థిక వ్యవస్థలో వారు తమ స్థానాన్ని కోల్పోతారు. పెట్టుబడిదారు లైనా పెట్టుబడులు పోగుచేసుకోకుంటే ఈ వ్యవస్థ లో వారు తమ స్థానాన్ని కోల్పోతారు. పోటీ వారిని పక్కకు నెట్టేస్తుంది. పెట్టుబడిదా రులు కూడా పెట్టుబడిదారీ వ్యవస్థలో పరాధీనులే.

**అనువాదం: కె ఉషారాణి**

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,ప్రజాశక్తిప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# జమిలి ఎన్నికలు దేశ సమాఖ్య వ్యవస్థకు విరుద్ధం

**సత్తారు భాస్కరరావు**

స్వతంత్ర్య భారతదేశ సమాఖ్య రాజ్యాంగ వ్యవస్థ మౌలిక లక్ష్యాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను ఛిద్రం చేసేందుకు బిజెపి ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసింది. నియంతృత్వ పోకడలతో అధ్యక్షతరహా పాలన సాగించాలన్నది బిజెపి మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతం. లోపభూయిష్టమైన ఎన్నికల విభాగాన్ని అడ్డంపెట్టుకుని దేశమంతటా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని ప్రయత్నిస్తోంది. 36 శాతం ఓట్లతో బిజెపి పార్లమెంటులో మెజార్టీ స్థానాలను పొందగలిగింది. అందివచ్చిన అవకాశంతో ఆర్ఎస్ఎస్ కాషాయీకరణ సిద్ధాంతాన్ని అమలు చేయచూస్తున్నది. దేశమంతటా ఒకేసారి పార్లమెంటుకు, 29 రాష్ట్రాలకు. కేంద్ర పాలిత ప్రాంతాలకు ఎన్నికలు నిర్వహించే లక్ష్యంతో బిజెపి అడుగులు వేస్తోంది. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లోనే జమిలి ఎన్నికలపై చర్చించాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయత్నించింది. ఆ నిజాన్ని కాన్పూర్ ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోడీ వెల్లడించారు. పార్లమెంటు సమావేశాలకు ముందు ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో జమిలి ఎన్నికలపై చర్చించాలని తాను సూచించినా ప్రతిపక్షాలు ఆసక్తి చూపలేదని నరేంద్ర మోడీ తెలిపారు. అంతకుమించి ముందుకొచ్చిన ప్రజాసమస్యలపై ప్రధాన మంత్రి నిర్లక్ష్య ధోరణి స్పష్టమవుతోంది. అయినా బిజెపి తన ప్రయత్నాలను ఆపలేదు. జమిలి ఎన్నికలపై ప్రజాస్వామ్య ముసుగు తొడిగింది. కేంద్ర ప్రభుత్వం స్థితి అధ్యయన పత్రాన్ని అంశాల ప్రశ్నలతో విడుదల చేసింది. ఆ పత్రాన్ని ప్రభుత్వ ఆన్‌లైన్ వేదిక మైగజైన్ లో ఉంచి అభిప్రాయాలను, సూచనలను ఆహ్వానిస్తోంది. జమిలి ఎన్నికలు వాంఛనీయమేనా? లాభమా? నష్టమా? అని ప్రశ్నించడంతో ప్రభుత్వ అభిప్రాయాన్ని కూడా ఆ పత్రంలో వెల్లడించింది. ప్రజాభిప్రాయసేకరణలో ప్రశ్నలుండాలి తప్ప, ప్రభుత్వ సమాధానాలకు చోటు ఉండరాదు. అందుకు భిన్నంగా పత్రం విడుదలైంది. జమిలి ఎన్నికల వల్ల ఓటర్లలో ఉత్సాహం కొనసాగుతుందని అభిప్రాయాలను కోరిన పత్రంలో ముందే వెల్లడించింది. ఆర్థికపరంగా భారం తగ్గుతుందని, పాలనా పరంగా యంత్రాంగంపై ఒత్తిడి తగ్గుతుందని ఆ పత్రంలో చెప్పుకొచ్చింది. 2015 డిసెంబరులో పార్లమెంటులో స్థాయీ సంఘం ఇచ్చిన నివేదికలో జమిలి ఎన్నికలకు వెళ్తే నిర్మాణాత్మకమైన మార్పులు అవసరమని స్పష్టం చేసింది. అంటే మౌలికంగా రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. రాజ్యాంగంలోని 83, 172, 85, 174 అధికరణలకు సవరణలను తీసుకురావాల్సి ఉంటుంది. వాటితో ఫెడరల్ రాజ్యాంగ స్వరూపంలోనే పెనుమార్పులకు దారితీస్తుంది. వస్తుసేవల పన్ను ద్వారా ఇప్పటికే రాష్ట్రాల ఆర్థిక హక్కులను కేంద్ర ప్రభుత్వం తన గుప్పిట్లో పెట్టుకోనుంది. జమిలి ఎన్నికల రూపంలో రాష్ట్రాల ప్రజాస్వామ్య హక్కులను కేంద్రం చేతిలో పెట్టినట్లు అవుతుంది. జమిలి ఎన్నికలపై ఉత్సాహం చూపుతున్న బిజెపి ప్రభుత్వం ప్రణాళికా సంఘం స్థానంలో కాషాయముద్రతో వచ్చిన నీతి ఆయోగ్‌ను మరొక సాధనంగా వాడుకోవడానికి సిద్ధమైంది. తలచుకుంటే 2019లోనే జమిలి ఎన్నికలు సాధ్యమని నీతి ఆయోగ్ తన నివేదికలో పేర్కొంది. 2019లో జరగనున్న 17వ లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల శాసనసభ ఎన్నికలూ ఒకేసారి నిర్వహించవచ్చని తన నివేదికలో పేర్కొంది. అందుకోసం శాసనసభల కాలపరిమితి కుదించడం లేదా పొడిగించడం చేయాలని నీతి ఆయోగ్ పేర్కొంది. ఈ ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమైంది. రాష్ట్రాల హక్కులను హరించడమే అవుతుంది. అందువల్లే ఈ ప్రతిపాదన అమలు చేయడం కష్టమని ఆ నివేదికలోనే అభిప్రాయం వ్యక్తం చేయడం ప్రజావంచన అవుతుంది. అమలుకు సాధ్యం కాని ప్రతిపాదన ఎందుకు చేయడం? ఇంతకు ముందు పార్లమెంటే... స్థాయీ సంఘం చేసిన రెండు దశల ఎన్నికల పద్ధతే మేలని ప్రత్యామ్నాయం చూపింది. ఇది మరో ప్రమాదకర ప్రతిపాదన. తొలిదశను 2019 లోక్‌సభ ఎన్నికలతో పాటు సూచించింది. అప్పటికి రాష్ట్రాలకున్న కాలపరిమితి ఏడాది పాటు పొడిగించడం, కుదించడం చేయాలని సూచించింది. అలా చేస్తే నాలుగు రాష్ట్రాల శాసనసభలు ఐదు నుంచి ఎనిమిది నెలల్లో ముగించాల్సి వస్తుంది. మరో ఐదు శాసన సభల కాలపరిమితి ఐదు నెలల నుంచి ఏడాది పాటు పొడిగించాల్సి వస్తుంది. 2019లో 17వ లోక్‌సభ ఏర్పడిన రెండున్నరేళ్ల తర్వాత మిగిలిన రాష్ట్రాలకు రెండున్నరేళ్ల కాల పరిమితి విధిస్తూ ఎన్నికలు నిర్వహించాలని నీతి ఆయోగ్ సూచించింది. దానివల్ల ఏడు శాసనసభల కాలపరిమితి ఆరు నెలల నుంచి 13 నెలల పొడిగించాల్సి ఉంటుంది. మరో తొమ్మిది శాసనసభల కాలపరిమితిని ఐదు నుంచి 15 నెలలు తగ్గించాల్సి వస్తుంది. అలా చేస్తేనే 2024 నాటికి పార్లమెంటుకు శాసనసభలకు దేశమంతటా ఒకేసారి ఎన్నికలు నిర్వహణ సాధ్యమవుతుందని నీతి ఆయోగ్ నివేదికలో పేర్కొంది. పార్టీలతో పాటు వ్యక్తులకు ప్రాధాన్యత ఇచ్చేలా నిర్ణయాలు తీసుకోవచ్చునని సూచించింది. ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించే విధానం రాజ్యాంగ సవరణలతో అమల్లోకి వచ్చినా పూర్తి కాలం ప్రభుత్వాలు నడిచేందుకు ఎలాంటి గ్యారంటీ లేదన్నది సుస్పష్టం. అందుకు నీతి ఆయోగ్ సరికొత్త సూచనలు చేయడం విచిత్రంగా ఉంది.

పార్లమెంటులోగానీ, శాసనసభల్లోగానీ అవిశ్వాస తీర్మానాలకు ప్రభుత్వాలు పడిపోయినప్పుడు సరికొత్త తీర్మానాన్ని సూచించింది. అవిశ్వాస తీర్మానానికి అనుబంధంగా పలానా వ్యక్తి ప్రధాన మంత్రి, లేక ముఖ్యమంత్రి నాయకత్వంలో ఏర్పడబోయే ప్రభుత్వానికి తాము విశ్వాసం ప్రకటిస్తున్నాం అన్న తీర్మానం కూడా ప్రవేశపెట్టి రెండింటిపైన ఒకేసారి ఓటింగ్ నిర్వహించాలని నీతి ఆయోగ్ సూచించింది. అయినప్పటికీ ప్రభుత్వాలు నిలబడతాయన్న గ్యారంటీ లేదు. నీతి ఆయోగ్ రూపంలో బిజెపి అసలు స్వరూపం ఇక్కడ బయటపడింది. లోక్‌సభలో ప్రభుత్వం పడిపోయి, మిగిలిన కాలపరిమితి తక్కువ అయితే (నిర్దిష్టంగా చూపలేదు) రాష్ట్రపతి తాను నియమించిన మంత్రివర్గం సూచనలు, సలహాలతో దేశపాలనా పగ్గాలు చేపట్టవచ్చు. రాష్ట్రపతి నియమించిన మంత్రివర్గం ఆయన ఆలోచనలకు అనుగుణంగానే పని చేస్తుంది. రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించినట్లే కేంద్రంలోనూ రాష్ట్రపతి రూపంలో అధ్యక్ష తరహా పాలనకు సిఫార్సు చేసినట్లయింది. పార్లమెంట్‌కు జవాబుదారీగా ఉండాల్సిన మంత్రివర్గం

> **“ఎన్నికల విధానంలో మౌలిక మార్పులు రావాలి తప్ప, ఎన్నికల నిర్వహణను అడ్డుకోవడం భారతదేశ సమాఖ్య వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి పునాదులు వేసినట్లు అవుతుంది. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో సాగిన మూకుమ్మడి ఫిరాయింపుల అనైతిక రాజకీయాలు గురించి నీతి ఆయోగ్ ఉద్దేశపూర్వకం గానే విస్మరించింది.”**

దేశాధ్యక్షుడు నిర్ణయాలకనుగుణంగా పని చేయాల్సి ఉంటుంది. అది నియంతృత్వానికి దారి తీస్తుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన ఎమర్జెన్సీ చీకటి రోజులను అనుభవించిన భారత ప్రజలు ఏ రూపంలోనూ కోరుకోవడం లేదు.

ఎన్నికల విధానంలో మౌలిక మార్పులు రావాలి తప్ప, ఎన్నికల నిర్వహణను అడ్డుకోవడం భారతదేశ సమాఖ్య వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి పునాదులు వేసినట్లు అవుతుంది. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో సాగిన మూకుమ్మడి ఫిరాయింపుల అనైతిక రాజకీయాలు గురించి నీతి ఆయోగ్ ఉద్దేశపూర్వకం గానే విస్మరించింది. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే దేశంలో ఏటా సాగుతున్న వ్యయ ప్రయాసలు తప్పడంతో ప్రభుత్వాల స్థిరపాలన ఉంటుందని బిజెపి చెప్తోంది. ప్రజావ్యతిరేక నిరంకుశ ప్రభుత్వాలను కాల పరిమితికి ముందే దించే అధికారం ప్రజలకు ఉండాలని ప్రజాస్వామ్య వాదులు డిమాండ్ చేస్తున్న తరుణంలో స్థిరమైన ప్రభుత్వాల గురించి బిజెపి మాట్లాడుతోంది. రాజకీయ పక్షాలతో సంప్రదించి ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే విధానాన్ని రూపొందిస్తామని 2014 ఎన్నికల ప్రణాళికలో బిజెపి వెల్లడించింది. ఆ విధానం కష్టతరమైనప్పటికే అసాధ్యమేమీ కాదని డాక్టర్ సుదర్శన్ బియప్పన్ ఆధ్వర్యంలోని పార్లమెంటరీ స్థాయీ సంఘం గత ఏడాది డిసెంబరులో నివేదికను వెల్లడించి చర్చకు తెరలేపింది. దేశ వ్యాపితంగా కుల, మత, వేర్పాటువాద ఉద్యమాలు పడుతూ, లేస్తున్న తరుణంలో ఒకే దఫా ఎన్నికల ప్రతిపాదన వెనక్కి తీసుకోవడం తప్ప అమలు అసాధ్యం. దేశ రాజకీయ ముఖ చిత్రం అందుకు అద్దం పడుతున్నది. స్వాతంత్ర్యం అనంతరం మొదటి సార్వత్రిక ఎన్నికల నుంచి 1967 నేటి వరకూ నాలుగు సార్వత్రిక ఎన్నికలు దేశ వ్యాపితంగా ఏకకాలంలో జరిగాయి. ఐదో లోక్‌సభ ఎన్నికల నుంచి ప్రభుత్వాలు గాడి తప్పాయి. అధికార దాహం, అనైతిక రాజకీయాలతో 1975 ఎమర్జెన్సీ విధింపుతో ఎన్నికల నిర్వహణకు ఏడాది కాలం బ్రేక్ పడింది. అదే కాలంలో పలు రాష్ట్ర ప్రభుత్వాలు అర్ధాంతరంగా కూలిపోయే పరిస్థితి వచ్చింది. అప్పటి నుంచి పట్టాలెక్కే పరిస్థితి రాకుండా పోయింది. మరోవైపు కేంద్రం చేతిలో ఉన్న 356 అధికరణ దుర్వినియోగం 1967 కేరళలో నంబూద్రిపాద్ నాయకత్వంలో ఉన్న కమ్యూనిస్టు ప్రభుత్వంతో మొదలైంది. ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను అర్ధాంతరం గా కూల్చివేయడం నేటికీ కొనసాగుతోంది. గతంలో ఎన్‌టిఆర్ ప్రభుత్వాన్ని కూల్చివేసే ఘటనను ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరు. ఏకకాలంలో ఎన్నికల గురించి నివేదిక నిచ్చిన నీతి ఆయోగ్ 356 అధికరణ ప్రస్తావన తీసుకురావడం వింతకాదు. అవసరమైనప్పుడు రాజకీయంగా విభేదించే రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేసే అధికారం కేంద్రం గుప్పెట్లోనే ఉండాలని చెప్పినట్లయింది. ఏకకాలంలో ఎన్నికల ప్రతిపాదనను ఎన్నికల సంఘం 1983లో ముందుకు తీసుకొచ్చింది. తిరిగి 1999లో జస్టిస్ జీవనరెడ్డి సారధ్యంలోని న్యాయ సంఘం సూచించింది. 1985 నాటి పార్టీ ఫిరాయింపుల నిషేధ చట్టానికి సవరణలు తీసుకొచ్చినా అవి నిష్ప్రయోజనమైందని తాజా అనుభవాలు మరింత బలాన్ని ఇస్తున్నాయి. లోపభూయిష్టమైన పార్టీ ఫిరాయింపుల చట్టం అమలు బాధ్యతను స్పీకర్లపై పెట్టబడింది. అందుకు నిర్దిష్ట కాల పరిమితి విధించలేదు. సాధారణంగా అధికార పక్షం నుంచి ఎన్నికైన వారే స్పీకర్లు అవుతారు. నీతి బాహ్యమైన ఫిరాయింపుల ప్రక్రియ కూడా సాధారణంగా అధికార పక్షం నుంచే మొదలవుతుంది. అధికార పక్షంలో కుమ్ములాటలు ప్రతిపక్షానికి అవకాశమిస్తుంది. దేశంలో జరుగుతున్న పరిణామాలతో ప్రజల్లో స్పీకర్ల వ్యవస్థపైనా గౌరవం తగ్గిపోతోంది. ఎన్నికైన ప్రభుత్వాలు అర్ధాంతరంగా కూలిపోవడమే అందుకు కారణం. చట్టసభల్లో ప్రజాప్రతినిధులు కొందరు పాల్పడుతున్న అప్రజాస్వామ్య, నీతి బాహ్యమైన చర్యలను చట్టరూపంలో అరికట్టే చర్యలేకుండా ఏకకాల ఎన్నికల ప్రతిపాదన ఎవరి ప్రయోజ నాల కోసం? 29 రాష్ట్రాల్లో పలు భాషలు, జాతులతో కూడిన భారతదేశంలో ఏకకాలంలో ఎన్నికలు జరిపించాలనుకోవడం అర్థరహితం. గుర్తింపు పొందుతున్న జాతీయ పార్టీల్లోనే ఎదుగుదల, తరుగుదల ఉంటోంది. అలాంటిది దేశంలో 56 ప్రాంతీయ పార్టీలు, 1800 వరకూ ఉన్న ఆమోదం పొందే పార్టీలున్న దేశంలో ఏకకాలంలో ఎన్నికల ఆలోచన అనర్థదాయకం. అధికారంలోకి వచ్చిన బిజెపి కూడా దేశవ్యాప్త పార్టీగాలేని పరిస్థితిని చూస్తున్నాం. శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు బూర్జువా రాజకీయాల్లో ఉండవన్నది నానుడి. అందువల్ల ఎవరు ఎప్పుడు కలుస్తారో, విడిపోతారో తెలియని పరిస్థితి ఉంది. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించినా ప్రభుత్వాలు కాల పరిమితి వరకూ నిలువలేని పరిస్థితిని చూస్తున్నాం. ఏకకాలంలో జరిగే ఎన్నికల వల్ల వచ్చే లాభాల కంటే నష్టాలు ఎక్కువ. ప్రభుత్వాల కూల్చివేతలో ఫిరాయింపుల పర్వం ప్రోత్సహించడంలో ధన ప్రభావం ఎక్కువైంది.

ఏకకాలంలో ఎన్నికల వైపు బిజెపిని నడవనిస్తే దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది. అవినీతి రహిత నినాదం ముసుగులో అవినీతి అక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చుతున్న చరిత్రను చూస్తున్నాం. నియంతృత్వ చర్యలకు అడ్డుకట్ట పడాలి. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలకు ప్రజాహితంగా పాలించేందుకు సంపూర్ణ అవకాశం ఇవ్వాలి. ప్రజాహితాన్ని, ఎన్నికల హామీలను గాలికొదిలేసి, నియంతృత్వ పోకడలతో పాలన సాగించే ప్రభుత్వాలను వెనక్కి రప్పించే అధికారం ప్రజలకుండాలి. రాష్ట్రాల హక్కులను హరించే జమిలి ఎన్నికల ప్రతిపాదనను ప్రజలు తిరస్కరించాలి. ఎన్నికల విధానంలో ప్రజాస్వామ్యం వికసించేలా సంస్కరణలు రావాలి. మెజారిటీ ప్రజల తీర్పులకు అనుగుణంగా ప్రభుత్వాలు ఏర్పడాలి. మౌలిక మార్పులు తీసుకురావాలన్న లక్ష్యంతో విస్తృత స్థాయిలో చర్చకు వేదికలను ఏర్పాటు చేయాలి. ఇప్పటికే ప్రజాస్వామ్యవాదుల అజెండాగా ఉన్న దామాషా పద్ధతిలో ఎన్నికల నిర్వహణకు సిద్ధమవ్వడం తొలిమెట్టు కావాలి. అప్పుడే స్వతంత్ర భారతదేశం, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా విరాజిల్లేందుకు మార్గం సుగమం అవుతుంది.

**–సీనియర్ పాత్రికేయులు**

# వ్యక్తిగత లాభాపేక్ష పెరగటమే సోవియట్ పతనానికి కారణం

సందేహాలు సమాధానాలు



- బి.వి.రాఘవులు

**స్టాలిన్ మరణం తరువాత రష్యాలో పార్టీలోకి సభ్యులను తీసుకొనుటలో మార్పులు జరిగి పెట్టుబడిదారులు, అత్యున్నత అధికా రులు పార్టీ సభ్యులై, నాయకత్వ స్థానాలకు ఎదిగారు. వారి నాయకత్వంలో పార్టీని సైద్ధాంతికంగా, రాజకీయంగా బలహీనపరచి రాత్రికిరాత్రి సోషలిస్టు వ్యవస్థను కూలదోశారు.**

**ఇప్పుడు చైనాలో కూడా పెట్టుబడిదారు లకు సభ్యత్వాలు ఇచ్చి, వారిని పార్టీలో ఉన్నత స్థానాలకు తీసుకుంటున్నారని పత్రికలలో చదివినాను. ఈ పరిణామాలలో చైనా పరిస్థితి ఎలా ఉండబోతుందో వివరించండి.**

**– టి. వెంకటరామిరెడ్డి, గూడూరు**

సోవియట్ యూనియన్‌లో సోషలిజం రాత్రికి రాత్రే మాయమైందనీ, కమ్యూనిస్టు పార్టీలో పెట్టుబడిదారులు, ఉన్నతాధికారులు చేరి దానిని రాజకీయంగా, సైద్ధాంతికంగా బలహీనపరిచినందునే సోషలిస్టు వ్యవస్థ కూలిపోయిందని మీరు భావిస్తున్నట్టు ఈ ప్రశ్న ద్వారా అనిపిస్తున్నది. సోషలిస్టు వ్యవస్థ దెబ్బతినడంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో వచ్చిన వికృత మార్పులు ఒక ముఖ్య కారణమైనా అదే అసలు కారణం కాదు. వాస్తవంగా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో వికృత మార్పులు రావడానికి కూడా ఆనాటి సోవియట్ వ్యవస్థలో వచ్చిన కొన్ని అవాంఛనీయ ధోరణుల పాత్రను గుర్తించాల్సి ఉంది. స్టాలిన్ మరణం తర్వాత సమాజపరమైన ఉత్పత్తి వనరులను ప్రైవేటు శక్తులకు అప్పగించే ధోరణులు క్రమక్రమేణా పెరిగాయి. సోషలిస్టు వ్యవస్థను క్రమేణా పటిష్టం చేసుకోవడానికి రాజకీయ చైతన్యం పెంచాల్సిన తరుణంలో కార్మికవర్గంలో, కష్టజీవుల్లో ప్రోత్సాహకాల పేరుతో వ్యక్తిగత లాభాపేక్షను సోవియట్ యూనియన్‌ను పరిపాలిస్తున్న కమ్యూనిస్టు పార్టీ పెంచింది. ఒక నూతన మానవుణ్ని సృష్టించటం స్థానంలో వ్యక్తిగత ప్రయోజనాన్ని బట్టి ఆలోచించే ప్రజా సమూహాలను స్టాలిన్ అనంతర సోవియట్ నాయకత్వ విధానాలు ప్రోత్సహించాయి. ఉత్పత్తి నిర్వహణలో, పరిపాలనలో, సామాజిక కార్యకలాపాలలో ప్రజల భాగస్వామ్యాన్ని, యాజమాన్యాన్ని విస్తృతపరిచే, లోతుపరిచే సోషలిస్టు ప్రజాస్వామ్యాన్ని అభివృద్ధి చేయడానికి బదులు నిరంకుశాధికార బృంద పరిపాలన పటిష్టం చేయబడింది. ప్రారంభంలో ఉన్న ప్రజా సోవియట్ల వ్యవస్థ బలహీనం చేయబడింది. సోషలిస్టు సమాజానికి సంబంధించిన చైతన్యం కోల్పోయిన జన సమూహం అకస్మాత్తుగా కమ్యూనిస్టు పార్టీని రద్దు చేసినప్పుడు గానీ, సోవియట్ యూనియన్‌ను విచ్ఛిన్నం చేసినప్పుడు గానీ సోషలిస్టు వ్యవస్థకు వ్యతిరేకమైన ఎల్ట్సిన్‌ను గెలిపించినప్పుడు గానీ స్పందించి, సోషలిస్టు వ్యవస్థను రక్షించుకోటానికి పూనుకోలేక పోయారు. సోవియట్ వ్యవస్థలో క్రమేణా పట్టు బిగిస్తూ సమాజాన్ని నడిపించే విధానంగా లాభాపేక్ష మారుతూ రావడాన్ని కమ్యూనిస్టు పార్టీ అనుమతించింది. దాని ఫలితమే సోషలిస్టు వ్యవస్థ పతనం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కోల్డ్ వార్ కాలంలో భౌతిక శక్తులను అభివృద్ధి చేయడంలో సోవియట్ యూనియన్ సాధించిన అఖండ విజయాలను చూసుకుని, సామ్రాజ్యవాదం మళ్ళీ దుందుడుకుగా వ్యవహరించకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించడాన్ని దాని బలహీనతగా అంచనా వేసి, సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ప్రపంచ బలాబలాల పొరపాటు అంచనాలతో సామ్రాజ్యవాద కుట్రలను తగినంతగా పసిగట్టలేక పోయింది. దాని పర్యవసానమే చాపక్రింద నీరులా సోషలిస్టు వ్యవస్థను భగ్నం చేసే సామ్రాజ్యవాదుల ప్రయత్నాలను తిప్పికొట్టడానికి అవసరమైన కౌంటర్ చర్యలను తీసుకోలేక పోయింది. ఈ బాహ్య, అంతర్గత కారణాల పర్యవసానంగానే సోవియట్ యూనియన్‌లో సోషలిజం కుప్పకూలిపోయింది.

చైనాలో ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు సోవియట్ యూనియన్‌లో జరిగిన పరిణామాల లాగానే ఉన్నాయని చెప్పలేము. కొన్ని పోలికలున్నాయి. చైనాలో సైతం ప్రైవేటు రంగం పెరిగింది. లాభాపేక్ష ఆర్థిక వ్యవస్థను నడిపే సాధనంగా వినియోగించబడుతుంది. వీటి పర్యవసానంగా అనేక దుష్పరిణామాలు కూడా చైనా వ్యవస్థలో కలుగుతున్నాయి. సమాజంలో జరుగుతున్న పరిణామాలకు కమ్యూనిస్టు పార్టీ అతీతంగా ఉండలేదనే విషయం చైనా కమ్యూనిస్టు పార్టీలో పరిణామాలు కూడా మనకు స్పష్టం చేస్తున్నాయి. చైనా కమ్యూనిస్టు పార్టీలో ప్రవేశించిన అవినీతిని, ఆర్భాటాలను, దుబారాలను నిర్మూలించటానికి ఈ మధ్య కాలంలో పార్టీ తీసుకుంటున్న చర్యలను చూస్తే మనకు ఈ విషయం స్పష్టమవుతుంది. కమ్యూనిస్టు పార్టీని ప్రక్షాళన చేసుకునేందుకు, పదును పెట్టుకునేందుకు ఆ పార్టీ చేస్తున్న ప్రయత్నాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ప్రయత్నం ఇలాగే కొనసాగితే సమాజంలో ఉత్పన్నమవుతున్న ప్రతీక శక్తులను నియంత్రించడంలో ప్రభుత్వరంగాన్ని, సోషలిస్టు విధానాలను రక్షించుకోవడంలో కమ్యూనిస్టు పార్టీ విజయం సాధిస్తుంది. ఈ సంఘర్షణ చైనా సమాజంలో, పార్టీలో జరుగుతున్నంత కాలం అక్కడ సోషలిస్టు వ్యవస్థకు ప్రమాదం రాదు. ఏ మాత్రం సడలింపు వచ్చినా హానికరమైన పరిణామాలు సంభవించవని చెప్పలేము. ఇప్పటివరకూ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లుగానే భవిష్యత్తులోనూ చైనా కమ్యూనిస్టు పార్టీ అప్రమత్తంగానే వ్యవహరిస్తుందని ఆశిస్తున్నాము.

# ఒక దళిత యోధుని సమరగాథ

(2వపేజీ తరువాయి)

కదులుతున్న తమ పునాదులను కాపాడుకోవడానికి అగ్రవర్ణాల వారు దళితుల మీద భౌతిక దాడులకు దిగేవారు. రక్షించుకోవడానికి దళితులు కూడా చిన్న చిన్న పోరాట బృందాలుగా ఏర్పడేవారు.

**రాజదర్శనం**

అప్పటికాలంలో మహారాజు అంటే కనిపించే దేవుడు. కనుక ఆయనను దళితులు చూడకూడదు. ఈ పరిస్థితి మారాలని అయ్యంకాళి నిర్ణయించారు. మహారాజా వారి దర్శనానికి దొరికే దారులు తెరచి లేవు. ఇంకేం చేయాలి. అప్పుడు ఒక ఉపాయం ఆలోచించారు. మహారాజా వారు సంవత్సరపు పూజా దినాన దళితులు ఆయన ఒక పెద్ద చిత్రపటాన్ని ఊరేగిస్తూ బయల్దేరారు. మహారాజు చిత్రపటాలను ఊరేగింపులోంచి తొలగించటానికి శిక్షలకు భయపడి ఎవరికి ధైర్యం చాలలేదు. చివరికి మహారాజును చూశారు. అప్పటిదాకా తాను చూడని ఈ దళిత సమూహాన్ని చూసి మహారాజు ఆశ్చర్యపోయారు. దళితులు రెండు ధిక్కారాలకు పాల్పడ్డారు. ఒకటి రహదారుల మీద నడవటం, రెండు మహారాజు గారిని చూడటం. అగ్రవర్ణాల వారికి కోపం వచ్చింది. ప్రతీకారం తలపెట్టారు. మానక్కాడులో దళితులపై దాడి చేశారు. దీనిని ముందుగానే ఊహించిన అయ్యంకాళి యుద్ధంలో ఒక జనరల్ మాదిరి తన దళితసేనను సముద్రతీరం నుంచి విలియాం గుండా వెంగనూరుకు క్షేమంగా తరలించాడు. ధైర్యసాహసాలు కలవాడిగా ఆజ్ఞాపించే శక్తి కలవాడిగా అయ్యంకాళి ఒక్క తన కులానికి సంబంధించిన నాయకుడిగానే కాకుండా సాధుజన పరిపాలనా సంఘానికి నాయకుడయ్యాడు.

**కేరళలో మొదటి కూలీల సమ్మె**

సాధుజన పరిపాలనా సంఘం చేసిన అనేక పోరాటాల ఫలితంగా దళిత పిల్లల్ని బడిలో చేర్చుకోవాలని1907లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి రాజాగారి దివాను రాజాగోపాలాచారి దళితులకు మద్దతుగా ఉండేవారు. అయితే పై నుండే అగ్రకుల అధికారులు ఈ ఉత్తర్వులను బయటికి రాకుండా చూసేవారు. అయితే అయ్యంకాళి ఎలాగోలాగా ఒక ఉత్తర్వును సంపాదించి విద్యాశాఖాధికారులను ఈ ఉత్తర్వులు అమలు పరచమని కోరారు. కానీ భూస్వాముల ఆధీనంలో ఉన్న పాఠశాలలు ఈ ఉత్తర్వును పాటించ నిరాకరించాయి. అప్పుడు అయ్యంకాళి "మీరు మా పిల్లలను చదివనివ్వకపోతే మీ పొలాల్లో పిచ్చిగడ్డి మొలుస్తుంది, మీ పొలాలు బీళ్ళు పడతాయి" అని సమ్మెకు పిలుపిచ్చాడు. పొలాల్లో పనిచేసే కూలీలను పర్మినెంటు చెయ్యాలని, పనుల్లేని దినాలకు వారికి జీతం ఇవ్వాలని, మా పిల్లలకు బడికెళ్ళే హక్కు కల్పించాలని తదితర డిమాండ్లతో సమ్మె ప్రారంభమైంది. భూస్వాములు సహజంగానే ఈ డిమాండ్లకు అంగీకరించలేదు. ప్రపంచలోనే మొట్టమొదటిసారి జరిగిన వ్యవసాయ కూలీల సమ్మె ఇది. కానీ, ఇక్కడ ఊరేగింపులు లేవు. సైరను మోగిస్తూ తిరిగే జీపుల్లేవు, కరపత్రాలు లేవు, బ్యానర్లు లేవు. కానీ, ఒక అయ్యంకాళి మాటపై కండలా, కన్నీయాపురం, పల్లీచెల్, ముదువుప్పార నుంచి విలియం దాకా పొలాల్లో ఒక్క కూలీ కనపడలేదు, పీచుమని పిట్ట లేదు. సమ్మెగట్టిన కూలీలను చూసి భూస్వాములు నవ్వుకున్నారు. కడుపు కాలితే వాళ్ళే వస్తారు అని ఎగతాళి చేశారు. అనంతమైన ఆకలి కూలీలను నిర్వీర్యం చేసింది. ఇలాంటి సమయంలో అయ్యంకాళి ఒక ఎత్తుగడ వేసి విలియంలోని మత్స్యకారులతో కలిసి ఒక ఒప్పందానికి వచ్చాడు. కూలీల కుటుంబాల నుంచి ఒక్కొక్కరిని చేపల పడవ మీద పనికి తీసుకెళ్ళేటట్లు, చేపల్లో కొంత వాటా ఇచ్చేటట్లు వాళ్ళతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. సమ్మె పూర్తయ్యేవరకు ఇది కొనసాగింది. భూస్వాములు కూలీల చేతుల్లో ఓడిపోవటం అనివార్యం అయ్యింది. కూలీల వేతనాలు పెంచటానికి, స్వేచ్ఛగా ప్రయాణించే హక్కు, పిల్లలను బడిలో చేర్చుకునే హక్కును సూత్రప్రాయంగా అంగీకరించారు. ఇది జరిగిన తరువాత అయ్యంకాళి భూస్వాముల ఏకైక శత్రువు. ఆయనను చంపటానికి ముంబాయి మాఫియా తరహాలో అయ్యంకాళిని ప్రాణంతో పట్టి తెచ్చినవారికి రూ॥2000లు, చంపి తెచ్చిన వారికి రూ॥1000లు వెల కట్టారు. ఫలితంగా చాలా నెత్తురు పారింది. కానీ అయ్యంకాళి చెక్కు చెదరకుండా నిటారుగా నిలబడ్డారు.

**ప్రజాసభ సభ్యులు**

మహారాజావారి ప్రజాసభలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రాతినిధ్యం ఉండేది. ప్రజాసమస్యల ఫిర్యాదులను రాజుగారి దృష్టికి తెచ్చేందుకు ఈ సభ ఉపయోగపడేది. కానీ జనాభాలో 5 లక్షల మందిగా ఉన్న పులయాలకు మాత్రం సవర్ణుడైన పి.కె గోవిందు పిళ్లే ప్రాతినిధ్యం వహించారు. మానవతావాది అయిన పిళ్లే 1911 ఫిబ్రవరి 18న సభలో మాట్లాడుతూ కనీసమైన మానవహక్కులు, స్వేచ్ఛ కూడా దళితులకు ఇవ్వటం లేదు. ఫలానా చోట ప్రభుత్వ భూమి ఉంది, మేం ఆ భూమిలో పండించుకుంటాం అని కోరినప్పుడల్లా అగ్రవర్ణాల వారు అడ్డుకుంటున్నారు. వారికి చదువుకునే హక్కు లేదు, ప్రభుత్వం వారికి భూమిని, చదువుకునే హక్కుని కల్పిస్తే ఈ అభాగ్యులకు ఏ సహాయం అక్కర్లేదు అని గోవిందుపిళ్లే అన్నారు. ప్రజాసంఘ సభ్యుడిగా అయ్యంకాళిని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన విని సభలో వారు దిగ్భ్రాంతి చెంది ఒక అంటరాని వాడు ఈ గౌరవ సభలో నిలబడి మాట్లాడటమా అని గొడవ చేశారు. అయినా గోవిందు పిళ్లే ప్రతిపాదనని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. బడుగుజీవుల విముక్తి విద్య మీద ఆధారపడి ఉందని అయ్యంకాళి నమ్మాడు. చదువుకోవడానికి పిల్లలను బయటి రాష్ట్రాలకు పంపటం ఆర్థికంగా వెసులుబాటు కాదని తెలుసు. అయ్యంకాళి చివరకు ప్రజాసభ సభ్యుని హోదాలో దివాన్ కార్యాలయానికి వెళ్ళాడు. కానీ అక్కడి కాపలాదారులు అతనిని లోపలికి అనుమతించ లేదు. అయ్యంకాళి బయటకు వెళ్ళి దివాన్ పేరిట టెలిగ్రామ్ ఇచ్చారు. నిముషాల లోపున అయ్యంకాళిని అనుమతించండి అని దివాన్ ఇచ్చిన ఆజ్ఞతో అయ్యంకాళి దివాన్‌ను కలిశారు. భూములు అడిగినందుకు మమ్మల్ని ఊళ్ళ నుంచి, ఇళ్ళ నుంచి తరిమేశారు. చివరికి మేము ఉన్నది కూడా పోగొట్టుకున్నాం. అందుకోసం మాకు ప్రభుత్వ భూమి కేటాయించాలని నిరక్షరాస్యుడైన పులయనేత అయ్యంకాళి ప్రసంగం దివాన్‌ను ఆకర్షించింది. పులయాలకు సహాయపడటానికి ప్రభుత్వం 500ల ఎకరాల భూమి విలాప్పిల్‌పగుతీలో ఇచ్చింది. అయ్యంకాళి ఇంటా, బయట చట్టసభలోనూ దళితుల సంక్షేమం కోసమే కృషి చేశారు.

**పెరినాడు అల్లర్లు**

దళిత స్వాతంత్ర్యం కోసం పోరాటం కొనసాగుతూనే ఉంది. డిమాండ్లు, వేతనాల సవరణ పనిగంటల తగ్గింపు దాకా ఎదిగాయి. భూస్వాములు కూలీలతో క్రూరంగా ప్రవర్తించ సాగారు. దళితుల్లో యువకులు అగ్రవర్ణాల దౌర్జన్యాన్ని ప్రతిఘటించడానికి సన్నద్ధమవుతున్నారు. ప్రథమ ప్రపంచ యుద్ధం వల్ల ఆర్థిక పరిస్థితులు కూడా పూర్తిగా దిగజారాయి. కూలీలు రోజులో 12గం॥ల దాకా పనిచేసినా

భూస్వామి సంతృప్తి చెందటం లేదు. రోజు కూలీగా ఒకటిన్నర కిలోల ధాన్యం ఇస్తే దాంట్లో అరకిలో తాలు ఉండేది. కూలీగా ఇచ్చిన ధాన్యం లో భూస్వాములు ఆ తాలును చెరిగేవారు కాదు. పనికి కొంచెం ఆలస్యంగా వచ్చినా తన్నులే. ఉతికిన బట్టలు వేసుకున్నా తన్నులే. దళితులందరూ మోకాళ్ళు పైనుంచి ఛాతి వరకు మాత్రమే దుస్తులు ధరించాలి. తేడా వస్తే చెట్టుకు కట్టేసి కొట్టేవారు. దళిత కూలీకి కుటుంబ సంబంధాలు ఉండకూడదు. భూస్వామి లాలస కోసం కూలీల గుడిసెల్లో ఒక ప్రత్యేక గుడిసె ఏర్పాటు చేయాలి. దళిత కూలీల ఇంట్లోని మహిళలు భూస్వామి కోరికలు తీర్చాలి, ఇది దురాచారం. ఆ దశలో అయ్యంకాళి దళిత మహిళలకు ఒక సందేశం ఇచ్చారు. మెడ చుట్టూ వేసుకునే చెక్కిన రాతి నక్లీసులను విడనాడాలని పిలుపునిచ్చారు. ఈ నక్లీసులు బానిసతనానికి గుర్తు. మెడల మీదుగా చనుకట్టు పై వేలాడే ఆ గొలుసులు తప్ప దళిత మహిళలు పైన ఏమి ధరించకూడదనేది అప్పటిదాకా ఆచారం. అవి పాముల్లా వేలాడేవి. గాజుతోనూ, రాళ్ళతోనూ చేసిన ఈ గొలుసులు దళిత మహిళల మెడ చుట్టూ కప్పేసి ఉండేవి. మణికట్టు చుట్టూ కట్టుకునేవారు. చెవులకి జూకాల్లాగా ఇనుప ఆభరణాలు ఉండేవి. బానిస గుర్తులకు వ్యతిరేకంగా అయ్యంకాళి పోరాటం ప్రారంభించారు. ఆ పోరాటంలో విజయం సాధించారు. పాత సాంప్రదాయాలు విడనాడాలనే అయ్యంకాళి ఇచ్చిన పిలుపు సవర్ణులైన కొల్లాములను ఒక ఊపు ఊపింది.

**పులయ దేవాలయ ప్రవేశ ఉద్యమం**

1917లో 2 వేల మంది పులయాలతో ఒక చారిత్రకాత్మకమైన ఊరేగింపు నిర్వహించి చెంగలూరు దేవాలయంలోకి ప్రవేశించాడు. దేవాలయ ప్రవేశం ఆర్డినెన్స్ వెలువడే కన్నా పదేళ్ళు ముందు ఇది జరిగింది. అందువల్ల దీన్ని దేశంలోనే మొట్టమొదటి దేవాలయ ప్రవేశంగా పేర్కొనవచ్చు. అంటరాని వాళ్ళ కోసం, దళితుల కోసం చివరి వరకు పోరాడిన సంస్కర్త శ్రీ అయ్యంకాళి. అగ్రకులాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా డాక్టర్ భీమ్‌రావు అంబేద్కర్ చేసిన పోరాటం ఎరవాడ జైలులో నిరసన దీక్షలో ఉన్న గాంధీజీ ప్రాణం రక్షించడానికి 1932లో పూనా ఒడంబడికపై ఆయన సంతకం చేయటం భారతీయ స్వాతంత్ర్య చరిత్రలో మరపురాని ఘట్టాలు. నిమ్నవర్గాల అభ్యున్నతి కోసం శ్రీ నారాయణ గురు చేపట్టిన కార్యక్రమాలు దళితులు చైతన్యానికి ఉపయోగపడ్డాయి. దక్షిణ మధ్య కేరళలో నిమ్నవర్గాలు సంస్థలు స్థాపించిన తరువాత పోరాటాలు మలబారుకు కూడా వ్యాపించాయి. చిరగల్ తాలూకాల్లో అంటరాని వాళ్ళు తమ డిమాండ్ల సాధనకు కదలటంతో అక్కడి పోలీసులు వాళ్ళను చితకబాదారు. ఈ దౌర్జన్యాలకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా కొందరు సామాజిక కార్యకర్తలు సత్యాగ్రహం జరపాలని నిర్ణయించారు. 30 సంవత్సరాల సేవ, అనేక పోరాటాల వల్ల సాధుజన పరిపాలనా సంఘం ఒక మహా సంస్థగా ఆవిర్భవించింది. తరతరాలుగా అనుభవిస్తున్న బాధల నుండి, నూన్యత నుండి కొద్దిపాటి ఉపశమనం కలిగింది. దళితుల దేవాలయ ప్రవేశం గొప్ప వారి గొప్పబుద్ధి వల్ల సాధ్యమైందని, చరిత్ర కారులు చెప్పవచ్చు. కానీ దేవాలయాల గేట్లు అందరికీ తెరుచుకోవటం వెనుక అంటరాని వాళ్ళ జీవన్మరణ పోరాటాలు, నెత్తుటి త్యాగాలు, నిరుపమాన ధైర్యసాహసాలు ఉన్నాయన్నది చారిత్రక వాస్తవం.

**అయ్యంకాళి – మహాత్మాగాంధీ**

నిరక్షరాస్యుడు, బుద్ధిశాలి అయ్యంకాళి గురించి మహాత్మాగాంధీ విన్నారు. ఒక అంటరాని వారికే కాదు, కేరళ ప్రజలకు అయ్యంకాళి చేసిన సేవలు కూడా గాంధీకి తెలుసు. 1937లో కేరళలో ఒక మారుమూలన ఉన్న వెంగనూరులో అయ్యంకాళిని కలుసుకోవటానికి మహాత్మాగాంధీ వెళ్ళారు. అయ్యంకాళిని చేరువుగా తీసుకొని కూర్చోపెట్టుకోవటం, అక్కడ కూడిన పెద్దలకు దిగ్భ్రాంతిని కలిగించింది. గాంధీ మాట్లాడుతూ నువు చేస్తున్న పనంతా నాకు తెలుసు, నేను కూడా నీ వయసువాడినే, మనిద్దరం స్వేచ్ఛకోసం పోరాడుతున్నాం, మీ పనిని కొనసాగించండి అన్నారు. దానికి అయ్యంకాళి, మహాత్మాజీ మీ దయను నేను మర్చిపోలేను. మేము బడిలో చదువుకునే స్వేచ్ఛ సంపాదించాం. దేవాలయాల్లో పూజల కోసం ప్రవేశాన్ని సాధించాం. బానిస బంధాలను తెగదెంచేదానికి పోరాడుతున్నాం అని చెప్పాడు. ఇంకా మీ ప్రజలకు ఏం కావాలని గాంధీ అడిగారు. నేను చనిపోయేలోపు దళితుల్లో 10మంది బి.ఏ గ్రాడ్యుయేట్స్‌ను చూడాలని ఉంది, అని అయ్యంకాళి విన్నవించారు. నీ పని కొనసాగించు, నీ కోరిక తీరుతోంది అని గాంధీగారు చెప్పారు. జాతీయోద్యమంలో కూడా అయ్యంకాళి తనవంతు పాత్రను నిర్వహించారు. జాతి విముక్తి పోరాటాలకు ఆకర్షితులైన యువకుల విప్లవ ఉత్తేజాన్ని చూడలేని అంధుడు కాదు అయ్యంకాళి. అతను వాళ్ళనాపలేదు. జాతీయ స్వాతంత్ర్య పోరాటంలో ఎవరి పాత్ర వారు పోషించాలని దీర్ఘకాలంలో దేశభక్తులు ఈ స్రవంతిలో ఉండాలని ఆయన కోరారు. శారీరక శ్రమ చేసేవారంతా నా సోదరులు. రోజంతా కష్టపడి, శ్రమ మర్చిపోవడానికి ఆడ, మగా కలిసి కల్లు దుకాణానికి వెళ్ళటం తగదని, ఇది కుటుంబాల్లో దరిద్రాన్ని పెంచుతుందని, మనలో శుభ్రత, శుచి లేకుండా చేస్తుందని, మన ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుందని, కనుక మనం తాగకూడదని ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఆ సమావేశానికి వేలాదిమంది హాజరయ్యారు. చేతులు ఎత్తటం ద్వారా ఆ మాటను అంగీకరించినట్లుగా ప్రజలు హర్షామోదం తెలిపారు. అయ్యంకాళి ఆరోగ్యం క్షీణించటం ప్రారంభమయ్యింది. ఉబ్బసం ఆయనను ఇబ్బంది పెట్టింది. 1941 కల్లా అయ్యంకాళి పూర్తిగా లేవలేని స్థితికి చేరుకున్నారు. ఆయన 1941 జూన్ 18న ఉబ్బసం వ్యాధితో మరణించారు. ఆ విధంగా ధైర్యసాహసాలు కలిగిన ఒక కేరళ పుత్రుడు తన జీవిత కోర్కెలు సఫలమయ్యే సమయం ఎంతో దూరం లేదన్న సంతృప్తితో ప్రశాంతంగా మరణించారు. హరిజనులలో స్వాతంత్రేచ్ఛ, ఆత్మవిశ్వాసం నింపిన మొదటి మహనీయుడిగా అయ్యంకాళి కేరళ సంస్కర్త పేరుకు అర్హుడు.


అయ్యంకాళి నాయకత్వంలో జరిగిన 1907 చారిత్రాత్మక వ్యవసాయ కూలీల సమ్మె దేశానికే కొత్త ఒరవడిని దిద్దిందని 1980 మార్చిలో కామ్రేడ్ ఇ.యం.ఎస్. నంబూద్రిపాద్ అన్నారు. అంబేద్కర్, అయ్యంకాళీల పాత్రను ఎవరూ దాచిపెట్టలేరు. సమాజానికి ఆయన చేసిన సేవలు అంచనా కట్టడానికి 40 సం॥లు పట్టిందని అన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి ఇ.కె. నయనార్ మాట్లాడుతూ భారతదేశంలో అయ్యంకాళి మొట్టమొదటి కూలీల నాయకుడు. అసంఘటితంగా, చిన్న చిన్న సమూహాలుగా ఉన్న కూలీలం దర్నీ ఆయన ఒక తాటిపైకి తెచ్చి, వారికి సంఘటిత శక్తి ఏంటో తెలియజెప్పారు అని అన్నారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ మాటల్లో ఆయన తన ప్రజల సమానత్వ కాంక్షల ఫలితంగా ఆవిర్భవించిన మనిషి. భారతదేశం ముద్దుబిడ్డ ఈ సమాజపు బాగు కోసం జీవితాన్ని ధారపోశారు అంది. పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్ళు తప్ప అనే చైతన్యాన్ని యువతలో నింపాడు. ఆ నినాదాన్ని అందుకుని యువత ముందుకు సాగింది. వివక్షకు వ్యతిరేకంగా పోరాడటమే అయ్యంకాళికి మనమిచ్చే నిజమైన నివాళి.

**సేకరణ: గుండు నారాయణరావు,**
**సాహితీస్రవంతి.**

❋

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-02-2017 (36 pages) Postal Regd. No VJ/172/2015-17

# పెట్టుబడి స్వీయ ప్రయోజనమే పనిదినాన్ని నిర్ణయిస్తుంది



**కారల్‌మార్క్స్**

"పని దినం అంటే ఏమిటి? శ్రమ శక్తి యొక్క రోజువారీ విలువను కొనే పెట్టుబడి ఆ శ్రమ శక్తిని యెంత కాలం పాటు వినియోగించుకోవచ్చు? శ్రమశక్తిని పునరుత్పత్తి చేయడానికి అవసరమైన పనికాలాన్ని దాటి పనిదినాన్ని ఎంత వరకూ విస్తరించవచ్చు?" ఈప్రశ్నలకు పెట్టుబడి ఇలా సమాధానం ఇస్తుందని గమనించబడింది. పని దినంలో 24 గంటలుంటాయి, దానిలో నుండి యే విశ్రాంతి లేకుంటే శ్రమశక్తి మళ్లీ తన సేవలనందించడానికి పూర్తిగా నిరాకరిస్తుందో ఆ విశ్రాంతి కొరకు కొద్దిపాటి గంటల్ని తీసేయాలి. కనుక కార్మికుడు తన జీవితమంతా శ్రమశక్తిని వినియోగించటానికి గాక మరేమీ కాదనేది స్పష్టం. కనుక అతను వెచ్చించగల కాలమంతా ప్రకృతి సిద్ధంగానూ, చట్టబద్ధంగానూ పెట్టుబడి స్వయం విస్తరణకు అంకితమయ్యే శ్రమకాలమే. విద్యకీ, బౌద్ధిక అభివృద్ధికీ, సామాజిక విధులను నిర్వహించడానికీ, ఆదివారం నాటి విశ్రాంతి కాలానికి సైతం (అదీ ఆదివారాన్ని పవిత్ర దినంగా ఎంచేవారి దేశంలో) అవసరమైన కాలం – యెంత మూర్ఖత్వం! అయితే అదనపు శ్రమకోసం తన గుడ్డి దుర్వారమైన కాంక్షలో, తన తోడేలు ఆకలిలో పెట్టుబడి పని దినం యొక్క నైతిక హద్దుల్నే కాక, భౌతిక హద్దుల్ని సైతం అతిక్రమిస్తుంది. అది శరీరం పెరుగుదలకీ, అభివృద్ధికీ, ఆరోగ్యకర నిర్వహణకీ అవసరమైన సమయాన్ని స్వాహా చేస్తుంది. తాజాగాలినీ, సూర్యరశ్మినీ అనుభవించడానికి అవసరమైన కాలాన్ని అది దొంగిలిస్తుంది. అది భోజనాల వేళ విషయంలో కొసరు బేరాలాడుతుంది, సాధ్యమైన చోటల్లా దాన్ని ఉత్పత్తి ప్రక్రియలో కలిపేస్తుంది. ఆ రకంగా బాయిలర్‌కు బొగ్గు అదించినట్టూ, యంత్రానికి గ్రీజూ, ఆయిలూ అందించినట్టూ, ఉత్పత్తి సాధనాలకు అందిచినట్టే కార్మికులకు కూడా ఆహారాన్నందిస్తుంది. శారీరక శక్తులు తిరిగి పని చేయడానికీ, పునరుద్ధరింపబడటానికీ, సేద దీరటానికీ అవసరమైన గాఢ నిద్రను, పూర్తిగా శక్తి ఉగిపోయిన జీవియొక్క పునరుద్దరణకు తప్పని సరైన సమయాన్ని ఇన్ని గంటల జడత్వంగా అది కుదిస్తుంది. పని దినం పరిస్థితుల్ని నిర్ణయించేది శ్రమశక్తి సుస్థితిలో ఉంచే అవసరాలు కాదు, అది రోగపీడితమైనా, నిర్బంధమైనా, బాధాకరమైనా సాధ్యమైనంత ఎక్కువ శ్రమశక్తి యొక్క రోజువారీ వ్యయమే కార్మికుని విరామ వ్యవధి యొక్క పరిమితుల్ని నిర్ణయిస్తుంది. శ్రమశక్తి జీవిత కాలం గురించి పెట్టుబడి ఏ మాత్రం లక్ష్య పెట్టదు. ఒక పని దినంలో రాబట్టడానికి వీలైన అత్యధిక శ్రమశక్తిని మత్రమే అది సూటిగా పట్టించుకుంటుంది. పెట్టుబడిదారుడు కార్మికుని ఆయుస్సును క్షీణింపజేస్తూ యీ లక్ష్యం సాధిస్తాడు.

ఆ రకంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం (ముఖ్యంగా అదనపు విలువ ఉత్పత్తి, అదనపు శ్రమను పీల్చుకోవడం) అనేది పని దినాన్ని విస్తరించంతో మానవ శ్రమశక్తి యొక్క శారీరక అభివృద్ధికీ, క్రియాశీలతకూ అవసరమైన మాములూ నైతిక, భౌతిక పరిస్థితులను దోచుకోవడం ద్వారా ఉత్పత్తి చేసేది దాని క్షీణతని మాత్రమే గాదు. స్వయంగా ఈ శ్రమశక్తి యొక్క అకాల అశక్తతనూ, మరణాన్నీ ఉత్పత్తి చేస్తుంది. అది కార్మికుని వాస్తవ ఆయుస్సును తగ్గించడం ద్వారా ఒక నిర్ణీత కాలపరిమితిలో అతని ఉత్పత్తి కాలాన్ని పొడిగిస్తుంది.

అయితే శ్రమశక్తి విలువలో కార్మికుని పునరుత్పత్తికి లేదా కార్మిక వర్గాన్ని నిలబెట్టి ఉంచడానికి అవసరమైన సరుకుల విలువ కూడా ఉంటుంది. స్వయం విస్తరణ కోసం లెక్కలేనంత ఉద్వేగంతో పెట్టుబడి తప్పనిసరిగా చేసే ప్రయత్నంలో జరిగే పనిదినం యొక్క అసహజ విస్తరణ వృష్టి కార్మికుని జీవిత కాలాన్ని ఆ కారణంగా అతని శ్రమశక్తి వ్యవధినీ తగ్గిస్తే వాడేయబడిన శక్తుల్నీ అంతకంటే యెక్కువ వేగంతో వునస్థాపించాలి, అంటే శ్రమశక్తి పునరుత్పత్తికయ్యే ఖర్చుల మొత్తం పెరుగుతుంది, ఒక యంత్రం యెంత శీఘ్రంగా అరిగిపోతే దానిలో రోజువారీ పునరుత్పత్తికి కావల్సిన విలువ భాగం కూడా అంతే యెక్కువగా ఉన్నట్లు. కనుక పెట్టుబడి యొక్క స్వీయ ప్రయోజనమే మామూలు పని దినాన్ని నిర్దేశిస్తున్నట్టుగా కన్పిస్తుంది.

బానిస యజమాని తన గుర్రాన్ని కొన్నట్టే తన బానిసనీ కొంటాడు. అతడు తన బానిసని కోల్పోతే తన పెట్టుబడిని కోల్పోతాడు. బానిసను భద్రంగా నిలుపుకోవడం యజమానికి ప్రయోజనకరం కనుక, ఆర్థిక పరిగణనల వల్ల యజమాని బానిస పట్ల మానవతా దృష్టితో వ్యవహరిస్తాడు. బానిసల వ్యాపారం అమల్లోకి రాగానే బానిస శ్రమని అత్యధికంగా పిండడానికి ఆర్థిక పరిగణనలే కారణమవుతాయి. ఎందుకంటే బానిస స్థానాన్ని వెంటనే విదేశీ నిల్వలతో భర్తీ చేయగలిగినప్పుడు అతను జీవించి ఉండగా అతని ఉత్పాదకత కంటే అతని ఆయుస్సు అనేది తక్కువ ప్రాధాన్యం గల విషయంగా మారుతుంది.

పేరు మారింది. కాని అది నీ కథే. బానిస వ్యాపారానికి బదులు కార్మిక మార్కెట్ అనీ, కెంటకీ, వర్జీనియాలకి బదులు ఐర్లండ్ అనీ, ఇంగ్లండ్, స్కాట్లండ్, వేల్స్‌ల్లోని వ్యవసాయ జిల్లాలనీ,ఆఫ్రికాకి బదులు జర్మనీ అనీ చదవాలి. లండన్ బేకర్ల సంఖ్య అధిక పని భారంవల్ల యెలా పల్చబడిందో మనం విన్నాం. అయినప్పటికీ యెప్పుడూ బేకరీల్లో చావడానికి వచ్చే జర్మన్ తదితర కార్మికులతో లండన్ కార్మిక మార్కెట్ నిండిపోయి ఉంటుంది. **(పెట్టుబడి గ్రంథం నుండి ఈ వ్యాఖ్యలు గ్రహించబడ్డాయి)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Hyderabad Prajasakti Printing Press, Plot Not. 21/1, Azamabad, Hyderabad-20. Phone : 040-27673787. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.11, No.10. Published on February 1, 2017